

www.andhrajyothy.com

వెల (Price) : Rs. 6.50

హైదరాబాద్ సిటీ*

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 66

సంచిక (Issue) : 195

శుక్రవారం | 31-10-2025 పేజీలు: 14

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: నవమి ఉ.10:04 తదుపరి దశమి; నక్షత్రం: ధనిష్ఠ రా.6:51 తదుపరి శతభిషం; వర్జ్యం: రా.1:53-3:27; దుర్ముహూర్తం: ఉ.8:33-9:19, మ.12:21-1:07; అమృతఘడియలు: ఉ.8:19-9:56; రాహుకాలం: ఉ.10:30-12:00; సూర్యోదయం: 6:16; సూర్యాస్తమయం: 5:40

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



జట్టు సభ్యులతో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సంతోషం

వారెవ్వా.. ఏం ఆట!

మహిళల వరల్డ్‌కప్ ఫైనల్లో భారత్

సెమీఫైనల్‌లో ఆసీస్‌పై సంచలన విజయం

339 పరుగుల రికార్డు లక్ష్యాన్ని ఛేధించిన భారత్

జెమీమా రోడ్రిగ్స్ సూపర్ సెంచరీ

డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా నాకౌట్

సౌతాఫ్రికాతో ఆదివారం ఫైనల్ ఫైట్

ముంబై, అక్టోబరు 30: ప్రత్యర్థి బలమైన ఆస్ట్రేలియా.. లక్ష్యం 339 పరుగులు.. పట్టుమని పది ఓవర్లు కూడా పూర్తి కాకుండానే స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన, షెఫాలీ వర్మ ఔటయ్యారు. అంతే.. ఇక మ్యాచ్ పోయిందిలే.. అని అభిమానులందరిలోనూ ఓ నిస్పృహ. కానీ, ఎవరూ ఊహించని విధంగా జెమీమా రోడ్రిగ్స్(127 నాటౌట్) సూపర్ సెంచరీతో మాయ చేసింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (89)తో కలిసి చెలరేగిన జెమీమా.. ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్ సెమీఫైనల్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాపై భారత్‌ను గెలిపించి వారెవ్వా అనిపించింది. దీంతో వన్డే వరల్డ్‌కప్ ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్ అదే క్రమంలో మహిళ వన్డే క్రికెట్ చరిత్రలో భారీ లక్ష్యాన్ని పూర్తి చేసిన జట్టుగా రికార్డు సృష్టించింది. అలాగే, లీగ్ దశలో ఇరుజట్ల మధ్య జరిగిన హైస్కోరింగ్ మ్యాచ్‌లో కంగారూలు చేతిలో ఎదురైన పరాభవానికి ప్రతీకారం తీర్చుకుంది. గురువారం జరిగిన సెమీస్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 49.5 ఓవర్లలో 338కి ఆలౌటైంది. అనంతరం ఛేజింగ్‌లో 48.3 ఓవర్లు ఆడిన భారత్ మరో 9 బంతులు మిగిలుండగానే 341/5 చేసి విజయం సాధించింది. కీలక మ్యాచ్‌లో సూపర్ బ్యాటింగ్‌తో చెలరేగిన జెమీమా.. 2017 వరల్డ్‌కప్ సెమీస్‌లో ఆసీస్‌పై హర్మన్‌ప్రీత్ కౌర్(171 నాటౌట్) ఆడిన ఇన్నింగ్‌ను గుర్తుకు తెచ్చింది. ఆదివారం ఫైనల్‌లో భారత్ సౌతాఫ్రికాతో తలపడనుంది.



జెమీమా రోడ్రిగ్స్ (127 నాటౌట్)

వరంగల్ జిల్లా చెన్నారావుపేటలో నీట మునిగిన పత్తి పంట



ఆదుకోవాలని సిద్దిపేట కలెక్టర్‌ను వేడుకుంటున్న తారవ్వ



4,47,864 ఎకరాల్లో పంట నష్టం

మొంథా తుఫాన్ దెబ్బతో వరంగల్, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో తీవ్ర నష్టం

12 జిల్లాల్లోని 179 మండలాల్లో ప్రభావం

నష్టపోయిన రైతులు 2.5 లక్షల మందిపైనే..

వ్యవసాయ శాఖ ప్రాథమిక నివేదిక

సమగ్ర సర్వే తర్వాత పూర్తిస్థాయి నిర్ధారణ

ఎకరాకు 10వేలు పరిహారం ప్రకటించే చాన్స్

రాష్ట్రవ్యాప్తంగా రోడ్లకు రూ.225 కోట్ల నష్టం

అప్రమత్తంగా ఆర్అండ్‌బీ: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను రాష్ట్ర రైతాంగం నడ్డివిరిచింది. చేతి కొచ్చే దశలో ఉన్న పంటలను ఊహించని విధంగా దెబ్బతీసింది. తుఫాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 4,47,864 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు వ్యవసాయ శాఖ ప్రాథమిక సర్వేలో గుర్తించింది. ఇందులో సగానికిపైగా వరి పంటే ఉందని.. పత్తి, మొక్కజొన్న, మిర్చి, వేరుశనగ, పప్పుధాన్యాలు, ఇతర పంటలకూ నష్టం జరిగిందని గుర్తించింది. రాష్ట్రంలో 12 జిల్లాల్లోని, 179 మండలాల్లో తుఫాన్ ప్రభావం చూపిందని, 2.53 లక్షల మంది రైతులు పంటలు నష్టపోయారని లెక్కతేల్చింది. ముఖ్యంగా

మిగతా 13వ పేజీలో...

ప్రాణ నష్టం జరగొద్దు

వర్షాలు, వరదలతో జాగ్రత్త

24 గంటలూ సమీక్షించాలి

కలెక్టర్లు ఎప్పటికప్పుడు మంత్రులకు సమాచారమివ్వాలి

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నేడు వరంగల్, హుస్నాబాద్‌ల్లో సీఎం ఏరియల్ సర్వే

12

తారవ్వ బువ్వ వరదపాలు

డ్రైనేజీలో కొట్టుకుపోయిన 150 క్వింటాళ్ల వడ్లు

13

గంపతో ఎత్తిపోసిన రైతు తారవ్వ

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఘటన

ఆదుకోవాలంటూ కలెక్టర్ కాళ్లమీద పడి రోదన

రాష్ట్రవ్యాప్తంగా రైతులది ఇదే పరిస్థితి

వరదలకు ఐదుగురి మృతి, ముగ్గురి గల్లంతు.. 168 గొర్రెలు మృతి

ముంపులో వరంగల్, హనుమకొండ

మున్నేరు సమీపంలోని ఇళ్లలోకి నీరు

మంత్రిగా అజారుద్దీన్.. ప్రమాణం నేడే

మధ్యాహ్నం 12.15 గంటలకు ప్రమాణం చేయించనున్న గవర్నర్

వివిధ కేసుల్లో నిందితుడైన అజర్‌కు మంత్రి పదవా?

కోడ్ అమల్లో ఉండగా ఇవ్వడం చట్ట విరుద్ధం: కిషన్‌రెడ్డి

సీఈవోకు బీజేపీ నేతల ఫిర్యాదు



హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారైంది. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాలులో శుక్రవారం మధ్యాహ్నం 12.15 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ముఖ్య నాయకులు పాల్గొననున్నారు. అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవాలని నిర్ణయించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు సమాచారం అందజేశారు. అజారుద్దీన్‌తో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రమాణ స్వీకారానికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలంటూ గవర్నర్ కార్యాలయం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి గురువారం లేఖ రాసింది. దీంతో అజారుద్దీన్ ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారైంది. కాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో అజర్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కోడ్ ఏమైనా అడ్డు వస్తుందా? అని ప్రభుత్వ వర్గాలు ఈసీ అధికారులను ఆరా తీసినట్లు తెలిసింది. మంత్రివర్గ విస్తరణకు ఉప ఎన్నికల కోడ్ అడ్డురాదని వారు వివరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ప్రమాణ స్వీకారానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. మరోవైపు ఉప ఎన్నిక నేపథ్యంలో మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం నిబంధనలకు విరుద్ధమంటూ బీజేపీ నేతలు

మిగతా 12వ పేజీలో...

బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు

అజారుద్దీన్‌ను క్యాబినెట్‌లోకి తీసుకోనివ్వకుండా యత్నాలు

ప్రమాణం చేయించకుండా గవర్నర్‌పై ఒత్తిడి

2

బీఆర్ఎస్‌కు లాభం కోసమే..

దేశానికి కీర్తి తెచ్చిన క్రీడాకారుడు అజారుద్దీన్‌ను అడ్డుకుంటారా?

రాజస్థాన్‌లో ఓ ఉప ఎన్నికకు ముందు ఏకంగా అభ్యర్థినే మంత్రి వర్గంలోకి బీజేపీ తీసుకుంది

డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

రొమ్ము క్యాన్సర్ రాజధానిగా హైదరాబాద్!

సగటున దేశంలోనే అత్యధిక కేసులు ఇక్కడే

జాతీయ సగటు లక్షకు 26.6

హైదరాబాద్ సగటు 54

తర్వాతి స్థానాల్లో చెన్నై, బెంగళూరు, ముంబై, ఢిల్లీ

10

ఆలస్య వివాహాలు, ఆలస్య ప్రసవాలు, పిల్లలకు ఎక్కువ కాలం పాలు ఇవ్వకపోవడం, అధిక బరువు కారణాలు

స్టార్ ఆస్పత్రి ఆంకాలజిస్ట్ డాక్టర్ సాయినాథ్ వెల్లడి

ఆడిషన్స్ పేరుతో పిలిచి.. బందీలుగా!

17 మంది పిల్లలను బంధించిన నిందితుడు

14

ముంబైలోని పొవైలో ఘటన

పోలీసుల రెస్క్యూ ఆపరేషన్

కాల్పుల్లో నిందితుడి మృతి



దక్షిణాఫ్రికా బూసాన్ ఎయిర్‌పోర్టులో జిన్‌పింగ్‌తో ట్రంప్

వర్క్ పర్మిట్ల ఆటో-రెన్యువల్‌కు అమెరికా స్వస్తి

ఆ దేశంలో ఉన్న వేలాది మంది భారతీయ ఉద్యోగులపై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ, అక్టోబరు 30: అమెరికాలో వలస కార్మికుల వర్క్ పర్మిట్ల ఆటోమేటిక్ పునరుద్ధరణను రద్దు చేస్తున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) ప్రకటించింది. వలస విధానాలను మరింత కఠినతరం చేసే చర్యల్లో భాగంగా ట్రంప్ యంత్రాంగం ఈ మేరకు నిర్ణయించింది. అమెరికాలోని ప్రవాస శ్రామిక శక్తిలో మెజారిటీ వాటా కలిగిన వేలాది మంది భారతీయ ఉద్యోగులను ఈ నిర్ణయం తీవ్రంగా ప్రభావితం చేస్తుందన్న ఆందోళన

మిగతా 14వ పేజీలో...

చైనాతో ట్రంప్ రాజీ!

సుంకాలు 57 శాతం నుంచి 47 శాతానికి తగ్గింపు

14

ఏడాదిపాటు అరుదైన లోహాల సరఫరాకు చైనా ఓకే

అమెరికా నుంచి సోయా ఉత్పత్తుల దిగుమతులకు సమ్మతి

అణు పరీక్షలు మొదలుపెట్టండి

పెంటగాన్‌కు ట్రంప్ ఆదేశం

53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

నియామక ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము

కేంద్ర న్యాయ శాఖ నోటిఫికేషన్ జారీ.. 24న ప్రమాణం

2027 ఫిబ్రవరి 9 దాకా పదవిలో జస్టిస్ సూర్యకాంత్



న్యూఢిల్లీ, అక్టోబరు 30: సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. కేంద్ర న్యాయ శాఖ ఈ మేరకు గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. నవంబరు 23న ప్రస్తుత సీజేఐ జస్టిస్ భూషణ్ ఆర్ గవాయ్ పదవీ విరమణ చేయనున్న సంగతి తెలిసిందే. దీంతో నవంబరు 24న జస్టిస్ సూర్యకాంత్ 53వ సీజేఐగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన దాదాపు 15 నెలల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. 2027, ఫిబ్రవరి 9న జస్టిస్ సూర్యకాంత్ పదవీ విరమణ చేస్తారు. "భారత రాజ్యాంగం కల్పించిన అధికారం మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. జస్టిస్ సూర్యకాంత్‌ను నవంబరు 24 నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు" అని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. జస్టిస్ సూర్యకాంత్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న తొలి హరియాణా వాసి కావడం గమనార్హం.



మావోయిస్టు డంపుల్లో 400 కిలోల బంగారం?

- భారీగా పసిడి నిల్వలు ఉండొచ్చని అనుమానాలు
- కొవిడ్ సమయంలో పుత్తడి రూపంలోకి నగదు మార్పు
- బంగారం నిల్వలను గుర్తించడంపై నిఘా వర్గాల దృష్టి
- డొల్ల కంపెనీలు, బ్యాంకు ఖాతాల్లో భారీగా నిధులు
- రూ.400 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ తర్వాత మావోయిస్టు అగ్రనేతల నుంచి సాధారణ దళ సభ్యుల వరకు లొంగుబాట పట్టారు. మావోయిస్టులు భారీ సంఖ్యలో లొంగిపోతున్న క్రమంలో వారు సేకరించిన రూ.కోట్ల నగదు ఎక్కడ, ఎవరి అధీనంలో ఉంది? డంపుల సంగతేంటి? అనే అంశాలపై నిఘా వర్గాలు దృష్టి సారించగా.. విస్తుపోయే విషయాలు వెలుగు చూసినట్లు తెలుస్తోంది. మావోయిస్టులు సేకరించిన రూ.వందల కోట్ల నగదును కొవిడ్ సమయంలో బంగారం రూపంలోకి మార్చివేసినట్లు నిఘా వర్గాలు



మిగతా 3వ పేజీలో...



బతికున్న వ్యక్తి.. మార్చురీకి తరలింపు!

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం.. మహబూబాబాద్ ప్రభుత్వాస్పత్రిలో ఘటన.. స్వీపర్ల ద్వారా వెల్లడి

3

పోలీసుల జోక్యంతో మర్నాడు ఎమర్జెన్సీ వార్డుకు



జూబ్లీహిల్స్‌లోని కృష్ణానగర్‌లో దోశ వేస్తున్న పొన్నం, చిత్రంలో ఉత్తమ్

కూలీలకు రూ.400, విద్యార్థులకు వెయ్యి!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో దినసరి కూలీలు

రోజుకు రూ.400-800 వరకు కూలీ, భోజనం

ఓటర్ల వివరాల సేకరణకు ఇంటింటికీ విద్యార్థులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని కార్మికుల అడ్డాలు వెలవెలబోతున్నాయి. ఉదయం ఎనిమిది గంటల కల్లా కూలీలతో రద్దీగా ఉండే ఆయా ప్రాంతాలు ఇటీవల ఖాళీగా కనిపిస్తున్నాయి. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని కృష్ణానగర్, రహ్మత్‌నగర్ డివిజన్‌లోని కార్మికనగర్, బోరబండ, శ్రీనగర్ కాలనీ ప్రాంతాల్లో కార్మికుల అడ్డాలు ఉన్నాయి. సాధారణ రోజుల్లో ఉదయం 8 గంటలకే కూలీలంతా అక్కడికి వచ్చి ఉపాధి కోసం నిలబడతారు. ఎవరైనా అటుగా వస్తే.. పని ఉందా సార్ ? అంటూ

మిగతా 2వ పేజీలో...

కూలీలకు 400, విద్యార్థులకు వెయ్యి!

(మొదటిపేజీ తరువాయి)

ఎగబడతారు. అయితే, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచార పర్వం మొదలైనప్పటి నుంచి ఈ అడ్డాల్లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. రాజకీయ పార్టీలు తమ ప్రచార కార్యక్రమాల అవసరాలకు దినసరి కూలీలను వినియోగిస్తుండడమే ఇందుకు కారణం. నియోజకవర్గంలో ఏడు డివిజన్లు ఉండగా.. ఒక్కో రాజకీయ పార్టీ పది నుంచి 12 ప్రాంతాల్లో ఒకేసారి ప్రచారం నిర్వహిస్తోంది. అభ్యర్థి ఉన్నా లేకున్నా పార్టీ ఇన్‌చార్జిలుగా ఉన్న నేతలు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేస్తున్నారు. ప్రచారానికి వెళ్లే బృందాల్లోని నేతల వెంట వందల మంది ఉండేలా పార్టీలు జాగ్రత్త పడుతున్నాయి. ప్రచార బృందాల్లో నాయకులు, కార్యకర్తలు కొంతమంది ఉంటుండగా.. పార్టీ జెండాలు మోసేందుకు, పోస్టర్లు అంటించేందుకు అడ్డా కూలీలను పార్టీలు వినియోగిస్తున్నాయి. కూలీ డబ్బుతో పాటు భోజనం కూడా దొరుకుతుండడంతో కూలీలు కూడా అడ్డాల దగ్గర వేచి ఉండకుండా పార్టీ కార్యాలయాలకే వెళ్లిపోతున్నారు.

రోజుకు 400, మధ్యాహ్నం భోజనం

నియోజకవర్గంలో ఉదయం, సాయంత్రం రెండు దఫాలుగా ప్రచారం జరుగుతోంది. రెండు పూటలా ప్రచారానికి వచ్చిన వారికి రోజుకి రూ.400 నుంచి రూ.600 వరకు, ఒక పూట ప్రచారంలో పాల్గొంటే రూ.200- 300 వరకు కూలీ ఇస్తున్నారు. ఓ పార్టీ అభ్యర్థి రూ.800 కూడా ఇస్తున్నట్టు తెలిసింది. అభ్యర్థి, పార్టీ నేతలు ప్రచార సమయంలో తమ వెంట 100 మందికి తగ్గకుండా జనం ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. ఇందులో 30-40 మంది పార్టీ నాయకులు, కార్యకర్తలుంటే.. మిగతా వాళ్లు కూలీలే. డబ్బుకి డబ్బు, కడుపు నిండా భోజనం లభిస్తుండడంతో కూలీలూ ప్రచార పనికే మొగ్గు చూపుతున్నారు. ఇందిరానగర్‌లో ఉండే జూనియర్ ఆర్టిస్టుల కూడా షూటింగ్‌లు లేనప్పుడు ప్రచారానికి వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. డిమాండ్ ఉండడంతో ఇతర ప్రాంతాల్లోని అడ్డా కూలీలనూ ప్రచారానికి పిలుస్తున్నారు.

విద్యార్థులకు రూ.1000.

ఇంటర్, డిగ్రీ విద్యార్థులను కూడా రాజకీయ పార్టీలు తమ ప్రచారానికి వినియోగించుకుంటున్నాయి. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితా ఇచ్చి ఇంటింటి పరిశీలన చేసే పనిని అప్పగిస్తున్నాయి. విద్యార్థులు తమకు కేటాయించిన బూత్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి.. చిరునామాలో ఆ ఓటర్ ఉన్నాడా..? లేదా..? ఉంటే జాబితాలో వారి పేరుపై టిక్‌చేసి మొబైల్ నెంబర్ తీసుకుంటున్నారు. ఆ వివరాలను సంబంధిత పార్టీ/అభ్యర్థికి ఇస్తున్నారు. ఇందుకుగాను విద్యార్థులకు రోజుకు రూ.1000 చొప్పున పార్టీలు చెల్లిస్తున్నాయి. విద్యార్థులు తెచ్చి ఇచ్చిన సమాచారం ఆధారంగా పార్టీల అభ్యర్థులు ఐవీఆర్‌ఎస్ కాల్స్, సందేశాల ద్వారా ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే, టెలీ కాలర్ల ద్వారా ఫోన్లు చేయించి ఎవరికి ఓటు వేస్తారని కూడా పార్టీలు తెలుసుకుంటున్నాయి.

అజారుద్దీన్‌ను క్యాబినెట్‌లోకి తీసుకోనివ్వకుండా

బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి కుట్రలు

- ఈసీకి బీజేపీ ఫిర్యాదు చేసింది
- ప్రమాణం చేయించకుండా గవర్నర్‌పై ఒత్తిడి
- బీఆర్‌ఎస్‌కు లాభం చేసే కుట్ర
- బీజేపీ, బీఆర్‌ఎస్‌ల కుట్రలను మైనారిటీలు అర్థం చేసుకోవాలి: భట్టి

హైదరాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): క్రీడారంగంలో దేశానికి, తెలంగాణకు పేరు ప్రఖ్యాతి తీసుకొచ్చిన హైదరాబాద్ బిడ్డ.. మహమ్మద్ అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటుంటే స్వాగతించాల్సిందిపోయి అడ్డుకునేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. సుదీర్ఘ కాలం భారత క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన అజారుద్దీన్.. క్రికెట్ రంగంలో దేశానికి ఎంతో సేవ చేశారన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి కుట్రలు చేస్తున్నాయని, ఇందులో భాగంగానే అజారుద్దీన్‌ను రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకోనివ్వద్దంటూ ఎన్నికల కమిషన్‌కు బీజేపీ ఫిర్యాదు చేసిందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు మేలు చేయడం కోసమే బీజేపీ ఈ కుట్ర చేస్తోందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ల తెర వెనక బంధం గురించి కేసీఆర్ కుమార్తె కవిత ఇప్పటికే బయటపెట్టారని గుర్తుచేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సహకారంతోనే రాష్ట్రంలో బీజేపీ 8 సీట్లు గెలుచుకుందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ గెలిచే అవకాశం లేదని ఆ పార్టీ నాయకులకు తెలుసని, అందుకే బీఆర్‌ఎస్‌కు లాభం కలిగించేందుకు బలహీనమైన అభ్యర్థిని చాలా ఆలస్యంగా ప్రకటించిందని ఆరోపించారు. అజారుద్దీన్‌తో ప్రమాణ స్వీకారం చేయించకుండా గవర్నర్‌పైనా బీజేపీ ఒత్తిడి తెస్తున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. కానీ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గొప్ప వ్యక్తి అని, ఆయన ఒత్తిళ్లకు లోను కారనే తాము భావిస్తున్నామని చెప్పారు. రాజస్థాన్ రాష్ట్రం కరణ్‌పూర్ నియోజకవర్గ ఉప ఎన్నికకు 20 రోజుల ముందు బీజేపీ అభ్యర్థి సురేంద్రసింగ్ పాల్‌ను ఆ పార్టీ మంత్రివర్గంలోకి తీసుకుందని భట్టి చెప్పారు. ఇక్కడ అజారుద్దీన్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేయట్లేదని, ఆయన ప్రమాణ స్వీకారం జరిగేది కూడా నియోజకవర్గం వెలుప లేనని గుర్తుచేశారు. పైగా అజారుద్దీన్‌ను శాసనమండలి సభ్యునిగా నియమించాలని మంత్రివర్గం తీర్మానం కూడా చేసిందన్నారు. సురేంద్ర సింగ్, అజారుద్దీన్‌ల విషయంలో బీజేపీ ద్వంద్వ ప్రమాణాలు తేటతెల్లమవుతున్నాయన్నారు. మైనారిటీ అన్న ద్వేషంతో అజారుద్దీన్ ప్రమాణ స్వీకారాన్ని బీజేపీ అడ్డుకుంటోందని విమర్శించారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ల కుట్రలను మైనారిటీలు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మంత్రివర్గంలో మైనారిటీ నేత అజారుద్దీన్‌కు చోటు కల్పిస్తుంటే ఓర్చుకోలేని బీజేపీ, బీఆర్‌ఎస్‌లు.. ఆయనపై కుట్రలు పన్నుతున్నాయని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. మైనారిటీలంటే ఎందుకంత కడుపుమంట అని ఆ పార్టీలను నిలదీశారు. మైనారిటీలంటే బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు నచ్చదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. .

బీఆర్‌ఎస్‌కు బీజేపీ సాయం: మహేశ్

నిజామాబాద్: బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరిందని.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ దుయ్యబట్టారు. బీజేపీ గెలిచే అవకాశం లేదని.. అక్కడి మైనార్టీ ఓట్లు బీజేపీకి పడవని తెలిసి వాటిని బీఆర్‌ఎస్‌కు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

నేడు, రేపు జూబ్లీహిల్స్‌లో సీఎం రోడ్‌షోలు

హైదరాబాద్/వెంగళరావునగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్ర, శనివారాల్లో సీఎం రేవంత్‌రెడ్డి.. రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌ల్లో పాల్గొననున్నారు. శుక్రవారం వెంగళరావునగర్, సోమాజీగూడ డివిజన్లలో, శనివారం బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ తరఫున ఆయన ప్రచారం నిర్వహిస్తారు. సాయంత్రం 7 గంటల నుంచి 8 గంటల వరకు సీఎం రోడ్‌షోలు జరగనున్నాయి. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జూబ్లీహిల్స్ ప్రజలను మంత్రి వాకిటి కోరారు. వెంగళరావునగర్ డివిజన్‌లో ఆయన ప్రచారం నిర్వహించారు.

జూబ్లీహిల్స్ ఎన్నికలో కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

హుజూర్‌నగర్, బర్కత్‌పుర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ ఉప ఎన్నిక విజయంలోనూ కీలక పాత్ర పోషిస్తామన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో జిల్లా పార్టీ విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఐ ఏర్పడిన వందేళ్లలో దేశంలో, రాష్ట్రంలో ఎన్నో చరిత్రాత్మక ఉద్యమాలు, పోరాటాలు చేసిందని తెలిపారు. డిసెంబరు 26న ఖమ్మంలో నూరు వసంతాల ముగింపు సభను భారీ ఎత్తున నిర్వహించనున్నామన్నారు. కాగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా రంజిత్ కుమార్ తెలిపారు. నవీన్‌యాదవ్ విజయానికి మాల మహానాడు కార్యకర్తలు ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తారన్నారు.

నవీన్‌యాదవ్‌ను అనర్హునిగా ప్రకటించండి: బీఆర్‌ఎస్

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ క్యాడర్‌ను వారం రోజుల్లో ఖతంచేస్తానంటూ జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఆయన ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డికి ఆ పార్టీ నేతలు వినతిపత్రం ఇచ్చారు. ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని కోరారు.

మైసూరు బొండాలో మైసూరులా.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జూబ్లీహిల్సే లేదు!

సినీ, రాజకీయ ప్రముఖులు, వీఐపీలకు సంబంధం లేని ఉపఎన్నిక



బంజారాహిల్స్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై తెలంగాణ మాత్రమే కాదు రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రజల్లో ఆసక్తి నెలకొంది. జూబ్లీహిల్స్ పేరు చెప్పగానే సినీ, రాజకీయ ప్రముఖులు, సంపన్నులు, వీఐపీలు నివసించే ప్రాంతమనే గుర్తింపు ఉండడమే ఇందుకు కారణం. కానీ, జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు జూబ్లీహిల్స్ ప్రాంతానికి, ఆ వీఐపీలకు అసలు సంబంధమే లేదన్నది నమ్మలేని నిజం. ఎందుకంటే.. మైసూరు బొండాలో మైసూరు లేనట్టు జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో జూబ్లీహిల్స్ ప్రాంతమే లేదు. అంతేందుకు జీహెచ్‌ఎంసీ పరిధిలోని 114వ వార్డు జూబ్లీహిల్స్ డివిజన్‌లో ఉంది కానీ ఆ వార్డు కూడా జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోకి రాదు. అవును.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఏడు డివిజన్లు షేక్‌పేట, ఎర్రగడ్డ, బోరబండ, రహ్మత్‌నగర్, వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ, సోమాజిగూడ ప్రాంతాలే ఉన్నాయి. అందువల్ల జూబ్లీహిల్స్‌లో నివసించే సినీ రాజకీయ ప్రముఖులకు ఉపఎన్నిక జరిగే ప్రాంతంతో సంబంధమే లేదు. వారిలో చాలా మంది ఖైరతాబాద్ నియోజకవర్గం ఓటర్లే. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అసలు వీఐపీలే లేరు. ఉన్నవారంతా సాధారణ, మధ్యతరగతి ప్రజలే. నియోజకవర్గంలో సుమారు 4 లక్షల మంది ఓటర్లు ఉండగా ఉపఎన్నిక బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు, మరో నలుగురు స్వతంత్ర అభ్యర్థులు మాత్రమే స్థానిక ఓటర్లు. ఓ రకంగా చెప్పుకోవాలంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో వీరే ప్రముఖులు. నియోజకవర్గంలో బస్తీలే అధికంగా ఉన్నాయి. విద్యావంతులు అధికంగా ఉన్నా అందరూ సామాన్యులే. ఇక, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యాలయాలు కూడా తక్కువే. ఇటీవల పోలీసుస్టేషన్ల పునర్విభజన చోటు చేసుకోవడం వల్ల నియోజకవర్గంలో మధురానగర్, బోరబండ పోలీసుస్టేషన్లు ఏర్పాటయ్యాయి. గతంలో పక్క నియోజకవర్గం పోలీసుస్టేషన్ సిబ్బందే ఇక్కడ విధులు నిర్వహించేవారు. ఈ రెండు పోలీసుస్టేషన్లే కాకుండా పక్క నియోజకవర్గాల్లో ఉన్న పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్, టోలిచౌకి, ఫిలింనగర్ పోలీసుస్టేషన్ల పరిధిలోనూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ప్రాంతాలు ఉన్నాయి. రెవెన్యూ సంబంధిత సేవలకు ఖైరతాబాద్‌లో ఉన్న ఖైరతాబాద్, షేక్‌పేట మండలాలకు, సనత్‌నగర్ నియోజకవర్గంలోని ఉన్న అమీర్‌పేట మండలాన్ని ఆశ్రయించాల్సిందే. యూసుఫ్‌గూడలో చిన్నపాటి వార్డు కార్యాలయం తప్పితే ప్రత్యేక ప్రభుత్వ కార్యాలయాలే లేవు. ఇది జూబ్లీహిల్స్ నియోజకవర్గం స్థితి, పరిస్థితి.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌దే విజయం: ఉత్తమ్

- బీజేపీ, బీఆర్‌ఎస్‌వి డ్రామాలు: పొన్నం

యూసుఫ్‌గూడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌దే విజయం అని, అన్ని సర్వేలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని యూసుఫ్‌గూడ, కృష్ణానగర్‌లలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పేదలు నిర్లక్ష్యానికి గురయ్యారని, 20 నెలల కాంగ్రెస్ పాలనలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పేదలకు 40 వేల తెల్ల రేషన్ కార్డుల ఇచ్చామని చెప్పారు. దేశచరిత్రలో మొట్టమొదటిసారిగా నిరుపేదలందరికీ నాణ్యమైన సన్నబియ్యం ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. నాడు సంక్షేమ పథకాలను విస్మరించిన బీఆర్‌ఎస్ నేడు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారానికి పాల్పడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 12 సంవత్సరాలుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెచ్చారో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పాలని, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు కలిసి డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు. ఉప ఎన్నికలలో బీజేపీకి ఓటు వేస్తే బీఆర్‌ఎస్‌కే వేసినట్టేనని అన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని, పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, ప్రతీ గృహానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇన్ని చేస్తుంటే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎందుకు విమర్శిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు.

లోకం తీరు



ఔటర్‌పై ఒక్క క్షణం ఆగినా ప్రాణాంతకమే!

▸ ప్రమాదాల నివారణకు 'నో పార్కింగ్' ప్రచారం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై ప్రమాదాలను అరికట్టేందుకు 'ఔటర్‌పై నో పార్కింగ్' అంటూ హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) ప్రచారం చేపట్టింది. గురువారం ఈ ప్రచార పోస్టర్లను సీజీఎం పరంజ్యోతి, జీఎంలు చంద్రశేఖర్, రమేష్‌కుమార్, 'ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే' సంస్థ డైరెక్టర్ చాంద్‌బాషా ఆవిష్కరించారు. పరంజ్యోతి మాట్లాడుతూ.. ఓఆర్ఆర్‌పై అక్రమంగా పార్క్ చేసిన వాహనాల వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఓఆర్ఆర్‌పై ఒక్క క్షణం ఆగినా అది ప్రాణాంతకమవుతుందని హెచ్చరించారు. దీనిపై వాహనదారులకు అవగాహన పెంచేందుకు ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే సంస్థ, ట్రాఫిక్ పోలీసులతో కలిసి ప్రచారం చేస్తున్నామన్నారు. నెల పాటు ఈ ప్రచారం నిర్వహిస్తామన్నారు. లాజిస్టిక్ సంస్థల నిర్వాహకులు, డ్రైవర్లు, ప్రైవేటు వాహన యజమానులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చాంద్‌బాషా తెలిపారు. ప్రచారంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలూ భాగస్వాములవుతాయని చెప్పారు. ఓఆర్ఆర్‌పైకి వాహనాలు వెళ్లడానికి ముందే ఇంటర్‌ఛేంజ్‌ల్లో 'నో పార్కింగ్ ఆన్ ఓఆర్ఆర్', 'నో ఫ్యూయెల్ ఆన్ ఓఆర్ఆర్' అనే ఫ్లెక్సీలను ప్రదర్శిస్తారని తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హెచ్‌జీసీఎల్ సీజీఎం పరంజ్యోతి తదితరులు



హరీశ్ రావును పరామర్శిస్తున్న కవిత దంపతులు

హరీశ్‌రావును పరామర్శించిన కవిత

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి హరీశ్‌రావును, ఆయన కుటుంబ సభ్యులను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. తన భర్త అనిల్‌తో కలిసి గురువారం హరీశ్ నివాసానికి వెళ్లిన ఆమె.. హరీశ్ తండ్రి తన్నీరు సత్యనారాయణరావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరీశ్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు కవిత దంపతులు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

నదీజలాల ఎత్తిపోతలపై సర్కార్ మౌనమేల?

వరద జలాలను తక్కువ ఖర్చుతో మల్లన్నసాగర్ రిజర్వాయర్ నింపుకొనే అవకాశం ఉన్నా.. రేవంత్‌రెడ్డి సర్కార్ గోదావరి జలాల ఎత్తిపోతలపై ఎందుకు మౌనంగా ఉంటోందని కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. మిడ్‌మానేరు నుంచి అనంతగిరి, రంగనాయకసాగర్ మీదుగా నీటిని ఎత్తిపోసేందుకు ఈ ప్రభుత్వం కనీస ప్రయత్నం చేయడం లేదని గురువారం ఎక్స్‌లో విమర్శించారు. భారీవర్షాల నేపథ్యంలో గోదావరి వరదజలాలు సముద్రంలోకి వృథాగా చేరడం బాధాకరమని, అదేసమయంలో మిడ్‌మానేరు, లోయర్‌మానేరు గేట్లు ఎత్తి వేల టీఎంసీల నీటిని నదిలోకి వదలడం ప్రభుత్వ అనాలోచిత చర్యకు నిదర్శనమని అన్నారు.

మావోయిస్టు డంపుల్లో 400 కిలోల పసిడి!?

(మొదటి పేజీ తరువాయి)



అనుమానిస్తున్నాయి. ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిసా, ఏపీలోని కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తల నుంచి మావోయిస్టులు పార్టీ ఫండ్ వసూలు చేసి.. దాన్ని కేంద్ర కమిటీకి పంపిస్తుంటారు. పార్టీకి నిధుల సేకరణకుగాను విస్తృత నెట్‌వర్క్ ఉందన్న విషయం జాతీయ విచారణ సంస్థ (ఎన్‌ఐఏ) దర్యాప్తులో వెల్లడైంది. మావోయిస్టులకు నిధులు అందకుండా పూర్తిస్థాయిలో అడ్డుకున్నా.. ప్రస్తుతం ఉన్న నిధులతోనే మరో ఐదారేళ్లు పార్టీని నడపొచ్చని, అయితే అప్పటిదాకా ప్రాణాలతో ఉండే పరిస్థితులు కనిపించకపోవడంతోనే మావోయిస్టులు లొంగుబాట పట్టారని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. మావోయిస్టులు తమకు అందిన డబ్బును రెండు విధాలుగా మారుస్తున్నట్లు ఎన్‌ఐఏ అధికారులు గుర్తించారు. పార్టీ సానుభూతిపరులు, వారి బంధువులు, కుటుంబసభ్యుల పేరిట బ్యాంకు ఖాతాలు, కంపెనీలు ప్రారంభించి అందులోకి కోట్లాది రూపాయలను మళ్లిస్తున్నారని, డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసి రూ.కోట్లు జమ చేస్తున్నారని.. మిగతా డబ్బును బంగారం రూపంలోకి మార్చేశారని భావిస్తున్నారు.

ఆ బంగారం ఎక్కడుంది?

మావోయిస్టు పార్టీ వద్ద దాదాపు రూ.400 కోట్ల నిధులు ఉంటాయని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. 400 కిలోల బంగారం నిల్వలు కూడా ఉండొచ్చని అనుమానిస్తున్నాయి. ఆ పుత్తడి అంతా అడవుల్లోని డంపుల్లో ఉందా? లేక బయటి సురక్షిత స్థావరాల్లో దాచారా? అనే అంశంపై కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు దృష్టి సారించాయి. ఝార్ఖండ్‌కు చెందిన పీపుల్స్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎల్ఎఫ్ఐ) నాయకుడు దినేశ్ గోపేను ఆగస్టులో ఈడీ అధికారులు అరెస్టు చేశారు. దినేశ్ తన భార్య, ఆమె బంధువుల పేరిట డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసి కాంట్రాక్టర్ల నుంచి సేకరించిన దాదాపు రూ.20 కోట్లను బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించాడని అధికారులు గుర్తించారు. ఇక బీజాపూర్ పోలీసులు మూల్‌వాసీ బచావో మంచ్ (ఎంబీఎం)కు చెందిన ఇద్దరు సభ్యులు బ్యాంకులో రూ.6 లక్షలు డిపాజిట్ చేస్తుండగా అరెస్టు చేశారు. మజ్దూర్ సంఘటన సమితి (ఎంఎస్ఎస్) సభ్యులు కొందరు నిధులు సేకరించి, బ్యాంకుల్లో డిపాజిట్లు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. గతంలో మావోయిస్టు స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడైన ప్రద్యుమ్నశర్మ బంధువు ఒకరు చెన్నైలోని వైద్య కళాశాలలో చేరగా, ఆమె ఫీజుకు కావాల్సిన రూ.1,13,70,500ను బ్యాంకు ఖాతాల ద్వారా ఇచ్చినట్లు ఎన్‌ఐఏ గుర్తించింది. ఇంత మొత్తంలో డబ్బును సులభంగా పంపగలుగుతున్నారంటే వారి బినామీ ఖాతాల్లో ఎంత నగదు ఉందనే వివరాలు తేలాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. మావోయిస్టు పార్టీ నుంచి ఆయుధాలతో వెళ్లి లొంగిపోతున్న వారు, ఆయుధాలు వదిలి లొంగిపోతున్న వారు తమ వద్ద ఉన్న డబ్బు లెక్కలను పార్టీకి చెప్పిన తర్వాతే బయటకు వస్తున్నారని తెలుస్తోంది. లొంగిపోతున్న మావోయిస్టులను కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాల అధికారులు ప్రశ్నించడంతో పాటు డబ్బు లెక్కలు ఆరా తీస్తున్నట్లు సమాచారం.



మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎల్డి రాజు

బతికున్న వ్యక్తి మార్చురీకి తరలింపు!

▸ మహబూబాబాద్ ప్రభుత్వాసుపత్రిలో అమానవీయ ఘటన

▸ పోలీసుల జోక్యంతో ఎమర్జెన్సీ వార్డుకు తరలింపు

నెహ్రూసెంటర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం వచ్చిన ఓ రోగికి ఆధార్‌కార్డు లేదనే కారణంతో.. సిబ్బంది ఆస్పత్రిలో చేర్చుకోలేదు. అంతటితో ఆగకుండా.. ఆ రోగి అనారోగ్యంతో ఆస్పత్రి ఆవరణలోనే అచేతనంగా పడిపోతే.. చనిపోయాడని పొరపడి మార్చురీకి తరలించిన ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం, మానవత్వాన్ని మంటగలిపేలా చేసింది. మరుసటి రోజు మార్చురీకి వచ్చిన స్వీపర్లు రోగి కదలికల్ని గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో గురువారం విషయం వెలుగులోకి వచ్చింది. ఈ అమానవీయ ఘటన మహబూబాబాద్ ప్రభుత్వాసుపత్రిలో చోటుచేసుకుంది. బాధితుడు, ఆస్పత్రి సిబ్బంది కథనం ప్రకారం, మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం జయ్యారానికి చెందిన ఎల్డి రాజు నడుం, మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ వారం రోజుల కిందట వైద్యం కోసం మానుకోట జిల్లా ఆస్పత్రికి వచ్చాడు. అతని వద్ద ఆధార్ కార్డు లేకపోవడంతో ఆస్పత్రిలో చేర్చుకోవడానికి సిబ్బంది నిరాకరించారు. దీంతో రెండు రోజుల పాటు ఆస్పత్రి క్యాంటిన్ ఆవరణలోనే పడికాపులు కాశాడు. సరైన వైద్య సదుపాయం, ఆహారం లేక నీరసించిపోయాడు. దీంతో అచేతన స్థితిలో ఉన్న రాజును చనిపోయాడని భావించిన సిబ్బంది మార్చురీలో భద్రపరిచేందుకు తీసుకువెళ్లారు. అక్కడ బాక్సులు ఖాళీ లేకపోవడంతో అతడిని మార్చురీ ప్రాంగణంలోని గేట్ వద్ద ఉంచారు. కాగా, మరుసటి రోజు ఉదయం మార్చురీ శుభ్రపరచడానికి వచ్చిన స్వీపర్లు.. రాజులో కదలికలు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆస్పత్రికి చేరుకుని వెంటనే ఎమర్జెన్సీ వార్డుకు తరలించారు.

రాజుకు చికిత్స అందిస్తున్నాం

"బతికున్న వ్యక్తిని మార్చురీలో పెట్టారంటూ వస్తున్న వార్తలన్నీ అవాస్తవాలు. ఆస్పత్రి సమీపంలో రోడ్డుపై వర్షంలో నడవలేని స్థితిలో ఉన్న యాచకుడిని సెక్యూరిటీ సిబ్బంది మానవత్వంతో ఆస్పత్రిలో చేర్పించారు. మార్చురీ సిబ్బంది దగ్గరలో ఉన్న బెంచీపైకి చేర్చి అక్కడి నుంచి వార్డుకు మార్చారు. దానిని కొంతమంది వక్రీకరించి జిల్లా ఆస్పత్రిపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయ కుట్రల్లో భాగంగా.. ఆస్పత్రిపై విషం చిమ్మవద్దు"

- జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

శతాధిక వృద్ధురాలి మృతి



నర్సవ్వ(ఫైల్)

చేగుంట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా చేగుంటకు చెందిన మురాడి నర్సవ్వ(105) అనే శతాధిక వృద్ధురాలు గురువారం మరణించారు. 1920లో నర్సవ్వ జన్మించారు. స్వాతంత్ర్యం రాకముందు, వచ్చిన తర్వాత దేశంలోని పరిస్థితులను చూసిన సర్సవ్వ.. పల్లె సంప్రదాయాలకు విలువ ఇచ్చేవారు. 105 ఏళ్ల వయస్సులోనూ తన పనులు తానే స్వయంగా చేసుకుంటూ ఆరోగ్యంగానే ఉన్న నర్సవ్వ.. గురువారం ఉదయం వయోభారంతో తుది శ్వాస విడిచారు. నర్సవ్వ కుమారుడు, కోడలు, ఇద్దరు మనువళ్లు అనారోగ్యం వల్ల ఇది వరకే మరణించారు. ఆమె ముగ్గురు మనుమరాళ్లు(కొడుకు కుమార్తెలు) మాత్రమే ఆ కుటుంబంలో ప్రస్తుతం ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.40 వేలు డిమాండ్

▸ రైతు నుంచి రూ.21 వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ట్రాన్స్‌కో మెదక్ డీఈ షేక్ షరీఫ్



షేక్ షరీఫ్

మెదక్ అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ ఫామ్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం రైతు నుంచి రూ.21 వేల లంచం తీసుకుంటున్న ట్రాన్స్‌కో మెదక్ డీఈ షేక్ షరీఫ్ చాంద్‌బాషాను ఏసీబీ అధికారులు గురువారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం సీతా నగరం గ్రామ రైతు భాస్కర్ తన పౌల్ట్రీ ఫామ్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. దీనికి రూ.30 వేలు ఇవ్వాలని సదరు రైతును ట్రాన్స్‌కో మెదక్ డీఈ షేక్ షరీఫ్ చాంద్‌బాషా డిమాండ్ చేశారు. 4 రోజుల క్రితం ప్రైవేటు వ్యక్తికి డిజిటల్ పేమెంట్ ద్వారా రూ.9,000 చెల్లించిన రైతు భాస్కర్.. మిగతా రూ.21 వేలు గురువారం ఇస్తానని చెప్పాడు. ఒప్పందం ప్రకారం మిగతా డబ్బు ఇవ్వాలని డీఈ అడగడంతో రైతు ఏసీబీని ఆశ్రయించారు. గురువారం ట్రాన్స్‌కో కార్యాలయంలో రైతునుంచి రూ.21 వేల తీసుకుంటున్న షేక్ షరీఫ్ చాంద్‌బాషాను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు మెదక్ ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ చెప్పారు.

సునీతారెడ్డి చెప్పినట్టు దర్యాప్తు జరగాలా?

▸ దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారు

▸ పిటిషన్‌ను డిస్మిస్ చేయండి

▸ సీబీఐ కోర్టులో నిందితుల వాదన

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో 'తదుపరి దర్యాప్తు' చేయాలంటూ ఆయన కుమార్తె సునీతారెడ్డి చేసిన వినతిని తిరస్కరించాలని నిందితులు సీబీఐ కోర్టును కోరారు. ఆమె దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారని, తదుపరి దర్యాప్తు కోరడం వెనుక వ్యక్తిగత, రాజకీయ ఎజెండా రెండూ ఉన్నాయని ఆరోపించారు. ఈ మేరకు నిందితులుగా ఉన్న దేవిరెడ్డి శివ శంకర్‌రెడ్డి (ఏ-5), వైఎస్ భాస్కర్‌రెడ్డి (ఏ-7), కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి (ఏ-8)లు గురువారం కౌంటర్ దాఖలు చేశారు. సునీతా రెడ్డి తనకు కావాల్సిన విధంగా దర్యాప్తు జరగాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఇందుకు సీబీఐని పావుగా వాడుకోవాలని చూస్తున్నారని, ఇందుకు సీబీఐ లొంగిపోయిందని చెప్పారు. పార్లమెంట్ సభ్యుడైన అవినాశ్‌రెడ్డిని నిందితుడిగా చేర్చడం ద్వారా సీబీఐ లొంగిపోయినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. సునీతారెడ్డి నిర్దేశంమేరకు తదుపరి దర్యాప్తు చేపట్టి అప్రూవర్‌గా మారిన దస్తగిరి(ఏ-4)ను స్వేచ్ఛగా వదిలేయాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. తదుపరి దర్యాప్తు చేయడానికి కొత్త విషయాలు ఏవీలేవని చెప్పారు. ఈడీ, ఇన్‌కంట్యాక్స్‌శాఖల కోణంలో దర్యాప్తు చేయాలని ఆమె కోరుతున్నారని, అలాంటప్పుడు సీబీఐ చేయాల్సిన దర్యాప్తు ఏముంటుందని ప్రశ్నించారు. మరో నిందితుడు సునీల్‌యాదవ్ కౌంటర్ కోసం విచారణ శుక్రవారానికి వాయిదాపడింది.

బీసీ రిజర్వేషన్ల సాధన ఉద్యమం ఉధృతం

▸ జేఏసీ కన్వీనర్లుగా కుల సంఘాల ప్రతినిధులు

▸ బీసీ జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నామని బీసీ జేఏసీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ప్రకటించారు. ఇందులో భాగంగా బీసీ కుల సంఘాల ప్రతినిధులను జేఏసీ కన్వీనర్లుగా నియమిస్తున్నామని వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ల ఉద్యమ కార్యాచరణపై బీసీ జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గురువారం జరిగిన సమావేశంలో 80 కులసంఘాలు, 35 బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. ఇటీవల చేపట్టిన బీసీ రాష్ట్ర బంద్ విజయవంతం కావడంతో రిజర్వేషన్ వ్యతిరేకుల వెన్నులో వణుకు పుట్టిందన్నారు. తెలంగాణలో జరుగుతున్న ఉద్యమాన్ని దేశమంతా పరిశీలిస్తోందని తెలిపారు. బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడానికి కులాల వారీగా ప్రతినిధులను జేఏసీ కన్వీనర్లుగా నియమిస్తున్నట్టు తెలిపారు. ఇక, బీసీ రిజర్వేషన్ సాధన ఉద్యమంలో దళితులను కూడా భాగస్వాములు చేయాలని ఈ సమావేశంలో పాల్గొన్న విశ్వజనకళామండలి చైర్మన్ మాస్టర్‌జీ సూచించారు. కాగా, సమావేశంలో భాగంగా యాదవ, మున్నూరు కాపు, విశ్వబ్రాహ్మణ, కురుమ, వీరశైవ లింగ బలిజ, పెరిక, గౌడ, వంశ రాజ్, మేదర కుల సంఘాలతోపాటు వివిధ ఉద్యోగ, విద్యార్థి సంఘాల ప్రతినిధులను జేఏసీ కన్వీనర్లుగా నియమించారు.

10న కామారెడ్డిలో బహిరంగ సభ

పంజాగుట్ట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అంశంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు నవంబరు 10న కామారెడ్డిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ప్రకటించింది. అలాగే, డిసెంబరులో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడతామని వెల్లడించింది. 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో బాలగౌని బాల్‌రాజ్ గౌడ్ అధ్యక్షతన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో సమితి ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు.

మార్గదర్శిపై హైకోర్టులోనే తేల్చుకోండి

▸ అనుబంధ పిటిషన్లపై విచారణ ముగించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థ రిజర్వు బ్యాంకు నిబంధనలను పాటించలేదన్న కేసును హైకోర్టులోనే తేల్చుకోవాలని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. ఈ అంశంపై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ వాదనలు వినేందుకు విముఖత చూపించింది. మార్గదర్శి సంస్థ ఆర్బీఐ నిబంధనలు పాటించలేదని ఆరోపిస్తూ 2007లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విచారణకు ఆదేశిస్తూ ప్రత్యేక జీవోను జారీ చేశారు. ఆ జీవోను కొట్టివేయాలని కోరుతూ 2007 ఫిబ్రవరి9న సంస్థ చైర్మన్ రామోజీరావుతో పాటు, మార్గదర్శి ఫైనాన్షియర్స్, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్‌లు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఏపీ ప్రభుత్వం, వైఎస్ రాజశేఖర్ రెడ్డిలను ప్రతివాదులుగా చేర్చాయి. ఆ తర్వాత ఉండవల్లి అరుణ్ కుమార్‌తోపాటు మరికొందరు ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. ఆ పిటిషన్లు అన్నింటినీ కలిపి గురువారం ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపిస్తూ మార్గదర్శికి సంబంధించిన ప్రధాన రిట్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరుగుతోందని చెప్పారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం అలాగైతే హైకోర్టులోనే తేల్చుకోవాలని తేల్చి చెప్పింది. వర్చువల్‌గా విచారణకు హాజరైన ఉండవల్లి దీనికి అభ్యంతరం తెలిపారు. అయితే ఉండవల్లి వాదనలు వినడానికి ధర్మాసనం విముఖత వ్యక్తం చేసింది. ఇంతలోనే సిద్దార్థ లూథ్రా కలుగజేసుకుని ఉండవల్లి అసలు ఇందులో ప్రతివాదే కాదన్నారు. ఇప్పటికే డిపాజిట్లు తిరిగి చెల్లించేశారని, మరో రూ.5.34 కోట్లు మాత్రమే ఉన్నాయని చెప్పారు. మెచ్యూరిటీ తేదీల ఆధారంగా ఆ మొత్తాలను కూడా చెల్లిస్తారని తెలిపారు. ఇరుపక్షాల వాదనల తర్వాత.. ఈ కేసుకు అనుబంధంగా దాఖలైన అన్ని పిటిషన్లపై విచారణను ముగిస్తున్నట్టు ధర్మాసనం వెల్లడించింది. ఇంకెవరైనా సొమ్ము పొందాల్సిన వాళ్లు ఉంటే ఆధారాలు చూపి తీసుకోవచ్చని తెలిపింది. ఇంకేవైనా అభ్యంతరాలు ఉంటే హైకోర్టులోనే వాదనలు వినిపించాలని తేల్చి చెప్పింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఫలించిన వ్యూహం

భారతప్రధాని నరేంద్రమోదీ రష్యానుంచి ముడి చమురు కొనడం ఆపివేయబోతున్నారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించినప్పుడు అధికులు ఆయనమాట నమ్మలేదు. భారత్–పాక్ యుద్ధాన్ని తానే ఆపాననీ, వాణిజ్యాస్త్రాన్ని ప్రయోగించి రెండు దేశాలను దారికితెచ్చానని ట్రంప్ యాభైఐదుసార్లు చెప్పుకున్నా, భారత పాలకులు, అధికారులు అత్యధిక సందర్భాల్లో మౌనాన్నే ఆశ్రయించారు. అటు ఆమోదించకుండా, ఇటు పూర్తిగా కాదనకుండా మొదట్లో జాగ్రత్తపడినవారు, ఆ తరువాత, పాక్ సైనికాధికారులు దాడులు ఆపండి మహాప్రభో అని వేడుకోవడంతో ఆపరేషన్ సిందూర్‌ను తామే నిలిపివేశామన్నారు. భారత్ ఇకపై రష్యా చమురు కొనబోదని అదేపనిగా ఐదారుసార్లు చెప్పిన ట్రంప్, దిగుమతులు పూర్తిగా ఆపివేయడానికి కొంతసమయం పడుతుందని ఉదారంగా అన్నప్పటికీ, ఆయన కోరిక అతివేగంగా నెరవేరుతోంది. ఆయిల్ కంపెనీలు దిగుమతులు నిలిపివేయడమే కాదు, ఏకంగా సముద్రం మధ్యలో ఉన్న ముడిచమురు నౌకలు ప్రయాణం ఆపి, తిరిగి రష్యాకు మళ్ళిపోతున్న వార్తలు సైతం వింటున్నాం. అయినా ట్రంప్‌కు అక్కసుతీరడం లేదు. దక్షిణకొరియాలో ఆసియా పసిఫిక్ ఎకనామిక్ కోపరేషన్ (ఎపెక్) సదస్సులో ఆపరేషన్ సిందూర్ గురించీ మోదీ గురించీ ఆయన చేసిన వ్యాఖ్యలు ఉపరితలంలో ప్రశంసలుగా కనిపించే ఒత్తిడి వ్యూహం.

వ్యాపారవేత్త అయిన ట్రంప్‌కు ఎవరిని ఎలా బుజ్జగించాలో, ఏ విధంగా లొంగదీసుకోవాలో తెలుసు. అర్థంపర్థంలేకుండా మాట్లాడుతూనే ఎదుటివారిని ఇరకాటంలో పడేయగలదిట్ట. ఆపరేషన్ సిందూర్‌ని అదేపనిగా ప్రస్తావిస్తూ భారతపాలకులమీద ఒత్తిడి పెంచే వ్యూహానికి ఆయన మరింత పదును పెడుతున్నారు. యుద్ధాన్ని ఆపిన శాంతిదూతగా ట్రంప్‌ను దేశ విదేశీ వేదికలమీద పాకిస్థాన్ ప్రధాని, సైన్యాధ్యక్షుడు ఆకాశానికి ఎత్తేస్తూ, ఏకంగా నోబెల్ శాంతి కోసం నామినేట్ చేస్తూంటే, అవును నిజమేనని భారత పాలకులు ఒక్కమాట కూడా అననందుకు ఆయన అలిగాడు, ఆగ్రహించాడు. నేరుగా కాకున్నా, పరోక్షంగానైనా ప్రశంసించనందుకు నొచ్చుకున్నాడు. సుంకాల యుద్ధాన్ని ఇంత తీవ్రతరం చేయడం వెనుక దెబ్బతిన్న ఆయన అహం ఉన్నదని అందరికీ తెలుసు. గతంలో యుద్ధంలో కూలిన విమానాల ప్రస్తావన చేసిన ట్రంప్ ఇప్పుడు ఏకంగా నిగనిగలాడే అందమైన ఏడు సరికొత్త విమానాలంటూ మరో అడుగుముందుకు వేశారు. గతంలో, ఆపరేషన్ సిందూర్‌లో విమానాల కూల్చివేత విషయాన్ని అప్పటి వరకూ ప్రకటించని భారతప్రభుత్వం, ట్రంప్ చెప్పిన సంఖ్య గురించి మాట్లాడకుండానే కూలినమాట వాస్తవమేనని ఆ తరువాత ఒప్పుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు విమానాలు ఎవరివో, ఏ కంపెనీవో నేరుగా నిర్వచించకుండా భారత్‌మీద పరోక్షంగా ఒత్తిడిపెంచే వ్యూహంలో ఉన్నారాయన.

మోదీని ప్రశంసిస్తూనే భారత్‌ను మోదే పనిలో ట్రంప్ నిపుణుడు. నాకు మంచి మిత్రుడు అంటూనే సుంకాలు, ప్రతీకార సుంకాలు, చమురు సుంకాలతో ఆయన కక్షతీర్చుకున్నాడు. ఉక్రెయిన్ యుద్ధంతో రష్యానుంచి ఒక్కసారిగా నలభైశాతానికి చేరిన ముడిచమురు దిగుమతులను ఆపించేందుకు ఆయన సామ దాన భేద దండోపాయాలన్నీ ప్రయోగించాడు, అంతిమంగా తాను అనుకున్నది సాధించాడు, మరోపక్క పైకి మాత్రం మోదీని మొండిమనిషని అంటున్నారు. తాను కోరుకున్న రీతిలో రష్యానుంచి పూర్తిగా ముడిచమురు దిగుమతులు నిలిచిపోతున్న తరుణంలో, మరిన్ని సరికొత్త రీతుల్లో భారత్‌ను వాణిజ్యఒప్పందంలో లొంగదీసే ప్రయత్నంలో ట్రంప్ ఉన్నారు. ట్రంప్ ఏవో వ్యాఖ్యలు చేసినంతమాత్రాన పట్టించుకోనక్కరలేదని, చమురు విషయంలో మోదీ దిగిరారనీ, ఆప్తమిత్ర రష్యాను వదులుకోబోరనీ కొందరు విశ్లేషించినప్పటికీ, అంతిమంగా ట్రంప్ కోరినట్టుగానే జరుగుతోంది. ట్రంప్ ఆంక్షల దెబ్బకు భారత్ అసంఘటిత రంగం బాగా దెబ్బతిని ఉన్నందున గత్యంతరం లేదన్న మాట కూడా నిజం. కానీ, దేశ ఇంధనభద్రతను పరిరక్షించుకోవడానికే ముడిచమురు దిగుమతి చేసుకుంటున్నామని, ఒక ఏడాది భారత్ కొనే ఇంధనం యూరప్ ఒక పూట కొనుగోలు చేసేదానికి సమానమని గతంలో అంతర్జాతీయ వేదికలమీద గర్జించిన మన నేతలు ఇప్పుడు మాట్లాడటం లేదు. భారతీయుల ప్రయోజనాల పరిరక్షణే తమ లక్ష్యమని, ఉపన్యాసాలు దంచిన పాలకులు ఇప్పుడు కాలు వెనక్కుతీసుకొనే కార్యక్రమాన్ని గుట్టుచప్పుడు కాకుండా కానిచ్చేస్తున్నారు.

సమరాంగణ సూత్రధారి... ఇందిర

ఇరవయ్యవ శతాబ్ది నాటి దూరదృష్టి గల పాలకుల్లో నెహ్రూ ఒకరు. వేగంగా ఆర్థికాభివృద్ధి సాధించడం ద్వారానే త్వరితంగా దేశ స్వాతంత్ర్యం, సమగ్రతలను కాపాడుకోవడం, పేదరికాన్ని నిర్మూలించడం, సామాజిక సంక్షేమం సాధించడం వీలవుతుందని ఆయన గట్టిగా విశ్వసించారు. ఆ దిశగా నిర్ణయాలు తీసుకోవడంలోనే ఆయన ఆలోచనా స్థాయి అర్థమవుతుంది. అందుకే ఆయన పాలనా కాలంలో అన్ని రంగాల్లోనూ సత్ఫలితాలు గణనీయంగా సంభవించాయి.

ఇక, 1966లో ఇందిరాగాంధీ ప్రధానమంత్రి అయిన నాటికి దేశంలో ఆర్థిక మాంద్యం, పారిశ్రామిక ఉత్పత్తుల పతనం, ఎగుమతులు తగ్గడం, ఆహారధాన్యాల సంక్షోభం ఏర్పడ్డాయి. వీటితో పాటు బడ్జెట్ డెఫిసిట్ పెరగడం, విదేశీ ఆర్థిక సాయంపై ఎక్కువగా ఆధారపడటం వంటివే గాక 1962, 1965నాటి యుద్ధాలు, పాకిస్థాన్– చైనా కూటమి ఏర్పాటులో సైన్యంపై ఖర్చు పెంచడం వంటివీ జరిగాయి. వర్షాలు లేక కరువు ఏర్పడింది. ధరలు పెరిగాయి. పాలనా ఖర్చులు తగ్గించుకోవడం వీలుపడలేదు. అయినా, యుద్ధ ప్రాతిపదికన ఆహార ధాన్యాలు సేకరించి, ప్రజలకు పంచి, వారి ప్రాణాలు కాపాడగలిగారు.

అందరు నాయకుల్లో ఉన్నట్టుగానే ఇందిరాగాంధీలోనూ కొన్ని బలమైన అంశాలు, కొన్ని బలహీన అంశాలు ఉన్నాయి. ఉదాహరణకు: ఎందరి నుంచి సలహాలను ఆహ్వానించినా, తన స్వీయ నిర్ణయానికే ప్రాధాన్యమిచ్చే గుణం ఆమెది. ఇది ఆమె రాజకీయ చతురత. అంతేకాదు, ఎలాంటి నిర్ణయాన్నైనా ధైర్యంగా, త్వరితంగా, సరైన సమయంలో తీసుకోవడం ఆమెకు అలవాటు. ఆమె తీసుకున్న చాలా నిర్ణయాల్లో మనం దీన్ని గమనించవచ్చు. '1969లో కాంగ్రెస్ చీలినప్పుడైనా కావచ్చు, 1971 నాటి బంగ్లాదేశ్ సందర్భమైనా కావచ్చు. అదే ఏడాది భారత్‌ను బెదిరించడానికి బంగాళాఖాతంలోకి అమెరికా పంపిన సెవెంత్ ఫ్లీట్‌ను ఎదురించడంలోనైనా కావచ్చు'.



1966లో 'పంజాబీ సుబా'ను సృష్టించారు. 1975లో అత్యవసర పరిస్థితి విధించారు. ఎమర్జెన్సీ పొడిగింపుతో నిరంకుశంగా పాలించే అవకాశమున్నా, ప్రజాస్వామ్య విలువలకు ప్రాణం పోయాలని భావించి ధైర్యంగా సాధారణ ఎన్నికలకు వెళ్లారు. 1977–79 మధ్య ఎంక్వైరీ కమిషన్ల ద్వారా జనతా ప్రభుత్వం వేధించిన సమయంలోనూ ఆమె సంయమనాన్ని, ధైర్యాన్ని కోల్పోలేదు.

దేశ ప్రజలపైన ఇందిరాగాంధీకి వల్లమాలిన ప్రేమ ఉండేది. 'నా దేశం గొప్పది' అనే గర్వం ఆమెలో ప్రస్ఫుటంగా అగుపడేది. భారత్ ఎదగబోయే స్థాయిని అంచనా వేసుకుని ఉప్పొంగిపోయేవారు. అందుకే, దేశ ప్రాధాన్యాలు, దేశ గౌరవం కాపాడ్డంలో ఇందిర రాజీపడేవారు కాదు. దేశీయంగా బలంగా ఉంటేనే జాతి గౌరవం, స్వాతంత్ర్యాలు భద్రంగా ఉంటాయని ఆమె గట్టిగా నమ్మేవారు. ఎన్ని అడ్డంకులు పుట్టుకొచ్చినా ఆ దిశగా శ్రమించేవారు. దేశాన్ని ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా, సాంకేతికంగా, సైనికంగా స్వయం సమృద్ధిగా, స్వతంత్రంగా నిలిపి ఉంచేందుకై కృషి చేసేవారు. ప్రజల నమ్మకాన్ని చూరగొన్నారు. 1970 దశకంలో అనేక దేశాలు ఆయిల్ సంక్షోభంలో కొట్టుమిట్టాడినా భారత్‌ను మాత్రం ఆ సమస్య నుంచి ఇందిర కాపాడగలిగారు.

గ్రీన్ రెవల్యూషన్ విజయం ద్వారా దేశంలో ఆహారధాన్యాల కొరతను దూరం చేశారు. పాశ్చాత్య పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థల్లో సంభవించే ఆర్థిక మాంద్యాల ప్రభావాలు భారత్ దరిదాపులకు కూడా రాకుండా చూడడంలో తన తండ్రి నెహ్రూను మరపించారు. భారత అంతర్గత విషయాల్లో ఇతర దేశాల ప్రమేయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అందుకే, కోల్డ్‌వార్ కూటముల నుంచి భారత్‌ను దూరంగా ఉంచారు. అణు కార్యకలాపాలను శాంతియుత కార్యక్రమాలకే పరిమితం చేసినా, అణ్వాయుధాల తయారీ నిషేధ ఒప్పందంపై సంతకానికి మాత్రం నిరాకరించారు. నెహ్రూ ఏర్పరచిన అలీన విధానాన్నే అనుసరించారు. దేశాన్ని శక్తిమంతమైనదిగానూ, స్వయం సమృద్ధ దేశంగానూ నిలబెట్టారు. అనేక సంస్కరణలు తెచ్చారు. మిశ్రమ ఆర్థిక విధానాలను అనుసరించి ప్రైవేట్ సెక్టార్ ఆరోగ్యకరమైన అభివృద్ధికి విధాన నిర్ణయాలు తీసుకున్నారు.

సెక్యులర్ భావజాలానికి అంకితమై, రాజకీయాల్లో మత భావజాలాలను తీవ్రంగా వ్యతిరేకించారు. అట్టి విధానం ప్రజల్ని చీలుస్తుందని, దేశాన్ని బలహీనపరుస్తుందని అభిప్రాయపడ్డారు. అందుకే, జాకీర్ హుస్సేన్ వంటి వారిని దేశాధ్యక్షులుగా చేశారు. ఆపరేషన్ బ్లూస్టార్ కారణంగా తన సిక్కు బాడీగార్డ్స్ చేతుల్లో 1984 అక్టోబర్ 31న ఇందిర అస్తమించారు. దేశం గొప్ప నాయకురాలిని కోల్పోయింది. బడుగు, మైనార్టీ ప్రజలంతా తమ 'అమ్మ'ను కోల్పోయినట్లుగా బాధపడ్డారు. దేశాన్ని సమున్నతంగా నిలబెట్టిన ఇందిర చిరస్మరణీయురాలు.

• దేవిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి
రిటైర్డ్ ప్రొఫెసర్, ఎస్వీ యూనివర్సిటీ

(నేడు ఇందిరాగాంధీ వర్ధంతి)

బిహార్ బాటలోనే దేశవ్యాప్త 'సర్'

ఆ అస్తవ్యస్తత ఇప్పుడు ఒక పద్ధతిని సంతరించుకున్నది! బిహార్ అనంతరం తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో నవంబర్ 4 నుంచి అమలుపరచనున్న ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్– సర్) కార్యక్రమం గురించి నేను ప్రస్తావిస్తున్నాను. ప్రజాస్వామ్య నైతికత అయిన వయోజన ఓటుహక్కును విచక్షణారహితంగా అత్యధిక ప్రజలకు తొలగించేందుకు మొరటు సాధనమైన 'సర్'ను ఇప్పుడు నాజూకు పద్ధతులతో విస్తరించేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) పూనుకున్నది. అర్హులైన పౌరులకు ఓటుహక్కు తొలగింపు విషయమై నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ఒక పదునైన సాధనంగా దాన్ని మార్చివేసింది.




■ యోగేంద్ర యాదవ్

ఓటర్ జాబితాల ప్రత్యేక సవరణను తొట్ట తొలుత బిహార్‌లో అమలుపరిచిన తీరుతెన్నులు వివాదాస్పదమయ్యాయి. తీవ్ర గందరగోళం చోటుచేసుకున్నది. సవరించిన ఓటర్ జాబితాల్లో నిర్దుష్టత, కచ్చితత్వం మెరుగుపడకపోగా వివిధ కీలక అంశాల్లో నాణ్యత గణనీయంగా క్షీణించింది: వయోజన ఓటర్ల నిష్పత్తి (దీనినే ఓటర్లు– ప్రజల నిష్పత్తి అని కూడా అంటారు) బాగా పడిపోయింది; మహిళా, ముస్లిం ఓటర్లు పెద్ద సంఖ్యలో తగ్గిపోయారు; ఎన్నికల సమగ్రత, నిష్పాక్షికతను దెబ్బతీసే అక్రమాలు (నకిలీ ఓటర్ల నమోదు, డజన్ల కొద్దీ ఓటర్ల చిరునామా ఒకటే కావడం) మొదలైనవి యథాప్రకారం కొనసాగాయి. మరి ఈసీఐ ఈ లోపాలు, లొసుగులను గుర్తించిందా? అక్టోబర్ 27న 'సర్' రెండో దశను ప్రకటించిన తీరును నిశితంగా గమనిస్తే బిహార్ అనుభవాల నుంచి భారత ఎన్నికల సంఘం సరైన పాఠాలు నేర్చుకోలేదని స్పష్టమవుతున్నది. అసలు తన పరంగా జరిగిన తప్పులు అంగీకరించలేని అశక్తత, సరిదిద్దుకునేందుకు సుముఖత భారత ఎన్నికల సంఘంలో కనిపించలేదు. ఇదొక కఠోర వాస్తవం. మరికొన్ని వాస్తవాలను కూడా మనం తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. బిహార్‌లో 'సర్' అమలుకు ప్రభుత్వం వెచ్చించిన నిధులు భారీ పరిమాణంలో ఉండడం, అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన తరుణంలో ఓటర్ జాబితాల సవరణ హడావుడిగా చేపట్టడం, తమ ఓటుహక్కును కాపాడుకోవడంలో పేద ఓటర్లకు ఎదురైన కష్ట నష్టాలు, మానసిక వ్యధలు మొదలైన వాటిని గమనిస్తే ఒక విషయం విశదమవుతుంది: ఓటర్ జాబితాల సవరణను ఏ విధంగా చేయకూడదో బిహార్ 'సర్' నిరూపించింది.

భారత ఎన్నికల సంఘం ప్రకటించిన 'సర్' కొత్త వెర్షన్‌లో మార్పులు స్వతస్సిద్ధమైన ఒక కపట పథకాన్ని మరింత సమర్థంగా అమలుపరిచేందుకు ఉద్దేశించినవే. అవి సంక్లిష్టమైనవి మాత్రమే కాదు, స్పష్టంగా కనిపించని అదనపు అంశాలు సైతం వాటిలో ఉన్నాయి. బిహార్‌లో కంటే విశాల భారతదేశంలో మరింత పకడ్బందీగా తాను కోరుకున్న తీరులో 'సర్'ను అమలుపరిచేందుకు ఈసీఐ మెరుగ్గా సన్నద్ధమయిందనడంలో సందేహం లేదు. ఎన్నికల అధికారులకు 'సర్' అమలులో సకాలంలో శిక్షణ నిచ్చింది. నేమ్ మ్యాపింగ్ (ఒక పేరును గుర్తించేందుకు, సంధానం చేసేందుకు మరొక పేరుతో అనుబంధించే ప్రక్రియ)కు ఏర్పాట్లు చేసింది. పోలింగ్ బూత్ స్థాయి ఏజెంట్లు ఎన్యూమరేషన్ ఫామ్‌లు దాఖలు చేసేందుకు అనుమతించింది. దీనివల్ల పోలింగ్ బూత్ స్థాయి అధికారులకు పనిభారం తగ్గుతుంది. తద్వారా సవరణ ప్రక్రియ శీఘ్రగతిన జరిగేందుకు వెసులుబాటు అవుతుంది. బిహార్ 'సర్' అమలులో బహిరంగంగా ప్రకటించకుండా రహస్యంగా చేసిన కొన్ని మార్పులను ఈసీఐ ఇప్పుడు అధికారికమైనవిగా చేసింది. ఓటర్లు ఇప్పుడు తమ ఎన్యూమరేషన్ ఫామ్స్‌తో పాటు ఎలాంటి డాక్యుమెంట్లను సమర్పించనవసరం లేదు. ఈ మినహాయింపును 2002–04 నాటి పాత ఓటర్ జాబితాల్లో ఉన్న వారి సంతానానికి, లేదా 'బంధువు'కు కూడా వర్తింపజేసింది. తాత్కాలికంగా దూర ప్రదేశాల్లో ఉన్న వారి తరఫున ఎన్యూమరేషన్ ఫామ్స్ సమర్పించేందుకు సంబంధిత వ్యక్తుల కుటుంబ సభ్యులకు అనుమతినివ్వడం వలస వెళ్లిన వారికి ఉపశమనం కలిగిస్తుంది. కొత్త ఓటర్ల కోసం ఎన్యూమరేషన్ ఫామ్స్ తీసుకువెళ్లేందుకు పోలింగ్ బూత్ స్థాయి అధికారులను అనుమతించడం మంచిదే. అయితే ఇంటింటికీ తిరిగి ఓటర్లను ధ్రువీకరించుకునే దశలో తొలగింపులకు కాకుండా గణనీయమైన స్థాయిలో అదనపు చేర్పులకు తోడ్పడి తీరాలి. దీనివల్ల ఓటర్లకు ప్రయాసలు, ఎన్నికల అధికారులకు పనిభారం తగ్గుతాయి. ఇవన్నీ సానుకూల సంస్కరణలుగా కనిస్తున్నా లోపభూయిష్టమైన పథకాన్ని సమర్థంగా అమలుపరిచేందుకు ఉద్దేశించినవే అనడంలో సందేహం లేదు.

చెప్పవచ్చినదేమిటంటే ఈ సడలింపులు, మెరుగుదలలు ఏవీ 'సర్'లో స్వతస్సిద్ధంగా ఉన్న ప్రాథమిక మినహాయింపు రూపకల్పనను మార్చవు. గతంలో ఎనిమిది పర్యాయాలు అమలుపరిచిన సమగ్ర సవరణ ప్రక్రియను పునరావృతం చేయడమే ప్రస్తుత ప్రత్యేక సమగ్ర సవరణ అని భారత ఎన్నికల సంఘం పదే పదే ఉద్ఘాటిస్తోంది. ఇదొక అబద్ధం.



ప్రస్తుత 'సర్' గతంలో జరిగిన ఏ సమగ్ర సవరణ కంటే కూడా భిన్నమైనది. గత సమగ్ర సవరణల మార్గదర్శక సూత్రాలు పూర్తిగా భిన్నమైనవి. ఈసీఐ ఈ సత్యాన్ని కప్పిపుచ్చజాలదు. మరీ ముఖ్యంగా ఓటర్ జాబితాల్లో మళ్లీ స్థానం పొందేందుకు, అంటే ఓటర్‌గా తమను తాము ధ్రువీకరించుకునేందుకు అవసరమైన దరఖాస్తును, డాక్యుమెంట్లను ఓటర్లే స్వయంగా సమర్పించాలి. ఇది మన దేశంలో సార్వత్రిక వయోజన ఓటు హక్కు నిర్మాణ వ్యవస్థ (వయోజన పౌరులు ప్రతి ఒక్కరూ తమ సామాజిక, ఆర్థిక నేపథ్యంతో సంబంధం లేకుండా ఓటు వేయడానికి వీలు కల్పించే చట్టబద్ధమైన, విధానపరమైన చట్రం) ఒక మౌలిక మార్పు. ఇంతకు ముందు ఓటరు నమోదు బాధ్యత పూర్తిగా ప్రభుత్వంపైనే ఉండేది. మరొక కఠిన నిబంధనను కూడా కొత్త 'సర్' సవరించలేదు. సవరణ ప్రక్రియ ప్రారంభమైన నెల రోజుల్లో పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫామ్‌ను దాఖలు చేయడంలో విఫలమైన ఓటర్లు ఎవరైనా 'నోటీసు, విచారణ, అప్పీల్ లేకుండా' ఓటర్ల జాబితా నుంచి తొలగింపబడతారు. ఈ కఠిన నిబంధన కఠోర శిక్ష (సామూహిక ఓటుహక్కుల తొలగింపు)కు దారి తీసే ప్రమాదమున్నది. ఇది సమంజసమేనా? పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశాలలో కూడా ఓటరు నమోదు బాధ్యత ప్రభుత్వం నుంచి వ్యక్తిగత ఓటర్లకు బదిలీ అయ్యింది. పర్యవసానంగా నమోదైన ఓటర్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఈ నిర్మాణాత్మక అవరోధం వల్ల మన దేశంలో సైతం ఓటర్ జాబితాల నుంచి అర్హులైన ఓటర్లు హీనపక్షం 5 నుంచి 10 శాతం మేరకు మినహాయింపునకు లోనయ్యే ప్రమాదమున్నది. ఇలా తొలగింపునకు గురయ్యే ఓటర్లలో మహిళలు పెద్ద సంఖ్యలో ఉంటారు. బిహార్‌లో ఇదే జరిగింది. ఈ విషయమై ఈసీఐ దృష్టి పెట్టిందా? సమాధానం స్పష్టమే.

2002–04 నాటి ఓటర్ జాబితాల్లో ఉన్న వారి పౌరసత్వాన్ని నిశితంగా పరీక్షించినట్టు ఈసీఐ పదే పదే చెబుతోంది. ఇది మరొక అబద్ధం. ఓటర్ల పౌరసత్వాన్ని పరీక్షించలేదని నాటి సమగ్ర సవరణల మార్గదర్శక సూత్రాలు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పుడు దేశవ్యాప్త సర్‌లో ప్రతి ఒక్కరూ తాము లేదా తమ బంధువులు 2002–04 నాటి ఓటర్ జాబితాలలో ఉన్నట్టుగా నిరూపించాలి. అలా నిరూపించని వారికి పౌరసత్వాన్ని ధ్రువీకరించే డాక్యుమెంట్లు చూపాలని నోటీసు జారీ అవుతుంది. గమనార్హమైన విషయమేమిటంటే 2002–04 ఓటర్ జాబితాల్లో తమ కుటుంబ సభ్యులలో ఎవరైనా ఒకరు ఎందుకు లేరో సాక్ష్యాధారాలతో నిరూపించాలని కూడా అడుగుతారు. ఇది అసోంలో అమలుపరిచిన జాతీయ పౌరపట్టిక (ఎన్ఆర్‌సీ)లా కనిపించడం లేదా? సదరు డాక్యుమెంట్లను పరిశీలించి ధ్రువపరిచేందుకు సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్‌లు అనుసరించాల్సిన విధి విధానాలను ఈసీఐ ఇంతవరకూ రూపొందించనే లేదు. ప్రస్తుత దేశ పాలకులకు ఇబ్బందికరంగా ఉన్న సామాజిక సమూహాలకు చెందిన వ్యక్తులను ఓటర్ జాబితాల నుంచి తొలగించేందుకే ఈ నిబంధనలను తెచ్చారనడంలో సందేహం లేదు. ఈ దృష్ట్యా రెండో దశ 'సర్' నేరుగా పౌరసత్వ అర్హతల ధ్రువీకరణ ప్రక్రియ అని భావించవలసివస్తోంది. మన ఓటర్ జాబితాలను వేధిస్తున్న వ్యాధికి 'సర్' సరైన ఔషధమా? కాదా? అని తనిఖీ చేసేందుకు కాక ముందుగా నిర్ణయించిన సందేహాస్పద సామర్థ్యం కలిగిన ఔషధం ఎంత చక్కగా పనిచేస్తుందో నిర్ధారించుకునేందుకు బిహార్‌లో అమలుపరిచిన ప్రత్యేక సమగ్ర సవరణ ఒక దృష్టాంతమనేది స్పష్టం.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

> **బిహార్ ఓటర్ జాబితాలో నాణ్యతను మెరుగుపరచడంలో 'సర్' సఫలమవలేదు. వయోజన ఓటర్ల నిష్పత్తి బాగా పడిపోయింది. మహిళా, ముస్లిం ఓటర్లు పెద్ద సంఖ్యలో తగ్గిపోయారు. నకిలీ ఓటరు నమోదులు, డజన్ల కొద్దీ ఓటర్ల చిరునామా ఒకటే కావడం... మొదలైనవి యథా ప్రకారం కొనసాగాయి. మరి ఈసీఐ ఈ లోపాలను గుర్తించిందా? 'సర్' రెండో దశను ప్రకటించిన తీరును నిశితంగా గమనిస్తే బిహార్ అనుభవాల నుంచి భారత ఎన్నికల సంఘం సరైన పాఠాలు నేర్చుకోలేదని స్పష్టమవుతోంది.**

సర్దార్ స్ఫూర్తే వికసిత భారత్

స్వతంత్ర భారతదేశానికి తొలి ఉప ప్రధాని, హోంశాఖా మంత్రి, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని ఘనంగా జరుపుకోవాల్సిన బాధ్యత మన అందరిదీ. తెలంగాణ బిడ్డలుగా సర్దార్ పటేల్‌కు గౌరవ వందనం చేయడం మన అదృష్టం. ఆయన చూపిన ధైర్యం, రాజకీయ చాణక్యం, స్థిరమైన సంకల్పం వల్లనే దక్కన్ ప్రాంతానికి గుండెకాయ అయిన హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో అవిభాజ్య భాగంగా నిలిచింది.

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు అప్పటి మన నేతలు దేశంలో ఉన్న సుమారు 565 సంస్థానాలను ఒక సార్వభౌమ దేశంగా ఏకీకరించే మహత్తరమైన కార్యానికి పూనుకున్నారు. బ్రిటిష్ వారు దేశాన్ని వదిలి వెళ్లేటప్పుడు భారత్ విభజిత ఉపఖండంలా ఉంది. దీన్ని పరిష్కరించడానికి మొక్కవోని ధైర్యం, అకుంఠిత కార్యదీక్ష కావాలి. అప్పటికి చాలా సంస్థానాలు స్వయం చాలకంగానే భారత్‌లో అంతర్భాగం అయ్యేందుకు అంగీకరించాయి. కేవలం హైదరాబాద్ సంస్థానం, జునాగఢ్, కశ్మీర్ వంటి రాజ్యాలు స్వతంత్రంగా ఉండాలని లేదా పాకిస్థాన్‌లో భాగం కావాలని కోరుకున్నాయి. కానీ సర్దార్ వల్లభాయ్ పటేల్ మాత్రం దేశంలోని ఏ ఒక్క స్వతంత్ర సంస్థానాన్నీ విడిగా ఉంచేందుకు అంగీకరించలేదు.

నాటి నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ నేతృత్వంలో సమృద్ధి, స్వావలంబనతో ఉన్న రాష్ట్రం హైదరాబాద్. దీనికి సొంత కరెన్సీ, సైన్యం, పరిపాలన ఉన్నాయి. అప్పటికి ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడయిన నిజాం, భారత యూనియన్ నుంచి తాను స్వతంత్రంగా ఉండగలనన్న బలమైన నమ్మకంతో ఉన్నాడు. వల్లభాయ్ పటేల్ మాత్రం ఏకీకృత భారతంలో హైదరాబాద్ ప్రత్యేకంగా ఉండబోదని స్పష్టం చేశారు.

భారత ప్రభుత్వం కశ్మీర్‌ను కలుపుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం ఉన్నా, ఇక్కడ హైదరాబాద్ రాష్ట్రాన్ని భారత్‌లో విలీనానికి రజాకార్లు, నిజాం వ్యక్తిగత సైన్యం ఒప్పుకోలేదు. వారు తెలంగాణ పౌరులపై ప్రత్యేకించి భారత్‌లో విలీనం కోసం నిలబడిన హిందువులపై అనేక దాడులు చేశారు. కశ్మీర్ యుద్ధానికి, పాకిస్థాన్‌కు నిజాం ఆర్థిక మద్దతు ఇవ్వడం వంటి చర్యలు పటేల్ సంకల్పాన్ని మరింత బలపరిచాయి. దాంతో భారతదేశ ఏకీకరణకు ఆయన దృఢమైన నిశ్చయంతో ముందుకు కదిలారు. 1948 సెప్టెంబర్ 13న 'ఆపరేషన్ పోలో' కింద భారత సైన్యం మేజర్ జనరల్ జె.ఎన్.చౌదరి నాయకత్వంలో వేగంగా హైదరాబాద్ వైపునకు మళ్లింది. నిజాం సైన్యం కనీసం పోరాటాన్ని కూడా చూపలేదు. కేవలం నాలుగు రోజుల్లో నిజాం ఓటమిని ఒప్పుకుని లొంగిపోయాడు. వ్యూహం, దౌత్యం, నిర్ణయాత్మకమైన సైనిక చర్యల సంవిధానంతో హైదరాబాద్ రాష్ట్రాన్ని భారత్‌లో పటేల్ విలీనం చేయించగలిగారు. ప్రధాని నెహ్రూ ఊహించినట్లుగా... విషయం యునైటెడ్ నేషన్స్ వరకూ వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఆధునిక భారతదేశ చరిత్రలో అత్యుత్తమ రాజనీతిజ్ఞతకు, ధైర్యానికి ఇది గొప్ప ఉదాహరణ.

సర్దార్ పటేల్ ఆధునిక భారతదేశ నిర్మాణానికి ఒక రూపకర్త. అనేక అడ్డంకులను అధిగమించి విభిన్న ప్రాంతాలను ఏకం చేశారు. మనం ఈ రోజు ఒకే దేశంగా మనగలుగుతున్నాం అంటే అది సర్దార్ పటేల్ కృషి వల్లే. ఇప్పటికీ దేశంలోని కొన్ని శక్తులు ఈ సమగ్రతను వ్యతిరేకిస్తున్నారు. వీళ్ల ఆయుధాలు, బాంబులు, వివిధ ప్రచార మాధ్యమాలు ఉపయోగించి ప్రజలను విభజిస్తున్నారు. పటేల్ నిర్మించిన ఈ దేశ సమైక్యతను ప్రశ్నిస్తున్నారు. కానీ ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాల నాయకత్వంలో భారతదేశ సమగ్రత, అంతర్గత భద్రత వంటి అంశాలు ప్రజలకు ఒక నమ్మకాన్ని కలిగించాయి.

దురదృష్టం ఏమిటంటే వల్లభాయ్ పటేల్‌కు మన పాఠ్యపుస్తకాలలో సరైన స్థానాన్ని, గౌరవాన్ని ఇవ్వలేకపోయాం. చరిత్రను కేవలం ఒక కుటుంబం గౌరవానికి అనుకూలంగా రచించడం, స్వాతంత్ర్యం కోసం పనిచేసిన ఎంతో మంది గొప్ప నాయకుల చరిత్రను పుస్తకాల్లో లేకుండా చేయడం వాస్తవ చరిత్రను కప్పి ఉంచడమే.

అంతర్జాతీయంగా దేశాల మధ్య భౌగోళిక రాజకీయ అనిశ్చితి ఏర్పడినప్పుడు, ప్రతి దేశం ప్రత్యక్షంగా, పరోక్షంగా సమస్యలను ఎదుర్కొంటుంది. అలాగే వివిధ దేశాలలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో దేశ ప్రజలందరూ సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపిన ఏకతా మార్గంలో ప్రయాణించవలసిన అవసరం ఉంది. ఈ రోజు మనం సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను గౌరవిస్తూ, ఆయన గుండె ధైర్యాన్ని, దూరదృష్టిని, ఏకీకృత భారతదేశానికై చూపిన అచంచల విశ్వాసాన్ని స్మరించుకుందాం. ఆయన జీవితాన్ని ప్రేరణగా తీసుకుంటూ ఒక ఆత్మనిర్భర భారతాన్ని, సుస్థిర ప్రజాస్వామ్యాన్ని నిర్మించడానికి మనమంతా కృషి చేద్దాం. వికసిత భారత్ వైపు అడుగులు వేస్తున్న ఈ తరుణంలో సర్దార్ పటేల్ చూపిన ఆదర్శం మనకు మార్గదర్శకం.



○ ఎన్. రామచందర్ రావు
బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు



సమైక్యతే భారతీయ జీవన ధర్మం

గణతంత్ర భారత పునాదులను నిశ్చయాత్మకంగా తీర్చిదిద్దిన వ్యక్తుల్లో ప్రముఖుడు స్వతంత్ర భారత తొలి ఉప ప్రధానమంత్రి, హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్. ఆయన జయంతిని పురస్కరించుకుని, ఏటా అక్టోబరు 31న 'రాష్ట్రీయ ఏక్తా దివస్' (జాతీయ సమైక్యతా దినోత్సవం) జరుపుకుంటున్నాం. 1947 అనంతరం 560కు పైగా సంస్థానాలను ఏకతాటి పైకి తెచ్చి ఒకే రాజకీయ చత్రం కింద వాటిని విలీనం చేశారాయన.

దేశ విభజనానంతర పరిస్థితుల్లో... పటేల్ వాస్తవిక దృక్పథం, సహనం, దృఢత్వాలే భారత ఉపఖండం విచ్ఛిన్నం కాకుండా నిరోధించాయి. ఆయన చొరవ, దృఢ సంకల్పమే లేకపోతే జునాగఢ్, హైదరాబాద్, జమ్మూ–కశ్మీర్ అనిశ్చితిలోకి జారిపోయి ఉండేవి. పటేల్ ప్రతిపాదించిన 'సమైక్యతా' భావన 'అందరూ ఒకేలా ఉండి తీరాల'న్నది కాదు.. ఉమ్మడి వారసత్వంతో ముడిపడి ఉన్న దేశ జనుల భావాలు, హృదయాల కలయిక అది. విస్తృతమైన వైవిధ్యాలు, సరికొత్త ఆకాంక్షల శకంలో ఆ విశ్వాసమే భారత్‌ను స్థిరంగా నిలుపుతోంది.

> **సర్దార్ పటేల్ 150వ జయంతి జరుపుకొంటున్న తరుణమిది. పాలరాతి విగ్రహాలో, స్మారకాలో పెట్టడం కాదు... తాము దేశ ఐక్యతా ప్రస్థానంలో భాగమని ప్రతి భారతీయుడూ భావించేలా చూడడమే ఆ ఉక్కు మనిషికి నిజమైన నివాళి.**

ఐక్యత అంటే 'నిశ్చిత భావన' కాదని, దేశ చేతన దిశగా నిరంతర చర్యగా దాన్ని గుర్తిస్తూ.. పటేల్ జయంతిని 'జాతీయ సమైక్యతా దినోత్సవం'గా నిర్వహించాలని 2014లో ప్రభుత్వం నిర్ణయించింది. దేశ సమగ్రత కోసం పునరంకితమవుతామని దేశవ్యాప్తంగా పాఠశాలలు, పౌర సమాజ సంస్థలు, ప్రజలు ఆ రోజు ప్రతిజ్ఞ చేస్తారు. సమష్టి కార్యాచరణ దిశగా పటేల్ ఇచ్చిన పిలుపును ప్రతిబింబించేలా 'ఐక్యత కోసం పరుగు (రన్ ఫర్ యూనిటీ)' వంటి కార్యక్రమాలుంటాయి. దేశభక్తి భావోద్వేగాలకు మాత్రమే పరిమితం కాదని, మన క్రియాశీల భాగస్వామ్యం ఆవశ్యకమని ఇవి చాటుతాయి.

పటేల్ దేశ నిర్మాణ పరంపరను చిరస్మరణీయం చేసేలా నెలకొల్పిన 182 మీటర్ల ఎత్తైన 'ఐక్యతామూర్తి (స్టాచ్యూ ఆఫ్ యూనిటీ)' సమీపంలో.. ఏక్తా నగర్‌లో ఈ సంవత్సరం ఆయన 150వ జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భిన్న స్వరాలు ఒక్కటవ్వడమే భారత్ బలమన్న స్ఫూర్తిని చాటేలా సాంస్కృతిక ప్రదర్శనలు, రాష్ట్రాల శకటాలు, 900 మందికి పైగా కళాకారుల ప్రదర్శనలు ఉంటాయి.

విస్తృతమైన భాషలు, విశ్వాసాలు, జానపద సంప్రదాయాలు కలసిమెలసి సాగుతున్న మన దేశంలో.. 'సంస్కృతి' భావనే అనాదిగా ఐక్యతకు శాశ్వత వారధిగా నిలిచింది. జోనల్ సాంస్కృతిక కేంద్రాల నుంచి జాతీయ స్థాయి మ్యూజియాల వరకు.. సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సంస్థలన్నీ దేశ వారసత్వ సంపదను అందరికీ అందుబాటులోకి తేవడానికి నిరంతరం కృషి చేస్తున్నాయి. దేశ సాంస్కృతిక పథం నుంచి ఏ ప్రాంతమూ వేరుపడి లేదన్న భరోసానిస్తున్నాయి.

భాష, వంటకాలు, కళల విషయంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య పరస్పర వినిమయం ద్వారా.. 'ఏక్ భారత్ శ్రేష్ఠతా భారత్' వంటి కార్యక్రమాలు ఈ స్ఫూర్తిని సంస్థాగతీకరిస్తున్నాయి. మహారాష్ట్ర విద్యార్థులు బిహూ నేర్చుకుంటారు, అస్సాం యువ కళాకారులు పూణేలో లావణి ప్రదర్శిస్తారు.. 'ఒకరినొకరు తెలుసుకోవడమే కలిసి నిలిచేందుకు తొలి మెట్టు' అన్న పటేల్ భావనను అనుసరించడమే ఇది.

పర్యాటకం కూడా ఐక్యతకు సాధనం. పంజాబ్ స్వర్ణ దేవాలయం నుంచి కేరళ మిగులు జలాల వరకు, అస్సాం తేయాకు తోటల నుంచి రాజస్థాన్ ఎడారుల వరకు... 'దేఖో అప్నా దేశ్' కార్యక్రమం, నవీకరించిన 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా' డిజిటల్ వేదికలు ప్రజలు తమ మాతృభూమిలోని అన్ని ప్రాంతాలనూ చుట్టి వచ్చేలా ప్రోత్సాహన్నిస్తున్నాయి. ఒక్క 2024లోనే దేశీయ పర్యటనలు 294 కోట్ల మార్కును దాటాయి. భారత్ పట్ల భారతీయుల్లో పెరుగుతున్న ఉత్సుకతకు, చైతన్యానికి ఇది నిదర్శనం.

'స్వదేశ్ దర్శన్, ప్రసాద్' వంటి పథకాలు మౌలిక వసతుల కల్పనకే పరిమితం కాకుండా, స్థానికులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. నాగాలాండ్‌లో ఓ మహిళ నడిపే అతిథి గృహానికి గుజరాత్ సందర్శకులు వెళ్లడం, జోధ్‌పూర్‌లోని ఓ కళాకారుడు తమిళనాడు పర్యాటకులకు హస్త కళాకృతులను విక్రయించడం... ఇవన్నీ వస్తువుల విక్రయమో, వ్యాపారం మాత్రమో కాదు.. వారు అనుభవాలను పంచుకుంటారు. అది దేశాన్ని మరింత దగ్గర చేస్తుంది.

సమైక్యతా భావన తరతరాల చైతన్యంగా ఉండాలన్నదే సర్దార్ పటేల్ అంతరంగం. ఉదాసీనత, అవివేకం, సంకుచిత ప్రాంతీయ భావన వంటి విచ్ఛిన్నకర అంశాల నుంచి దాన్ని రక్షించుకోవాలి. 2047 వైపు దేశం వేగంగా అడుగులేస్తున్న తరుణంలో... దేశ సంఘటనా కృతనిశ్చయమే కేంద్రంగా పంచ ప్రాణ్ (ఆజాదీ కా అమృత మహోత్సవ్ అయిదు సంకల్పాలు) రూపకల్పన జరిగింది.

సర్దార్ పటేల్ 150వ జయంతిని జరుపుకుంటున్న తరుణమిది. పాలరాతి విగ్రహాలో, స్మారకాలో కాదు... దేశ ఐక్యతా ప్రస్థానంలో భాగమని ప్రతి భారతీయుడూ భావించేలా చూడడమే ఆ ఉక్కు మనిషికి మనమిచ్చే నిజమైన నివాళి. సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొనడం, మ్యూజియాల సందర్శన, అనేక రాష్ట్రాల సందర్శన... ఇలా ప్రతి సమష్టి కార్యక్రమమూ మన నాగరికతను అనుసంధానించే అమూర్త బంధాలను మరింత పటిష్ఠం చేస్తుంది.

సర్దార్ పటేల్ మాటల్లో చెప్పాలంటే.. సమైక్యతే దేశ భవితకు మార్గం, మన అంతిమ లక్ష్యం – ఇదే ఏక్ భారత్, శ్రేష్ఠతా భారత్ స్ఫూర్తి... ఆయన నిర్దేశాన్ని శిరసావహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అదే బాటలో నడుస్తున్నారు.



■ గజేంద్రసింగ్ షెకావత్
కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి

ట్రావెల్.. టెన్షన్..!

కర్నూలు ప్రమాదం నేపథ్యంలో నగరంలో

తగ్గిన ప్రైవేట్ సర్వీసులు.. ప్రయాణికుల పరేషాన్

కొన్ని సంస్థలు డబ్బులను రీఫండ్ చేసిన వైనం

'మొంథా' తుపాను ప్రభావంతో తక్కువగా ఆర్టీసీ బస్సులు



6

పట్టపగలే రియల్టర్ కిడ్నాప్

● ఆర్థిక లావాదేవీలే కారణమని పోలీసుల అనుమానం



మంత్రి శ్యామ్

అంబర్‌పేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అంబర్‌పేటలో పట్టపగలే ఓ స్థిరాస్తి వ్యాపారి అపహరణకు గురయ్యారు. స్థానిక డీడీ కాలనీలో నివాసముంటున్న మంత్రి శ్యామ్ (55)ను బుధవారం మధ్యాహ్నం 4 గంటల సమయంలో నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. శ్యామ్ గతంలో అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశారు. పది సంవత్సరాల క్రితం నగరానికి తిరిగి వచ్చిన ఆయన ప్రస్తుతం స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నట్లు తెలిసింది. ఆయనకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య మాధవీలత సన్‌సిటీలో నివాసం ఉంటుండగా, రెండవ భార్య ఫాతిమా ఆరాంఘర్‌లో ఉంటోంది. శ్యామ్ కొన్ని రోజులుగా అంబర్‌పేట డీడీ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా నివసిస్తున్నారు. కిడ్నాప్ జరిగిన రోజు సాయంత్రం రెండో భార్య ఫాతిమా ఆయనకు ఫోన్ చేయగా వేరేవారు ఎత్తడంతో అనుమానం వచ్చిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు స్థానిక సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించగా.. అందులో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు శ్యామ్‌ను అపార్ట్‌మెంట్ నుంచి బలవంతంగా తీసుకెళ్తున్నట్టు రికార్డయింది. ఈ మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు సీఐ కిరణ్ కుమార్ తెలిపారు. వ్యాపారిని కిడ్నాప్ చేయడానికి ఆర్థిక లావాదేవీలే కారణమని అనుమానిస్తున్నారు.



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద గుంతలుగా మారిన రోడ్డు



కూకట్‌పల్లి సమీపంలో గుంతల మయంగా రోడ్డు

రోడ్డుపై గుంత.. తీరని చింత..!



గ్రేటర్‌లో రహదారులు అధ్వానం

వానాకాలంలో పాడైన రోడ్ల మరమ్మతు పూర్తవని వైనం

తాజా వర్షంతో మరింత దుర్భరం

ప్రమాదాల బారిన వాహనదారులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను మహానగర రోడ్లపై ప్రభావం చూపింది. మొన్నటి వరకు వర్షాలతో పాడైన రహదారుల మరమ్మతు ఇప్పుడిప్పుడే తుది దశకు చేరుకుంది. రోడ్ సేఫ్టీ డ్రైవ్‌లో భాగంగా రోడ్లపై గుంతల పూడ్చివేత, ప్యాచ్ వర్క్ చేస్తున్నామని జీహెచ్‌ఎంసీ చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అధ్వానంగా ఉంది. గతంలో కురిసిన వానలతో ఏర్పడిన గుంతలు ఇప్పటికీ అలానే ఉన్నాయి. బుధవారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పరిస్థితి మరోసారి అధ్వానంగా మారింది. ప్రధాన, అంతర్గత అన్న తేడా లేకుండా భారీ గుంతలు, కంకర, మట్టి తేలాయి. పలు చోట్ల జాతీయ

మిగతా 6వ పేజీలో..



అధ్వానంగా హుడా కాలనీ రహదారి

రోడ్లపరిస్థితి మెరుగునకు మొబైల్ యాప్

గుంతలు, కంకర తేలిన రహదారుల గుర్తింపు.. మరమ్మతు

మూతలు లేని మ్యాన్‌హోళ్లు, తెరిచి ఉన్న ఫ్యూజ్ బాక్స్‌ల సమస్యల ఫిర్యాదుకూ అవకాశం

6

అతివేగం ప్రాణం తీసింది..

● బాలానగర్ ఫ్లైఓవర్‌పై అదుపుతప్పిన స్పోర్ట్స్ బైకు

● తలపగిలి యువకుడి మృతి

బాలానగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అతివేగం ఓ యువకుడి ప్రాణాలు బలికొంది. డ్యూటీకి వెళుతున్నానని చెప్పి బయలుదేరిన యువకుడు అరగంటలోనే మృత్యుఒడిలోకి చేరుకున్నాడు. బాలానగర్ సీఐ టి.నర్సింహారాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓల్డుబోయినపల్లి మైత్రీవనం కాలనీకి చెందిన విష్ణుమిలకల రోహన్‌దేవ్ (21) మాదాపూర్‌లోని కాన్సియంట్ స్పోర్ట్స్ అకాడమీలో ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం డ్యూటీకి టీజీ08ఎల్‌వో0770 స్పోర్ట్స్ బైకుపై ఇంటినుంచి బయలు దేరాడు. మితిమీరిన వేగంతో వెళుతున్న అతడు బాలానగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టాడు. తల బలంగా ఢీ కొట్టడంతో అతను అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. సమాచారం అందుకున్న బాలానగర్ పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి మృతుడి సోదరుడు రాజీవ్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రోహన్‌దేవ్ (ఫైల్)

ఆటోలో యువకుడి మృతదేహం

6

లెక్కలోకి రాకుండా పక్కా ఏర్పాట్లు!

పొరుగు నియోజకవర్గాల్లో జూబ్లీహిల్స్ సమావేశాలు

ఎన్నికల పరిశీలకుల నుంచి తప్పించుకునే ఎత్తుగడలు

కులాలు, ప్రాంతాల వారీగా ఓటర్ల బృందాలు

హోటళ్లు, ఫంక్షన్‌హాళ్లలో విందులు

బంజారాహిల్స్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో రాజకీయ వేడి తారస్థాయికి చేరింది. ప్రచారానికి మరో పది రోజుల్లో తెర పడనుండటంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పార్టీలు ప్రయత్నాల్లో వేగం పెంచాయి. ఓ వైపు స్థానికంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూనే మరోవైపు కులాలు, ప్రాంతాల వారీగా ఓటర్లను బృందాల్లా ఏర్పాటు చేసి వారితో పొరుగు నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. విందు, వినోదాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల ఖర్చుల్లోకి రాకుండానే ఈ ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలోనే ఖైరతాబాద్, శేరిలింగంపల్లి లాంటి నియోజకవర్గాల్లో హోటళ్లు, కొన్ని కల్చరల్ సెంటర్లు పది రోజుల పాటు పూర్తిగా బుక్ అయిపోయాయని నిర్వాహకులు చెబుతున్నారు.

ప్రాంతాల వారీగా..

జూబ్లీహిల్స్‌లో వలస వచ్చిన కుటుంబాలే అధికం. ముఖ్యంగా బస్తీలో ఉంటున్న వారిలో అత్యధికశాతం మహబూబ్‌నగర్, వరంగల్, కరీంనగర్, నల్గొండ జిల్లాకు చెందిన వారు ఉంటున్నారు. వీరందరిని ఒక తాటి మీదకు తీసుకువచ్చేందుకు అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలు ప్రయత్నాలు ఆరంభించాయి. గతవారం మహబూబ్‌నగర్ జిల్లాలో మూడు గ్రామాలకు చెందిన యాభై మంది ఓటర్లతో కాంగ్రెస్ ప్రముఖ ఎంపీ జూబ్లీహిల్స్ పొరుగు నియోజకవర్గంలో సమావేశం ఏర్పాటు చేశారు. తమ పార్టీకి

మిగతా 6వ పేజీలో..



డీఆర్సీ సెంటర్‌కు మూడంచెల భద్రత

● స్ట్రాంగ్ రూమ్ వద్ద కేంద్ర బలగాలు



స్ట్రాంగ్ రూం వెలుపల ఈవీఎంలు తెచ్చిన డబ్బాలు

బంజారాహిల్స్ అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రక్రియను నిర్వహించే యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియాన్ని డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కౌంటింగ్ (డీఆర్సీ)సెంటర్‌గా మార్చి మూడంచెల భద్రతను ఏర్పాటు చేయనున్నారు. అలాగే స్ట్రాంగ్‌రూమ్ భద్రతను కేంద్ర బలగాలు పర్యవేక్షిస్తాయి.

- మొదటి అంచెలో.. విజయభాస్కర్ రెడ్డి స్టేడియం ప్రధాన గేటు వద్ద ఒక ఏసీపీ, ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ఐదుగురు ఎస్‌ఐలు, ఎనిమిది మంది ఏఎస్‌ఐలు, 33మంది కానిస్టేబుళ్లు, 8మంది ఉమెన్ కానిస్టేబుళ్లు, 3 ప్లాటూన్ల సాయుధ బలగాలతో భద్రత ఏర్పాటుచేయనున్నారు.
- రెండో అంచెలో.. స్టేడియం లోపలికి వెళ్లే గేటు వద్ద ఒక ఏసీపీ, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు ఏఎస్‌ఐలు, 8 మంది కానిస్టేబుళ్లు, నలుగురు ఉమెన్ కానిస్టేబుళ్లు, రెండు చెకింగ్ టీమ్‌లు, రెండు అడ్వాన్స్‌డ్ ఫోర్సెస్ ప్లాటూన్లు

మిగతా 6వ పేజీలో..



ఎవరి ముచ్చట వారిదే..

జూబ్లీహిల్స్‌లో అంతుచిక్కని ఓటరు నాడి

ప్రధాన అభ్యర్థులందరికీ జై కొడుతున్న జనం

అయోమయానికి గురవుతున్న పార్టీ ముఖ్యనేతలు

6

పార్కు, ప్రభుత్వ స్థలం స్వాధీనం

● రూ.111 కోట్ల విలువైన భూమి కాపాడిన హైడ్రా

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్, బాలాపూర్ మండలాల్లో 976 చదరపు గజాల పార్కు స్థలం, 128 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా గురువారం కాపాడింది. వీటి విలువ రూ.111 కోట్లకుపైగా ఉంటుందని సంస్థ పేర్కొంది. మైలార్‌దేవ్‌పల్లి శాస్త్రిపురం కాలనీలో 976 చ.గజాల్లోని పార్కు స్థలానికి గతంలో మునిసిపల్ అధికారులు ఫెన్సింగ్ వేశారు. ఫెన్సింగ్ తొలగించి 1996లో వేసిన హుడా లే అవుట్‌లో కొందరు తప్పుడు డాక్యుమెంట్లతో పార్కు స్థలాన్ని కబ్జా చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో, డాక్యుమెంట్లు పరిశీలించిన హైడ్రా పార్కు స్థలాన్ని కాపాడింది. బాలాపూర్ మండలం జిల్లెలగూడ సర్వే నెంబర్-76లోని 128 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ప్లాట్లుగా విభజించి నకిలీ పట్టాలు సృష్టించి కొందరు విక్రయిస్తున్నారు. ఈ స్థలాన్నీ ఆక్రమణదారుల చెర నుంచి కాపాడింది.



ఆటోట్రాలీపై కూలిన బండ రాయి

కూలిన బండరాయి

● నుజ్జునుజ్జు అయిన ఆటోట్రాలీ.. తప్పిన ప్రాణనష్టం

మౌలాలి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మౌలాలి పరిధి గౌతంనగర్‌లో ఓ బండరాయి అకస్మాత్తుగా కూలి ఓ ఆటో ట్రాలీపై పడడంతో నుజ్జునుజ్జయింది. ఈ రాయి కూలుతున్న సమయంలో స్థానికులు, వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రాణనష్టం జరగకపోవడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. గౌతంనగర్ డివిజన్ మల్లికార్జున్‌నగర్‌లో ఉత్తమ్‌నగర్ నుంచి జ్యోతినగర్ ప్రధాన రోడ్డును ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో పెద్దగుట్టగా బండరాళ్లున్నాయి. గురువారం మధ్యాహ్నం బండరాళ్లున్న స్థలంలో మట్టికుంగడంతో ఒక్కసారి పెద్దశబ్దం చేస్తూ బండరాయి కిందకు దూసుకువచ్చి పార్కింగ్‌లోని ఆటో ట్రాలీపై పడడంతో వాహనం పూర్తిగా ధ్వంసమైంది. ఆ సమయంలో వాహనదారులు, ప్రయాణికులు చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. విషయం తెలుసుకున్న అఖిలపక్ష పార్టీల నాయకులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. చెత్త తరలించే వాహనం దెబ్బతినడంతో ఆ కుటుంబానికి అండగా ఉంటామని ఆయా పార్టీల నాయకులు భరోసా ఇచ్చారు. కార్పొరేటర్ మేకల సునీతయాదవ్, ఎంహెచ్‌వో మంజుల, ఇంజనీరింగ్ ఏఈ దివ్యజ్యోతిలతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి, జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారులకు సమాచారం అందించారు. హైడ్రా సిబ్బంది బండరాళ్ల తొలగింపు పనులు చేపట్టారు.

జంగల్.. కాంక్రీట్ జంగల్



అవనిని పచ్చని చెట్లతో తీర్చిదిద్దినట్టు కనిపిస్తుంది కదూ ఈ చిత్రం. గోల్కొండ కోటపై నుంచి చూస్తే కి.మీ. మేర పచ్చదనం పరుచుకుని అడవిని తలపిస్తోంది. అలాగే ఇంకాస్త దూరం చూస్తే భారీ భవంతులతో కూడిన నగరం కాంక్రీట్ జంగల్‌గా కనిపిస్తోంది.

- ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

వారం రోజుల్లో పది సైబర్ క్రైం కేసుల ఛేదన

● 20 మంది నిందితుల అరెస్టు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైం కేసుల దర్యాప్తులో సైబరాబాద్ పోలీసులు వేగం పెంచారు. 10 నెలల వ్యవధిలో నమోదైన సుమారు 2వేల సైబర్ క్రైం కేసుల్లోని పది కేసులను వారం రోజుల్లోనే (అక్టోబర్22 నుంచి 28వరకు) ఛేదించారు. 20 మంది నిందితులను అరెస్టు చేశారు. వివిధ రాష్ట్రాల్లో నివాసం ఉంటున్న వీరిని గుర్తించి అదుపులోకి తీసుకున్నామని సైబర్ క్రైం డీసీపీ సాయి శ్రీ తెలిపారు. అరెస్టయిన 20 మందిలో 14మంది నిందితులు ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు సంబంధించిన నేరాల్లో ఉన్నారని, వీరి నుంచి 24 మొబైల్ ఫోన్లు, 19 సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ట్రావెల్ కంపెనీకి రూ.3 కోట్ల మేర మోసం

నగరంలో ఓ ట్రావెల్ కంపెనీకి రూ. 3కోట్ల నష్టం వాటిల్లేలా చేసిన సైబర్ క్రైం కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. 2025 మే నుంచి జూలై మధ్య కంపెనీ ఆన్‌లైన్ టికెట్ బుకింగ్, డిజిటల్ వాలెట్ ప్లాట్‌ఫామ్‌లో మోసపూరిత కార్యకలాపాలు చేసినట్లు గుర్తించిన కంపెనీ ప్రతినిధి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంతమంది రిజిస్టర్డ్ యూజర్లు, అంతర్గత ఏజెంట్లు.. డిజిటల్ వాలెట్ రీఫండ్ సిస్టమ్‌లోని సాంకేతిక లోపాన్ని ఉపయోగించుకుని ఈ మోసానికి తెరతీసినట్లు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు చెన్నుపాటి శివన్నారాయణ, కదలి నారాయణ స్వామి, అనుగుల రాజ్‌కుమార్, జడ్డా బ్రహ్మయ్య, పరిచెర్ల వర్మలను అరెస్టు చేసినట్లు సైబరాబాద్ సైబర్ క్రైం డీసీపీ సాయి శ్రీ తెలిపారు.



మాదకద్రవ్యాలను పరిశీలిస్తున్న డ్రగ్ డిస్పోజబుల్ కమిటీ చైర్మన్ డీసీపీ ఎస్.శ్వేత

రూ.4.60 కోట్ల మాదకద్రవ్యాల దహనం

ఆరేళ్లలో పట్టుబడిన డ్రగ్స్‌కు నిప్పుపెట్టిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని 26 పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ.4.56 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను హైదరాబాద్ పోలీస్, డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం దహనం చేశారు. సీపీ వీసీ సజ్జనార్ ఆదేశాల మేరకు డ్రగ్ డిస్పోజబుల్ కమిటీ చైర్మన్ డీసీపీ ఎన్. శ్వేత ఆధ్వర్యంలో నందిగామలోని బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమలో వీటిని దహనం చేశారు. 2019నుంచి 2025 వరకు 128 కేసులకు సంబంధించిన కొకైన్, గంజాయి, ఎక్స్‌టసీ పిల్స్, హాష్‌ఆయిల్, ఎల్‌ఎస్‌డీ బ్లాట్లు, ఎండీఎంఏ, ఓసీబీ పేపర్ల వంటివి దహనం చేసిన వాటిలో ఉన్నాయి.

ఎలివేటెడ్ కారిడార్ పనులు.. ట్రాఫిక్ కష్టాలు

కంటోన్మెంట్ రహదారుల్లో ఇబ్బందులు

ప్రత్యామ్నాయ మార్గాలపై అవగాహన కరువు

సికింద్రాబాద్, అక్టోబర్ 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్యారడైజ్ నుంచి నాగపూర్ జాతీయ రహదారిలో సుచిత్ర వరకు ఎలివేటెడ్ కారిడార్ పనులు గురువారం ప్రారంభం అయ్యాయి. ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రజలకు అవగాహన కల్పించని కారణంగా ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని వివిధ ప్రాంతాల ప్రజలతోపాటు కంటోన్మెంట్ మీదుగా నగరంలోకి నిత్యం రాకపోకలు సాగించే వారికి తొలిరోజు చుక్కలు కనిపించాయి. ట్రాఫిక్ మళ్లింపులతో వాహనదారులు పడిన అవస్థలు అన్నీఇన్నీ కావు. సాధారణంగా రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌తో కిటకిటలాడే కంటోన్మెంట్ రహదారులు దారిమళ్లింపు కారణంగా విపరీతమైన రద్దీతో దర్శనమిచ్చాయి. ప్రతీ వీధిలో వాహనాలు ప్రవేశించడంతో అంతర్గత రోడ్లన్నీ వాహనాలతో బారులు తీరి కనిపించాయి. మరోవైపు టివోలీ-జేబీఎస్ మార్గం, తిరుమలగిరి- జేబీఎస్ మార్గంలో కూడా వాహనాలు బారులు తీరాయి. అయితే, అధికారులు ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్ల వద్ద ట్రాఫిక్ పోలీసు సిబ్బందిని పెద్దఎత్తున నియమించి ప్రజలకు అవగాహన కలిగించే యత్నం చేశారు.



తాడ్‌బండు ప్రధాన రహదారిలో ట్రాఫిక్ జామ్

మళ్లింపులు ఇవే..

- బాలంరాయిలోని రాజీవ్‌గాంధీ విగ్రహం నుంచి బాలంరాయి బాబూజగ్జీవన్‌రామ్

మిగతా 6వ పేజీలో..



నేలమట్టమైన బైసన్ పోలో గ్రౌండ్ ప్రహరీ

ఆటోలో యువకుడి మృతదేహం

కార్వాన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బగ్దావార్‌గూడ ప్రాంతంలో ఓ ఆటోలో యువకుడి మృతదేహాన్ని టోలిచౌకి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టోలిచౌకి ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ ముజామీల్ అలియాస్ అయూబ్(20) మృతదేహాన్ని గురువారం ఉదయం టోలిచౌకి ప్రాంతంలోని ఓ ఆటోలో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు బుధవారం అర్ధరాత్రి వరకు స్నేహితుడైన ఖలీద్‌తో కలిసి మద్యం తాగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. అయూబ్‌ను ఖలీద్ హత్య చేసి ఉంటాడని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఖలీద్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రోడ్డుపై గుంత.. తీరని చింత..!



హుడాకాలనీ సంకల్ప ఫౌండేషన్‌లో అధ్వానంగా ఉన్న రహదారి

(5వ పేజీ తరువాయి)

రహదారులు మరీ దుర్భరంగా మారాయి. హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారిపై ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి నల్ల చెరువు వరకు అడుగుకో గుంత ఉంది. అదే మార్గంలో అంబర్‌పేట, గోల్నాక, చాదర్‌ఘాట్ ప్రాంతాల్లోనూ రహదారులు అధ్వానంగా మారాయి. లింగంపల్లి రైల్వేస్టేషన్ నుంచి డాక్టర్ కాలనీ వైపు, లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జ్ నుంచి హుడాకాలనీ సాయిబాబా దేవాలయం వైపు వెళ్లే రోడ్లపై గుంతలు, కంకర తేలాయి. ఈ ప్రాంతంలో గతంలో రెండు ద్విచక్రవాహనాలు కిందపడిన ఘటనలున్నాయి. శివాజీనగర్ ఆంజనేయస్వామి దేవాలయం ఎదుట గుంతలో ఒకరు, జాతీయ రహదారి గంగారం ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నుంచి కేపీఎస్ఆర్ వరకు అధ్వానంగా మారిన రహదారిలో ఇద్దరు అయ్యప్ప స్వాములు కిందపడి గాయాలపాలయ్యారు. ఇలా అనేకమంది తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ హుడా పార్క్ నుంచి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ మీదుగా గంగారం చౌరస్తా వరకు వెళ్లే రహదారులు సైతం అధ్వానంగా మారాయి. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీ నుంచి బ్యాంక్ కాలనీ వెళ్లే మార్గంలో ఖైత్లాపూర్ వంతెన పక్కన రోడ్డుపై గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయి.



ఖైత్లాపూర్ ఫ్లైఓవర్ పక్కన గుంతలమయమైన రోడ్డు

లెక్కలోకి రాకుండా పక్కా ఏర్పాట్లు!

(5వ పేజీ తరువాయి)

ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు బీఆర్ఎస్ అధిష్ఠానం కూడా ఈ తంతు నిర్వహిస్తోంది. జిల్లాల వారీగా 20-30 మందిని బృందంగా తయారు చేసి వారిని తెలంగాణ భవన్‌కు తీసుకువెళ్లి భోజనం పెట్టి తమ హయాంలో జిల్లాల్లో చేపట్టిన పనుల గురించి వివరించారు. వీరితో వారి బంధువులకు చెప్పిస్తూ ఓటు వేయాలని కోరారు.

కుల పెద్దలతో సమావేశాలు

నియోజకవర్గంలో ఉన్న కులపెద్దలతో సమావేశాలు, పార్టీలు కూడా పొరుగు నియోజకవర్గంలోనే జరుగుతున్నాయి. నియోజకవర్గంలో కీలకంగా ఉన్న క్రిస్టియన్లతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఇప్పటికే రెండుమార్లు మీటింగ్ పెట్టుకున్నారు. బీఆర్ఎస్ తెలంగాణ భవన్‌లో నిర్వహించగా, కాంగ్రెస్ జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ కల్చరల్ సెంటర్‌లో నిర్వహించింది. ముస్లిం మతపెద్దలతో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సుమారు 14 వేలకు పై చిలుకు ఉన్న మున్నూరు కాపులను ప్రసన్నం చేసుకునేందుకు అధికార పార్టీ శేరిలింగంపల్లిలోని శిల్పకళావేదికలో సమావేశమైంది. ఇది జరిగిన రెండు రోజులకే మాజీ మంత్రి గంగుల కమలాకర్ కుల పెద్దలతో కలిసి తెలంగాణ భవన్‌లో సమావేశమయ్యారు. దీనికి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా హాజరయ్యారు. ఇదిలా ఉండగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పక్క నియోజకవర్గంలో ఎన్నికల కార్యాలయం ఏర్పాటు చేశారు. తాజాగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన నియోజకవర్గం పరిధిలోని మోతీనగర్‌లో పార్టీ కార్యాలయాన్ని తెరిచారు. అక్కడి నుంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కులాలు, వర్గాల వారితో ఇక్కడే సమావేశాలు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఎన్నికల పరిశీలకుల నుంచి తప్పించుకునేందుకేనా?

ఎటువంటి ఎన్నికలైనా ఎన్నికల కమిషన్ సూచించిన బడ్జెట్‌లోనే ప్రచారం ఖర్చులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం కమిషన్ నుంచి పరిశీలకులు ప్రతి నిత్యం అభ్యర్థిని వెంబడిస్తుంటారు. ప్రస్తుత ఉప ఎన్నికలో అభ్యర్థులు రూ.40 లక్షల లోపు ఖర్చు చూపించాల్సి ఉంటుంది. కుల, ప్రాంతాల వారీగా వారితో సమావేశాలు ఏర్పాటు చేయడం.. భోజనాలు పెట్టడం వంటివి నియోజకవర్గ పరిధిలో చేస్తే ఆ ఖర్చులన్నీ అభ్యర్థి ఖాతాలో చూపించాల్సి ఉంటుంది. దీంతో పార్టీలు అభ్యర్థి మీద భారం పడకుండా నియోజకవర్గం బయట సమావేశాలు నిర్వహిస్తున్నారని విశ్లేషకులు చెబుతున్నారు.

ఎలివేటెడ్ కారిడార్ పనులు

(5వ పేజీ తరువాయి)



జంక్షన్ వద్ద ట్రాఫిక్ మళ్లిస్తున్న పోలీసులు

విగ్రహం వరకు రోడ్డును మూసివేయడంతో ట్రాఫిక్‌ను మళ్లించారు. ప్యారడైజ్ నుంచి తాడ్‌బండ్, సీటీవిలేజీల మీదుగా వెళ్లే ట్రాఫిక్‌ను బాలంరాయి, క్లాసిక్ గార్డెన్స్, అన్నానగర్ జంక్షన్ల మీదుగా తాడ్‌బండ్ వైపు మళ్లించారు. అలాగే తాడ్‌బండ్, సీటీవిలేజీల నుంచి ప్యారడైజ్ వెళ్లే ట్రాఫిక్‌ను టివోలీ మీదుగా మళ్లించారు.

- బాలంరాయి రాజీవ్‌గాంధీ విగ్రహం- అన్నానగర్ తెలంగాణ తల్లి విగ్రహం జంక్షన్‌లో వన్‌వే ప్రవేశపెట్టి, అన్నానగర్ నుంచి ప్యారడైజ్ వరకు ట్రాఫిక్‌ను నిషేధించారు. ఫలితంగా బాలంరాయి, అన్నానగర్ బస్తీల్లోని ప్రజలు ప్యారడైజ్ వైపు వెళ్లాలంటే అన్నానగర్ అంతర్గత రోడ్లను ఆశ్రయించవలసి వస్తోంది.

టీపీటీఎఫ్ మూడు దశల ఉద్యమ కార్యాచరణ



గిరిజన సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ దిలీప్‌కుమార్‌కు నోటీస్ అందజేస్తున్న టీపీటీఎఫ్ నేతలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు, టీచర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి ప్రభుత్వాన్ని కోరారు. సంఘం ఆధ్వర్యంలో నవంబరు 12, 13న పాఠశాలల ఎదుట, 24న ఐటీడీఏ కార్యాలయం ఎదుట, డిసెంబరు 12న కమిషనరేట్ ఎదుట నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం టీపీటీఎఫ్ మూడు దశల ఉద్యమ కార్యాచరణ ప్రత్యక్ష నోటీసును గిరిజన సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ దిలీప్‌కుమార్‌కు అందజేశారు. సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతుండడంతోనే టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో మూడు దశల ఉద్యమ కార్యాచరణను తీసుకున్నామని వారు పేర్కొన్నారు.

నేడు శంషాబాద్‌లో భరోసా సెంటర్ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని శంషాబాద్ డీసీపీ కార్యాలయం ప్రాంగణంలో కొత్త భరోసా సెంటర్‌ను డీజీపీ శివధర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభిస్తారని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తెలిపారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా తెలంగాణ ఉమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చారుసిన్హా హాజరవుతారని తెలిపారు. మహిళల్లో ఉన్న భయాన్ని పోగొట్టి వారికి భద్రత కల్పించేందుకే భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని సీపీ తెలిపారు.

నేడు హెచ్‌సీయూలో 'అల్లాడి' స్మారకోపన్యాసం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఒరిస్సా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రచించిన 'భారత రాజ్యాంగ చరిత్ర' అనే పుస్తకంపై అల్లాడి మెమోరియల్ స్మారకోపన్యాసం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5:30గంటలకు యూనివర్సిటీలోని జాకీర్ హుస్సేన్ లెక్చర్ హాల్ కాంప్లెక్స్‌లో జరగనున్న ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జె.చలమేశ్వర్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు.



ఐఎంఏ ఎయిర్‌పోర్టు బ్రాంచ్ నూతన కార్యవర్గంతో రాష్ట్ర ప్రతినిధులు

ఐఎంఏ ఎయిర్‌పోర్టు బ్రాంచ్ కార్యవర్గం ఎన్నిక

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఐఎంఏ ఎయిర్‌పోర్టు బ్రాంచ్‌కు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కోఠిలోని తెలంగాణ ఐఎంఏ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐఎంఏ ఎయిర్‌పోర్టు బ్రాంచ్ అధ్యక్షుడిగా నిలోఫర్ ఆస్పత్రి పిల్లల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్, ప్రెసిడెంట్ ఎలక్ట్‌గా డాక్టర్ సరోజను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా డాక్టర్ రంజిత్, ప్రధాన కార్యదర్శిగా హృద్రోగ నిపుణుడు డాక్టర్ బద్రీనారాయణ, కోశాధికారిగా డాక్టర్ శబీర్, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ గీత, డాక్టర్ కేవీ రావులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా డాక్టర్ విజయ్‌రెడ్డి, సాయికుమార్, విజయేంద్ర రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ద్వారకానాథ్ వ్యవహరించారు.

డీఆర్సీ సెంటర్‌కు మూడంచెల భద్రత

(5వ పేజీ తరువాయి)

బందోబస్తు నిర్వహించనున్నాయి.

- మూడో అంచెలో.. స్టేడియం లోపల ఈవీఎంల పంపిణీ, ఓట్ల లెక్కింపును చూసేలా ఒక ఏసీపీ, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు ఎస్ఐలు, నలుగురు ఏఎస్‌లు, 12మంది కానిస్టేబుళ్లు, ఐదుగురు మహిళా కానిస్టేబుళ్ల నిఘాలో ఉండనున్నారు.
- స్ట్రాంగ్ రూమ్ వద్ద ఒక ప్లాటూన్ సాయుధ బలగాలు 24 గంటల పాటూ అప్రమత్తంగా ఉండనున్నాయి.
- స్టేడియానికి వెళ్లే రోడ్లలో ఆరు పికెటింగ్‌లు ఏర్పాటు చేయనున్నారు.
- వెస్ట్‌జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ పర్యవేక్షణలో స్టేడియం వద్ద మూడంచెల భద్రత, నిరంతర నిఘా మధ్య కొనసాగనుంది..
- స్టేడియం చుట్టూ, పికెటింగ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.

టీజీ-సెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష (టీజీ సెట్-2025) దరఖాస్తుల గడువును ఉస్మానియా విశ్వవిద్యాలయం పొడిగించింది. తాజా షెడ్యూల్ ప్రకారం సాధారణ గడువు అక్టోబరు 30 వరకు ఉండగా, లేట్ ఫీజుతో నవంబరు 21 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని టీజీ-సెట్ సభ్య కార్యదర్శి ప్రొఫెసర్ బి.శ్రీనివాస్ తెలిపారు. అభ్యర్థులు నవంబరు 1 నుంచి 8 వరకు రూ.1500, నవంబరు 9 నుంచి 19 వరకు రూ.2వేలు, 20 నుంచి 21 వరకు రూ.3వేల లేట్ ఫీజుతో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. హాల్‌టికెట్లు డిసెంబరు 3 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, పరీక్షలు ఇదే నెల రెండో వారం నిర్వహిస్తామని వెల్లడించారు.

వాటర్‌బోర్డుకు జేఎస్‌జేబీ అవార్డు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖ, జల వనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'టాప్ మునిసిపల్ కార్పొరేషన్' కేటగిరీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచినందుకు 'జల్ సంచయ్ జన భాగిదారి' (జేఎస్‌జేబీ) 1.0 అవార్డు వాటర్‌బోర్డుకు దక్కింది. ఈ అవార్డులో భాగంగా నీటి సంరక్షణ కార్యక్రమాల కోసం రూ.2 కోట్ల నగదు ప్రోత్సాహక బహుమతిని అందిస్తారు. హైదరాబాద్ మహానగరంలో నీటి సంరక్షణ మాత్రమే కాకుండా నీరు వృథా కాకుండా ప్రజల్లో సానుకూల మార్పు తీసుకురావడంలో వాటర్‌బోర్డు కీలక పాత్ర పోషించినందుకు, జేఎస్‌జేబీ పరిధిలో కమ్యూనిటీ ఆధారిత నీటి సంరక్షణ చర్యలను ప్రోత్సహించినందుకు ఈ అవార్డును అందిస్తున్నట్లు మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు వాటర్‌బోర్డు ఎండీ అశోక్ రెడ్డికి లేఖ రాశారు.

ఆరు రైల్వే స్టేషన్లలో ప్యాసింజర్ హోల్డింగ్ ప్రాంతాల అభివృద్ధి

హైదరాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక సందర్భాల్లో అదనపు ప్రయాణికుల రద్దీ పెరిగినప్పటికీ క్రమబద్ధం చేసేందుకు ఉద్దేశించిన ప్యాసింజర్ హోల్డింగ్ ప్రాంతాల అభివృద్ధి కోసం దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఆరు ప్రధాన రైల్వేస్టేషన్లను ఎంపిక చేశారు. జాతీయ స్థాయిలో ముఖ్యమైన 76 రైల్వే స్టేషన్లలో ప్యాసింజర్ హోల్డింగ్ ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా దక్షిణ మధ్య రైల్వేజోన్ పరిధిలో సికింద్రాబాద్, విజయవాడ, తిరుపతి, గుంటూరు, కాచిగూడ, రాజమండ్రి స్టేషన్లను అభివృద్ధి చేయనున్నారు. పండుగలు, ఇతర ప్రత్యేక సందర్భాల్లో స్టేషన్‌కు తరలివచ్చే ప్రయాణికుల అదనపు రద్దీని తట్టుకునేందుకు అవసరమైన ప్యాసింజర్ హోల్డింగ్ ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నారు. ఇటీవల న్యూఢిల్లీలో దీపావళి, ఛాట్ పండుగల సందర్భంగా చేపట్టిన ప్యాసింజర్ హోల్డింగ్ ప్రాంత అభివృద్ధి ప్రణాళిక విజయవంతం అవడంతో జాతీయ స్థాయిలో ముఖ్యమైన స్టేషన్లను గుర్తించి అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

కుమార్తె ఒడిబియ్యం కోసం అప్పు పుట్టలేదని తండ్రి ఆత్మహత్య

పటాన్‌చెరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్తగా పెళ్లయిన కుమార్తెకు ఒడిబియ్యం పోయడానికి అప్పు పుట్టలేదని మనస్తాపానికి గురైన ఓ తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన హైదరాబాద్‌లోని పటాన్‌చెరులో జరిగింది. స్థానిక రాఘవేంద్రకాలనీలో నివాసం ఉంటూ కూలి పనులు చేస్తున్న రవీందర్‌చారి (46) ఇటీవల తన కుమార్తె పావనికి వివాహం చేశాడు. నూతన దంపతులు దీపావళికి ఇంటికి రాగా.. కూతురును తిరిగి అత్తగారింటికి పంపే సమయంలో సంప్రదాయం ప్రకారం ఒడిబియ్యం పోయాలని కుటుంబసభ్యులు నిర్ణయించారు. అందుకు రూ.10 వేలు ఖర్చు అవుతుందని, ఆ మొత్తాన్ని ఎవరి వద్దనైనా అప్పుగా తీసుకోవాలని రవీందర్‌చారి తన భార్య భవానీతో చెప్పాడు. అప్పు పుట్టకపోవడంతో గురువారం మధ్యాహ్నం భోజనం చేస్తూ భార్యతో చెప్పి బాధపడిన రవీందర్‌చారి, అనంతరం బయటకు వెళ్లి పక్కింట్లోని వేపచెట్టుకు ఉరి వేసుకున్నాడు. భవానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వినాయకరెడ్డి తెలిపారు.

ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్కు నిర్మించండి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

గోషామహల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గోషామహల్ పోలీస్ మైదానంలో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం తర్వాత మిగిలిన 11 ఎకరాల ఖాళీ స్థలంలో స్థానికుల కోసం ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్ పార్కును నిర్మించాలని గోషామహల్ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. ఈమేరకు సంఘం అధ్యక్షుడు డి.గోపాల్ ఆధ్వర్యంలో గురువారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం గోపాల్ మాట్లాడుతూ, త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవిస్తామని, అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీ రానిపక్షంలో స్థానికులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్‌సింగ్, రాజ్‌కుమార్, కన్నయ్యలాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజానికి కృషి చేయాలి



అవినీతికి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

రాజేంద్రనగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఖజానకు గండిపడకుండ చూడటం, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హైదరాబాద్ రూరల్ యూనిట్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పాల్వాయి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో గురువారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్ షికా గోయల్ ఆదేశాను సారం పాల్వాయి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దేశ భవిష్యత్తు ప్రస్తుత యువ తరం, విద్యార్థుల మీద ఉందని, ప్రతి ఒక్కరూ నీతి నిజాయితీతో పనిచేయడానికి ముందుకు రావాలన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్ మాట్లాడుతూ, అవినీతికి దూరంగా ఉండాలన్నారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.గోవర్ధన్ మాట్లాడుతూ, విద్యార్థులు, ఉద్యోగులు అవినీతికి దూరంగా ఉండాలన్నారు. అవినీతి రహిత సమాజ స్థాపన ద్వారానే దేశాభివృద్ధి సాధ్యపడుతోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వి.రామిరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్ గౌడ్

బర్కత్‌పుర, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో కల్పించిన 42శాతం రిజర్వేషన్‌లపై సీఎం రేవంత్‌రెడ్డి అఖిల బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం మోతీమార్కెట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీ బిల్లును తక్షణమే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. రాష్ట్రపతి, రాష్ట్ర గౌవర్నర్ ఈ బిల్లును ఆమోదించాలని ఆయన కోరారు. 42శాతం రిజర్వేషన్‌లకు చట్టబద్దత కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మహాసభ నాయకులు బి.కృష్ణ, భూషన్ భాస్కర్, ముత్యాలరావు, డాక్టర్ ప్రశాంత్ నిమ్కర్, కిషోర్‌గౌడ్, సత్యపాల్‌సింగ్, ప్రదీప్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పీఆర్‌సీ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి

రాజేంద్రనగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): 2023 జూలై నుంచి ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్‌సీని ఇవ్వాలని, లేని పక్షంలో డిసెంబరు 9 తర్వాత ప్రత్యేక కార్యాచరణకు దిగుతామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ టీఎస్) రంగారెడ్డి జిల్లా సర్వసభ్య సమావేశం బుధవారం రాత్రి కాటేదాన్ అమ్మ గార్డెన్‌లో జరిగింది. పీఆర్‌టీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామల మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.క్రిష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షులు పి.రాఘవేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పింగళి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు టెట్ నిబంధనను తొలగించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ముందుండి పరిష్కరించే సంఘం పీఆర్‌టీయూటీఎస్ అని, ఉపాధ్యాయులందరూ సంఘంలో చేరి మద్దతు తెలుపాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, రంగారెడ్డి జిల్లాల నాయకులు సుంకరి భిక్షం గౌడ్, బి.జగన్ మోహన్‌గుప్తా, పి.వెంకట్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, రామేశ్వర్ గౌడ్, సుశీల, కరుణ, పద్మ, సుదర్శన్, శ్రీనివాస్ సాగర్, మాణిక్యంరెడ్డి, భూక్యా శ్రీనివాస్, కన్నయ్య గారి గోవర్ధన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



● అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో దీపావళి మిలాన్ సందర్భంగా అన్నా కూట్ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. అగ్రసేన్ మహారాజ్‌కు పూజలు నిర్వహించిన అనంతరం ఈ వేడుకలు సాగాయి. అగర్వాల్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిరుద్‌గుప్తా గౌరవ కార్యదర్శి వికాస్ కేసరి, మాజీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ నారేత తదితరులను శాలువతో సత్కరించారు.

- బర్కత్‌పుర, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి)

జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్ గెలుపు ఖాయం



జూబ్లీహిల్స్ ఉప ఉన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ స్థానిక ప్రజల మద్దతుతో ఘన విజయం సాధిస్తాడని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆళీంన గెలుపునకు మద్దతుగా బస్తీలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం నవీన్ యాదవ్‌ను సత్కరించి అభినందనలు తెలియజేశారు.

- అఫ్జల్‌గంజ్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి)



● జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను కలిసి మద్దతు ప్రకటించిన పాత బస్తీ కాంగ్రెస్ పార్టీ నాయకులు పులిపాటి రాజేశ్‌కుమార్, తదితరులు

- మదీన, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి)

రోడ్డు వేయండి



శివరాంపల్లి ప్రశాంత్ కాలనీలో అధ్వానంగా మారిన రోడ్లు

- రూ. 15.2 లక్షలతో టెండర్లు పూర్తి
- పనులు చేపట్టని కాంట్రాక్టర్
- ఇబ్బంది పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

రాజేంద్రనగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శివరాంపల్లి ప్రశాంత్ కాలనీ రోడ్డు నెంబర్-9లో నూతనంగా రోడ్డు వేయడానికి రూ. 15.2 లక్షలతో టెండర్లు పూర్తయ్యాయి. పని పొందిన కాంట్రాక్టరు వర్క్ ఆర్డర్ కూడా తీసుకున్నాడు. రోడ్డు మాత్రం వేయడం లేదు. అధికారులు కాంట్రాక్టర్‌కు ఫోన్ చేస్తే మొదట్లో చేస్తానని చెప్పిన వ్యక్తి ఇటీవల ఫోన్ కూడా తీయడం లేదు. గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయానికి వచ్చి వెళ్లినట్లు తెలిసింది. ప్రశాంత్‌కాలనీ ప్రజలు తమ బస్తీలో రోడ్డు వేయించాలని అధికారులను కోరుతున్నారు. ప్రశాంత్‌కాలనీలో రోడ్ల గుంతలు పడి నడవడానికి కూడా వీలు లేకుండా మారాయి. రోడ్డు వేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ కూడా సూచించినట్టు తెలిసింది.



చాలా చోట్ల ఇదే తంతు

రాజేంద్రనగర్ సర్కిల్‌లో చాలా బస్తీలలో రోడ్లు, డ్రైనేజీ పైపులైన్ పనులు పొందుతున్న కాంట్రాక్టర్లు నెలల తరబడి వాటిని చేపట్టకుండా దాటవేస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని టెండర్లు పొందిన కాంట్రాక్టర్ వెంటనే పనులు చేయించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

రాజేంద్రనగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈనెల 31న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ బి.క్రిష్టారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రాజేంద్రనగర్ పరిసర బస్తీలు, కాలనీల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో నుంచి నడుస్తున్న బస్సు సర్వీసులపై సూచనలు, సలహాలు అందజేయాలన్నారు. ఎలాంటి విన్నపాలున్నా తెలియజేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం డిపో మేనేజర్ క్రిష్టారెడ్డి 9959226135ను సంప్రదించాలన్నారు.

● **చాంద్రాయణగుట్ట:** ప్రయాణికుల సలహాలు, సూచనలు, సమస్యలు తెలుసుకునేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఫారూఖ్‌నగర్, ఫలక్‌నుమా డిపో మేనేజర్‌లు వేదవతి, రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 7337346169, 9959226131 నంబర్లలో మాట్లాడవచ్చని వారు తెలిపారు.

స్వామివారి పల్లకీ సేవ



స్వామివారిని పల్లకీలో ఊరేగిస్తున్న ఆలయ చైర్మన్ కమిటీ సభ్యులు

పహాడీషరీఫ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రావణ నక్షత్రం సందర్భంగా శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణంలో భాగంగా పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాతలు ప్రముఖ సంస్థ జీవీపీఆర్ గణేష్ సాండ్ బ్లాస్టింగ్ కంపెనీ ప్రతినిధులు కుటుంబ సమేతంగా స్వామి వారి కల్యాణంలో పాల్గొన్నారు. బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం కమిటీ చైర్మన్ కళ్లెం నరేష్ గౌడ్, సభ్యులు కానుగుల భాస్కర్ నాయి, గురుజని రాధిక శ్రీనివాస్ గౌడ్, అనిత ఈశ్వర్ యాదవ్, చీమలదారి చెన్నయ్య, గొండ్యాల శేఖర్ లాల్ సతీష్‌గౌడ్, లాల్ విజయ్ గౌడ్, వాసుదేవ రెడ్డి, ఈసంపల్లి రాజుగౌడ్, రామరాజుగౌడ్ పాల్గొన్నారు.

మామిడిపల్లికి బస్ సౌకర్యం కల్పించాలి



బస్సు సౌకర్యం కల్పించాలని లక్ష్మారెడ్డికి వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పహాడీషరీఫ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ నరేష్‌గౌడ్, ఇందిరమ్మ కమిటీ చైర్మన్ విజయ్ గౌడ్, లాల్ సతీష్, జంగయ్య బృందం గురువారం కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కలిసి విన్నవించారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని మామిడిపల్లి ప్రజలు నిత్యం పట్టణప్రాంతాలకు వెళ్లేందుకు సొంత వాహనాలపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. మహిళలు, విద్యార్థులు, చిరు ఉద్యోగులు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని వారు విజ్ఞప్తి చేశారు. స్పందించిన లక్ష్మారెడ్డి ప్రజలకు రవాణా ఇబ్బందులు తొలగించి వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆదిళ్ల నరేందర్, రాజ్ కుమార్, చీమలదారి చెన్నయ్య సహా పలువురు పాల్గొన్నారు.

డ్రైనేజీలకు మరమ్మతులు



వర్షాల కారణంగా జాంబాగ్ డివిజన్‌లోని పలు బస్తీల్లో పొంగి పొర్లుతున్న డ్రైనేజీలకు మరమ్మతులు చేయిస్తున్నామని కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ తెలిపారు. గురువారం జీహెచ్‌ఎంసీ ఈఈ రాధిక, ఏఈ కులశేఖర్, హైడ్రా సిబ్బందితో కలిసి కార్పొరేటర్ పలు బస్తీలలో పాదయాత్ర నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీల ద్వారా దుర్వాసన వ్యాపిస్తున్న విషయం తెలుసుకుని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించారు.

- అఫ్జల్‌గంజ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి)

పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న పహాడిషరీఫ్ పోలీసులు స్థానికులు

పహాడిషరీఫ్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ పహాడిషరీఫ్ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానికులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులతో కలిసి న్యూ బాబానగర్ నుంచి నహది హోటల్ వరకు కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలను రక్షించడంలో పోలీసుల కృషి ఎంతో గొప్పదని, సమాజంలో శాంతి భద్రతలను కాపాడడమే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వహిస్తారన్నారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మనకు స్ఫూర్తి అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు బి.దయాకర్ రెడ్డి, ముహమ్మద్ ఫైసల్ అహ్మద్, వి.లక్ష్మయ్య, ఎల్.వెంకటేశ్వర్లుతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బిహార్‌లో మజ్లిస్ నాయకుల ప్రచారం



బిహార్ రాష్ట్రం బలరాంపూర్ నియోజకవర్గం నుంచి మజ్లిస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న న్యాయవాది ఆదిల్ హసన్ ఆజాద్ గెలుపు కోసం రాజేంద్రనగర్ సర్కిల్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ హబీబ్ జైన్ ఆరీఫ్ ప్రచారం చేస్తున్నారు. నవంబరు 11న జరిగే ఎన్నికలలో గాలిపటం గుర్తుకు ఓటు వేసి మజ్లిస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలన్నారు.

- రాజేంద్రనగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి)

సివిల్ సర్వీస్ వ్యవస్థ దేశ నిర్మాణానికి పునాది

● మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ స్థాపించిన సివిల్ సర్వీస్ వ్యవస్థ.. దేశ నిర్మాణానికి బలమైన పునాది వేసిందని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గురువారం ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్(ఎఫ్‌టీసీసీఐ)లో వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వైష్ణవ బండారు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'జాతీయ సివిల్ సర్వీస్ అధికారుల పాత్ర' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన దత్తాత్రేయ మాట్లాడుతూ, సమాజంలో పెరుగుతున్న రుగ్మతలు, అవినీతిని ఎదుర్కోవాలంటే సివిల్ సర్వీస్ వ్యవస్థ మరింత నిర్భయత్వం, ముక్కుసూటితనం కలిగి ఉండాలన్నారు. సివిల్ సర్వీస్ వ్యవస్థ బలపడాలంటే రాజకీయ వ్యవస్థ కూడా సమన్వయంతో సహకరించాలన్నారు. విద్యార్థులకు సిలబస్‌లోనూ సివిల్ సర్వీస్ వ్యవస్థ పరిణామం పాఠ్యాంశంగా ఉండాలని సూచించారు. సమావేశంలో మాజీ డీజీపీలు అంజనేయరెడ్డి, ఏకే మొహంతి, రాజేంద్రకుమార్, మహేందర్‌రెడ్డి, అరుణ బహుగుణ, విశ్రాంత ఐఏఎస్ అధికారులు టీపీ ఆచార్య, అజయ్‌మిశ్రా, గోనెల నిర్మల, వైష్ణవ బండారు ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా టీపీ ఆచార్య రచించిన 'అబ్బ్యూజ్ యాంగిల్-ఏ బ్యూరోక్రాట్స్ జర్నీ' పుస్తకాన్ని బండారు దత్తాత్రేయ ఆవిష్కరించారు. ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ చైర్మన్, వకులాంబరం కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/JCXnqElలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు. నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

పాన్‌షాపు నిర్వాహకుడి హత్య కేసు విచారణ

మదీన, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ గౌస్‌నగర్‌లో జరిగిన మోసిన్ హత్య కేసులో నిందితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది. బండ్లగూడ గౌస్‌నగర్‌లో పాన్‌షాప్ నిర్వాహకుడు మోసిన్‌ను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి దారుణంగా హత్యచేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో స్థానికంగా ఉండే ఆమిర్, ఫహద్, సొహైల్ అనే యువకులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ఈ ముగ్గురు యువకులు మృతుడికి స్నేహితులే. వీరి మధ్య మనస్పర్థాలున్నాయి. బస్తీలో ఒకరిపై ఒకరు చాడీలు ప్రచారం చేస్తున్నారనే కోపం ఉంది. దీంతో బుధవారం వారు మోసిన్ పాన్‌షాప్ వద్దకు వెళ్లి వాదనకు దిగారు. వాగ్వావాదం ఘర్షణగా మారడంతో ముగ్గురు వ్యక్తులు స్థానికంగా ఉండే మటన్ షాపులోని కత్తులతో మోసిన్‌పై దాడి చేసి దారుణంగా హత్యచేసినట్టు తెలిసింది. ఓ యువతితో ప్రేమ వ్యవహారం కూడా ఉన్నట్టు తెలిసింది. హత్యకు గల కారణాలు దర్యాప్తులో తేలుతాయని ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్ తెలిపారు.

న్యూసెన్స్ చేసిన వ్యక్తికి మూడు రోజుల జైలు

చాంద్రాయణగుట్ట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తికి న్యాయస్థానం 3 రోజుల జైలు శిక్ష విధించినట్లు శాలిబండ ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్ తెలిపారు. శాలిబండలో మహ్మద్ షఫీ మద్యం మత్తులో న్యూసెన్స్ చేస్తూ బస్తీవాసులకు ఇబ్బందులు కలిగిస్తున్నాడు. సమాచారమందుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. కేసును పరిశీలించిన న్యాయమూర్తి మురళి నిందితుడికి 3 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఎల్బీ స్టేడియంలో డాక్టర్స్ టెన్నిస్ టోర్నీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ టెన్నిస్ డాక్టర్స్ అసోసియేషన్ డాక్టర్స్ టెన్నిస్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తోంది. వచ్చే శనివారం నుంచి ఎల్బీ స్టేడియంలో రెండ్రోజుల పాటు ఈ పోటీలు జరుగనున్నాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ వైద్యులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని నిర్వాహకులు శేషు, మురళీ తెలిపారు. నాకౌట్ ఫార్మాట్‌లో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు.

డాక్టర్ శ్రీనివాస్‌రావుకు సత్కారం



డాక్టర్ శ్రీనివాస్‌రావును శాలువాతో సత్కరిస్తున్న టీపీఆర్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు రవికుమార్

బర్కత్‌పుర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలోని కనకదుర్గాదేవి ఆలయం నూతన ట్రస్ట్ మెంబర్‌గా నియమితులైన డాక్టర్ సింగం శ్రీనివాస్‌రావును గురువారం సత్కరించారు. తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆలయ ట్రస్ట్ మెంబర్‌గా నియమితులు కావడం అభినందనీయమని అన్నారు. ప్రజారాజ్యం పార్టీని బలోపేతం చేయడానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో నాలుగు స్తంభాలాట మొదలవుతుందని, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు దీటుగా ప్రజారాజ్యం పార్టీ పోటీలో నిలబడుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి కూనపురెడ్డి హరిప్రసాద్, కార్యకర్తలు సాయిరాం, విజయారెడ్డి, ఉదయ్‌సింగ్ పాల్గొన్నారు.

ముస్లింల ఓట్ల కోసమే అజారుద్దీన్‌కు మంత్రి పదవి!



బోరబండలో ప్రచారం చేస్తున్న షర్ఫుద్దీన్ హమీద్

పహాడిషరీఫ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికలో ముస్లింల ఓట్లు పొందడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అజారుద్దీన్‌కు మంత్రి పద వి అంటూ ముస్లింలను మరోసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నాడని జూబ్లీహిల్స్ ఎన్నికలో ముస్లింలు కాంగ్రెస్‌కు తమ ఓటు ద్వారా గుణపాటం నేర్పుతారని జల్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమీద్ అన్నారు. గురువారం షర్ఫుద్దీన్ హమీద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బోరబండ, యూసు ఫ్‌గూడ, కమలాపూరి కాలనీల్లోని ముస్లింల ఇంటింటికీ ప్రచారం చేసి మాట్లాడారు. కాంగ్రెస్ నేత అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వనున్నట్లు, రేపే తెలంగాణ కేబినెట్ విస్తరణ ఉంటుందని.. అజారుద్దీన్ తెలంగాణ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తాడని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని.. అసలు అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వరు. అదంతా ఎలక్షన్ స్టంట్ అని ఆయన పేర్కొన్నారు. ఓట్ల కోసం మంత్రి పదవి ఇస్తున్నట్లుగా మీడియాలో డ్రామా చేస్తున్నారని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్‌కు ఓటు వేసి ముస్లింలు మోసపోవద్దని పిలుపునిచ్చారు. నవీన్ యాదవ్ లాంటి రౌడీ షీటర్‌కు టికెట్ ఇచ్చినప్పుడే కాంగ్రెస్ ఓడిపోయిందని షర్ఫుద్దీన్ హమీద్ విమర్శించారు. జూబ్లీహిల్స్‌లోని ముస్లిములు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలకు చేస్తున్న మోసాలను చూశారని, ఎవ్వరు ఎన్ని జిమ్మికులు చేసినా మైనార్టీ ఓట్లు ముకుమ్మడిగా బీఆర్‌ఎస్‌కు వేసి భారీ మెజారిటీతో గెలిపిస్తరన్నారు.

ట్రావెల్.. టెన్షన్..!

- కర్నూలు ప్రమాదం నేపథ్యంలో నగరంలో తగ్గిన ప్రైవేట్ సర్వీసులు
- ప్రయాణికుల పరేషాన్
- కొన్ని సంస్థలు డబ్బులను రీఫండ్ చేసిన వైనం
- 'మొంథా' తుపాను ప్రభావంతో తక్కువగా ఆర్టీసీ బస్సులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని చిన్నటేకూరులో ఇటీవల జరిగిన బస్సు ప్రమాదం.. రవాణా శాఖ అధికారుల విస్తృత తనిఖీల నేపథ్యంలో ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీలు సర్వీసులను ఒక్కసారిగా తగ్గించాయి. నిబంధనల ప్రకారం బస్సు కండిషన్ బాగా ఉందనుకుంటేనే రోడ్డుపైకి తీసుకొస్తున్నాయి. గతంలోకంటే సర్వీసులు గణనీయంగా తగ్గడంతో నగరం నుంచి వారాంతంలో స్వగ్రామాలకు, వివిధ పనుల నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ రోజుల్లో అందుబాటులో ఉండే బస్సులతో పోలిస్తే రెండు, మూడు రోజులుగా 20 నుంచి 30 శాతం సర్వీసులు తగ్గాయని రవాణా శాఖ అధికారులు సైతం చెబుతున్నారు. కర్నూలులో జరిగిన తాజా దుర్ఘటన నేపథ్యంలో నగరం నుంచి వివిధ రాష్ట్రాలకు నడిచే ప్రైవేట్ ట్రావెల్స్‌లో ప్రయాణించేందుకు చాలామంది ప్రజలు వెనుకంజ వేస్తున్నారు. దీంతో తెలంగాణ, ఏపీ ఆర్టీసీ సర్వీసులు లేదా రైళ్లలో వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. కాగా, కొన్ని ట్రావెల్ ఏజెన్సీలు.. సంస్థకు చెందిన ఇతర వాహనాల్లో సీట్లు బుక్ చేసుకున్న వారిని అన్ని అనుమతులు ఉన్న వాహనాల్లోనే తరలిస్తున్నారు.

రాకపోకలు ఇలా..

కర్నూలు ప్రమాదం కారణంగా 'ఆరాంఘర్ నుంచి బెంగళూరు వెళ్లే బస్సులు యథావిధిగా నడుస్తున్నప్పటికీ.. గురువారం 20 శాతం సర్వీసులు తగ్గినట్లు ఓ ట్రావెల్ ఏజెన్సీ ఉద్యోగి పేర్కొన్నారు. బుకింగ్ డిమాండ్లు ఆశించినంతగా లేకపోవడమూ సర్వీసులు తగ్గేందుకు ఓ కారణమని మరో ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకుడు తెలిపారు. నాంపల్లి నుంచి రోజువారీగా వెళ్లే 100కు పైగా బస్సుల్లో సగం కూడా నడవని పరిస్థితి. పటాన్‌చెరు, బీరంగూడ పరిసర ప్రాంతాల నుంచి జేఎన్‌టీయూ, కూకట్‌పల్లి మీదుగా వెళ్లే సమారు వెయ్యికి పైగా బస్సుల్లో 20 వరకు కూడా నడవలేదని ట్రావెల్ ఏజెంట్లు తెలిపారు. సికింద్రాబాద్ స్టేషన్‌రోడ్డు ఏరియా పరిధిలో రెగ్యులర్‌గా నడుస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ యథావిధిగా కొనసాగాయి. సర్వీసులు తగ్గడంతో కొన్ని ట్రావెల్ ఏజెన్సీలు ధరలు పెంచాయి. గతంలో కంటే 10 శాతం పెంచినట్లు పలువురు వాపోయారు. ఆర్టీఏ అధికారుల తనిఖీలతో ప్రైవేటు బస్సులను నిలుపుదల చేయడంతో ఎల్బీనగర్ బస్టాప్ ప్రాంగణం వెలవెలబోయింది. బస్సులు నిలిపివేయడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రైవేటు ట్రావెల్స్‌లో టికెట్ బుక్ చేసుకున్న వారు బస్సులు రాక, ఆర్టీసీ బస్సుల్లో వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. కొందరు ప్రయాణాలను రద్దు చేసుకున్నారు. ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు బస్సులను నడిపించకపోవడంతో ప్రయాణికుల డబ్బులను రీఫండ్ చేశాయి. కొందరు ఇంకా రీఫండ్ చేయలేదని పలువురు ప్రయాణికులు పేర్కొన్నారు.

అధికారుల తనిఖీలు

కర్నూలు బస్సు ప్రమాదం నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాయి. ఉదయం, సాయంత్రం, వేళల్లో నగరం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే, హైదరాబాద్‌కు వచ్చే ప్రైవేట్ ట్రావెల్ బస్సులను తనిఖీ చేస్తున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే రవాణా శాఖ చట్టం ప్రకారం జరిమానా విధిస్తున్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన తనిఖీల్లో 214 కేసులు నమోదు చేసినట్లు రవాణా శాఖ సంయుక్త కమిషనర్ రమేష్ చిదుర తెలిపారు. రూ.5.05 లక్షల జరిమానా విధించామని, తొమ్మిది బస్సులు సీజ్ చేశామని చెప్పారు. తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పేపర్లు సరిగా లేకుండా, సీటింగ్ పర్మిషన్‌తో స్లీపర్ సర్వీసులను నడిపిస్తున్న సంస్థలు బస్సులను రోడ్లపైకి తీసుకురాలేదు. ఒకే ట్రావెల్స్‌లో టికెట్లు బుకింగ్ చేసుకున్నప్పటికీ దానికి అనుమతులు సరిగా లేకపోవడాన్ని దృష్టిలో ఉంచుకున్న సంస్థలు ఫిట్‌నెస్ కలిగిన బస్సులకు బుకింగ్‌లను ట్రాన్స్‌ఫర్ చేసి ప్రయాణికులను పంపించిన పరిస్థితి కనిపించింది.


ప్రైవేటు బస్సులు, ప్రయాణికులు లేక వెలవెలబోతూ కనిపిస్తున్న ఎల్బీనగర్‌లోని బస్టాప్ ప్రాంగణం

అనుమతి ఉన్న బస్సులే రోడ్లపైకి రావాలి

బస్సు ప్రమాదం నేపథ్యంలో ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీల ప్రతినిధులతో రవాణా శాఖ కమిషనర్ ఇటీవల సమావేశమయ్యారు. అనుమతి ఉన్న బస్సులే రోడ్లపైకి రావాలన్నారు. ఫైర్ డిటెక్షన్, ఫైర్ కంట్రోల్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. భద్రతపై ప్రయాణికులకు అవగాహన కల్పించాలని, దుర్ఘటన జరిగినప్పుడు తప్పించుకునే ప్రయత్నం ఎలా చేయాలన్నది వివరించాలని పేర్కొన్నారు.

ఏపీకి వెళ్లే బస్సులపై 'మొంథా' ఎఫెక్ట్

నగరం నుంచి ఏపీలోని పలు జిల్లాలకు తెలంగాణ ఆర్టీసీ సంస్థ ప్రతీ రోజు 115 బస్సులను నడుపుతోంది. మొంథా తుపాను ప్రభావంతో బుధవారం 50 బస్సులు, గురువారం 40కిపైగా బస్సులను రద్దు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రం నుంచి ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపినట్లు పేర్కొన్నారు.

బస్సుల రద్దుతో ఇబ్బందులు

ఉద్యోగ రీత్యా హైదరాబాద్ నుంచి చెన్నైకి వెళ్లాలి. ఓ ట్రావెల్స్‌లో టికెట్ బుక్ చేసుకున్నా. బస్సులను నిలిపివేశామని సదరు ట్రావెల్ వారి నుంచి మెసేజ్ రావడంతోపాటు డబ్బులు రీఫండ్ చేశారు. మరో ట్రావెల్‌లో టికెట్ బుక్ చేసుకున్నా.. బస్సులను నిలిపివేశామంటూ వారి నుంచి కూడా మెసేజ్ వచ్చింది. బస్సులను నిలిపివేయడంతో ఇబ్బందులు పడ్డాను. **- పొవ్వగాపు కృష్ణ, ప్రైవేటు ఉద్యోగి, అనకాపల్లి**

డబ్బులు తిరిగి ఇచ్చేశారు



మేము హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్లేందుకు గురువారం మధ్యాహ్నం ఓ ప్రైవేట్ బస్సులో టికెట్లు బుక్ చేసుకున్నాం. బస్సులు నిలిపివేశామంటూ సదరు ట్రావెల్స్ వారి నుంచి సాయంత్రం 6 గంటల సమయంలో మెసేజ్ రావడంతోపాటు డబ్బులు తిరిగి ఇచ్చేశారు. చేసేదేమీ లేక ప్రభుత్వ బస్సుల్లో ఇబ్బంది పడుతూ కాకినాడ వెళ్లేందుకు సిద్ధమయ్యాం. **- బండి రాము, కృష్ణానగర్, సరూర్‌నగర్**

రోడ్ల పరిస్థితి మెరుగునకు మొబైల్ యాప్

- అందుబాటులోకి తీసుకొచ్చిన జీహెచ్ఎంసీ
- గుంతలు, కంకర తేలిన రహదారుల గుర్తింపు.. మరమ్మతు
- మూతలు లేని మ్యాన్‌హోళ్లు, తెరిచి ఉన్న ఫ్యూజ్ బాక్స్‌ల సమస్యల ఫిర్యాదుకూ అవకాశం



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో రహదారుల పరిస్థితి మెరుగుపర్చేందుకు అధునాతన సాంకేతికతను వినియోగించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఒక్క క్లిక్‌తో సమస్య తెలుసుకోవడంతో పాటు.. దాని పరిష్కారాన్ని రియల్ టైమ్ మానిటరింగ్‌తో ట్రాక్ చేసే వ్యవస్థను రూపొందించింది. గ్రేటర్‌లో రహదారుల భద్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా 'పీరియాడిక్ పబ్లిక్ సేఫ్టీ మొబైల్ యాప్'ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఏఆర్‌సీజీఐఎస్(ఆర్క్ జీఐఎస్) ఫీల్డ్ మ్యాప్స్ టెక్నాలజీని యాప్‌లో వినియోగించనున్నారు. ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే అక్షాంశం, రేఖాంశం ఆధారంగా అది ఏ ప్రాంతం, సమస్య ఏంటన్నది తెలిసిపోతుంది. దీంతో క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో రోడ్ల స్థితి గుర్తింపు.. సమస్య పరిష్కారానికి యాప్ ద్వారా చర్యలు తీసుకోనున్నారు. మూతలు లేని మ్యాన్ హోళ్లు, ఫ్యూజ్ బాక్సులు తదితర సమస్యలనూ యాప్‌లో అప్‌లోడ్ చేసే అవకాశముంటుంది. ముందు రహదారుల నిర్మాణం, డిఫెక్ట్ లయబులిటీ పీరియడ్ (డీఎల్‌పీ) తదితర వివరాలూ సాంకేతికంగా అందుబటులో ఉండేలా సంస్థ చర్యలు తీసుకుంటోంది. దీంతో రోడ్లు వేయకుండా బిల్లులు తీసుకోవడం, నిర్మించిన కొన్నాళ్లకే మరోసారి రోడ్లు నిర్మించడం వంటి వాటికి చెక్ పడుతుందని ఓ అధికారి తెలిపారు. డీఎల్‌పీలో ఉన్న రహదారికి సంబంధిత ఏజెన్సీ ద్వారా మరమ్మతు చేయించనున్నారు.

- మొబైల్ యాప్‌లో ఇంజనీర్లు రోడ్లపై గుంతలు, మూతలు లేని మ్యాన్‌హోళ్లు, ప్రోట్రూడింగ్ బార్స్/ఇసుక, కంకర, ఫుట్‌పాత్‌లపై తెరిచి ఉన్న విద్యుత్ ఫ్యూజ్ బాక్సులు, సరిగా లేని బారికేడింగ్ వంటి సమస్యలపై జియో ట్యాగ్‌తో ఫొటోలు అప్‌లోడ్ చేస్తారు.
- యాప్‌లో అప్‌లోడ్ చేసిన సమస్యలు పరిష్కరించారా..? లేదా..? అన్నది రియల్ టైం ట్రాకింగ్ ద్వారా ఉన్నతాధికారులు తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది. తద్వారా వేగవంతమైన తనిఖీలు, పారదర్శక రిపోర్టింగ్ వ్యవస్థ ద్వారా బాధ్యతాయుతమైన మానిటరింగ్ సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.

ఇదీ ప్రయోజనం

యాప్ ద్వారా పాడైన రోడ్లను ఎప్పటికప్పుడు గుర్తించే అవకాశముంటుంది. ఏ ప్రాంతంలో మరమ్మతు జరిగింది? ఎప్పుడు చేశారు? అన్న వివరాలు నిక్షిప్తమై ఉంటాయి. జియో ట్యాగ్ ఆధారిత కచ్చితమైన డేటా సేకరణకు అవకాశముంటుంది. కేంద్ర డ్యాష్‌బోర్డ్ ద్వారా యాప్‌లో అప్‌లోడ్ చేసిన సమస్యలు, వాటి పరిష్కార స్థితిని తెలుసుకుంటారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన డీజీపీ



డీజీపీగా బాధ్యతలు చేపట్టిన శివధర్‌రెడ్డి మొదటిసారిగా బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనార్‌తో కలిసి వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం హెలీప్యాడ్ నుంచి నగరాన్ని వీక్షించారు. **- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి**

టెక్నాలజీకి అనుగుణంగా పనితనాన్ని మెరుగుపర్చుకోవాలి

- ఐసీసీసీలో సిబ్బంది పనితీరును పరిశీలించిన సీపీ సజ్జనార్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీకి అనుగుణంగా పనితనాన్ని మెరుగుపరుచుకోవాలని, అత్యుత్తమంగా పనిచేస్తున్న సిబ్బందిని గుర్తించి రివార్డులు అందజేస్తామని సీపీ వీసీ సజ్జనార్ అన్నారు. గురువారం ఐసీసీసీలో కమిషనర్ కార్యాలయంలోని వివిధ విభాగాల పనితీరును పరిశీలించారు. టవర్-ఏ లోని అడ్మిన్, అకౌంట్స్, ఐటీ, కంట్రోల్ రూం తదితర విభాగాలకు వెళ్లిన ఆయన.. సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. మెయిన్ పీసీఆర్‌లోని ఇంటిగ్రేటెడ్ పెట్రోలింగ్ మేనేజ్‌మెంట్‌ను పరిశీలించారు. పెట్రోలింగ్ వాహనాల రియల్‌టైమ్ కదలికలను అడిగి తెలుసుకున్నారు. డయల్ 100కు వస్తున్న కాల్స్ స్పందించిన తీరు, రెస్పాన్స్ టైం తదితర వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధత, అంకిత భావం, క్రమశిక్షణతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. అవసరం మేరకే సిబ్బందిని వినియోగించుకోవాలని మినిస్టీరియల్ స్టాఫ్‌ను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్రమాలకు పాల్పడుతున్న ఇంజనీరింగ్ కాలేజీల అటానమస్ హోదా రద్దు చేయండి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అక్రమాలకు పాల్పడుతున్న ఇంజనీరింగ్ కాలేజీల అటానమస్ హోదాను రద్దు చేయాలని జేఎన్‌టీయూ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఘట్‌కేసర్ సమీపంలోని ఒక అటానమస్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ఫైనలియర్ విద్యార్థులకు గ్రేస్ మార్కుల పేరిట డబ్బులు వసూలు చేసినట్లు వచ్చిన ఆరోపణలపై హైపవర్ కమిటీతో విచారణ జరపాలని విద్యార్థి సంఘాల ప్రతినిధులు వర్సిటీ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో జేఎన్టీయూ విద్యార్థి సంఘాల ప్రతినిధులు అంబటి తేజ, జవాజి దిలీప్, భానుప్రకాష్, బోయపల్లి అశోక్, ఎర్రవెల్లి జగన్, తేజావత్ రాహుల్, తిరుపతి తేజ, శ్రావణ్ ఉన్నారు.

అయ్యప్ప మాల ధరించాడని..

- విద్యార్థిని పాఠశాలకు అనుమతించని యాజమాన్యం
- ఏబీవీపీ ప్రతినిధులు, తల్లిదండ్రుల ఆందోళన
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

పేట్‌బషీరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పమాల ధరించాడని పాఠశాల యాజమాన్యం విద్యార్థిని తరగతులకు అనుమతించలేదు. దీంతో ఏబీవీపీ ప్రతినిధులు, విద్యార్థి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. జీడిమెట్ల పైపులైన్ రోడ్‌లోని షేర్‌వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిహాన్ తేజస్ ఆరో తరగతి చదువుతున్నాడు. ఇటీవల అయ్యప్పమాల ధరించాడు. తేజస్ ఈనెల 28న పాఠశాలకు పాఠశాలకు వెళ్లగా యాజమాన్యం అనుమతించకపోవడంతో తిరిగి ఇంటికి వెళ్లిపోయాడు. బుధవారం కూడా ఇలానే జరిగింది. గురువారం తల్లి దండ్రులను తీసుకొని పాఠశాలకు వెళ్లగా అనుమతించలేదు. విషయం తెలుసుకున్న ఏబీవీపీ మేడ్చల్ జిల్లా కన్వీనర్ మృత్యుంజయ, కొంపల్లి నగర కార్యదర్శి పార్థసారథి, కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ నగేష్, విద్యార్థి నాయకులతో పాఠశాల గేటు ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు స్కూల్ ప్రిన్సిపాల్‌తో మాట్లాడడంతో విద్యార్థిని తరగతులకు హాజరయ్యేందుకు అనుమతించారు. ఏబీవీపీ ప్రతినిధులు, విద్యార్థి తల్లిదండ్రులు ఆందోళనను విరమించారు.


ఆందోళన చేస్తున్న ఏబీవీపీ ప్రతినిధులు, విద్యార్థి తల్లిదండ్రులు

విజయేంద్ర సరస్వతి చేతుల మీదుగా పుస్తకావిష్కరణ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ సీపీఆర్వో వనం జ్వాలా నరసింహారావు రాసిన 'డెమోక్రసీ అండ్ గవర్నెన్స్ త్రూ లెన్స్ అండ్ బ్లర్రడ్ గ్లాసెస్' పుస్తకాన్ని కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామి సికింద్రాబాద్ స్కందగిరి సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో గురువారం ఆవిష్కరించారు. పుస్తకం గురించి సంక్షిప్తంగా తెలుసుకున్న స్వామి వనం జ్వాలా ప్రయత్నాన్ని కొనియాడారు. శంకర విజయేంద్ర సరస్వతి స్వామికి వనం జ్వాలా దంపతులు పుస్తక ప్రతిని బహూకరించారు.


'డెమోక్రసీ అండ్ గవర్నెన్స్ త్రూ లెన్స్ అండ్ బ్లర్రడ్ గ్లాసెస్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శంకర విజయేంద్ర సరస్వతి స్వామి



● ఎయిర్‌పోర్టులో హాట్‌ఫైర్ మాక్ డ్రిల్

శంషాబాద్ ఎయిర్‌పోర్టు క్రాష్‌గేట్-2 వద్ద ఏఆర్‌ఎఫ్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం హాట్‌ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించారు. కమాండర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ డ్రిల్‌లో సీఐఎస్ఎఫ్, అపోలో ఏఎంసీ సిబ్బంది పాల్గొన్నారు. **- శంషాబాద్ రూరల్, ఆంధ్రజ్యోతి**

చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ అప్రజాస్వామిక చర్యలు

- ఖైదీల హక్కుల ఉల్లంఘన : ఐపీఎల్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి కేంద్రకారాగారం సూపరింటెండెంట్ శివకుమార్ గౌడ్ ఖైదీల హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీపుల్స్ లాయర్స్(ఐపీఎల్) ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. చర్లపల్లి జైలు మానస, మంజీరా బ్లాకుల్లోని రాజకీయ ఖైదీల పట్ల అధికారులు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. ప్రతి ఖైదీకి ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సంబంధిత బ్లాకు పరిధిలో స్వేచ్ఛగా తిరిగే హక్కు కల్పించాలన్న డిమాండ్‌తో మావోయిస్టు రాజకీయ ఖైదీ సంజయ్ దీపక్‌రావు ఈనెల 28 నుంచి నిరాహారదీక్ష చేస్తున్నా జైలు అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని గురువారం ఒక ప్రకటనలో ఐపీఎల్ ఉపాధ్యక్షుడు ఎం. వెంకన్న పేర్కొన్నారు. దీనిపై రాష్ట్ర మానవహక్కుల కమిషన్(హెచ్చార్సీ) స్పందించాలని డిమాండ్ చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా విచారణ జరిపి చర్లపల్లి జైలు సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు సురేష్, పరిటాల విష్ణువర్ధన్ తదితరులు కోరుతున్నారు. జిల్లా న్యాయసేవల అథారిటీ న్యాయమూర్తులు తరచూ తనిఖీలు నిర్వహించి, ఖైదీల హక్కులను పరిరక్షించాలని విన్నవించారు.

సనత్‌నగర్-మౌలాలి మార్గంలో నిలిచిపోయిన గూడ్స్‌రైలు

- ఎంఎంటీఎస్ రైలుపై ప్రభావం
- రెండు గంటలు ఆలస్యం.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల ఆందోళన

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్-మౌలాలి రైలుమార్గంలో గురువారం ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడడంతో భారీలోడ్‌తో వెళుతున్న గూడ్స్‌రైలు నిలిచిపోయింది. దీంతో ఆ మార్గంలో నడిచే ఎంఎంటీఎస్ (47253) రైలును అధికారులు చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. రైలు రెండుగంటలు ఆలస్యం కావడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. వందల సంఖ్యలో నెటిజన్లు ఆన్‌లైన్ మాధ్యమాల ద్వారా రైల్వే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు పంపారు. ఈ మార్గంలో నడిచే ఒకేఒక్క ఎంఎంటీఎస్ రోజూ అరగంట ఆలస్యంగా గమ్యానికి చేరుకుంటోందని, సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై దక్షిణమధ్యరైల్వే సీపీఆర్ఓ శ్రీధర్‌ను వివరణ కోరగా.. సాంకేతిక కారణాలతో గూడ్స్ రైలు నిలిచిపోవడంతో ఎంఎంటీఎస్ 90 నిమిషాలు ఆలస్యంగా గమ్యానికి చేరుకుందన్నారు.

బీసీ రిజర్వేషన్ల సాధన ఉద్యమానికి యూనివర్సిటీలే కేంద్రాలు

- జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల సాధన ఉద్యమానికి యూనివర్సిటీలే ఉద్యమ కేంద్రాలుగా మారుతున్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ బీసీ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న బీసీల ధర్మ పోరాట దీక్ష వాల్ పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రిజర్వేషన్లు సాధించుకునే వరకూ బీసీ వర్గాలు ఐక్యతతో ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారా బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. ధర్మపోరాట దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఓయూ విద్యార్థి నేతలు మాలిగ లింగస్వామి, నిజ్జ రమేష్ ముదిరాజ్, దేశగోని సాంబశివగౌడ్, మానసపల్లి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


మల్లికార్జున్ (ఫైల్)

పేట్‌బషీరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైసమ్మగూడలో జరిగింది. పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా, దామరచర్ల కృష్ణారావు కాలనీకి చెందిన పూర్ణచందర్‌రావు రెండో కుమారుడు పి. మల్లికార్జున్(19) మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఆర్ఐటీ)లో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతూ మైసమ్మగూడలోని సిరి డీలక్స్ వసతిగృహంలో ఉంటున్నాడు. మల్లికార్జున్ ఈనెల 29వ తేదీ ఉదయం పరీక్ష రాసి వసతిగృహానికి వెళ్లాడు. వసతిగృహంలో ఉంటున్న జయంత్, సురేష్‌తోపాటు పలువురు స్నేహితులతో రాత్రి 10.30 గంటల వరకు మాట్లాడి తన గదికి వెళ్లాడు. అదేరోజు రాత్రి 11.45 గంటలకు స్నేహితులు తలుపు కొట్టగా మల్లికార్జున్ స్పందించలేదు. తలుపులు తీయకపోవడంతో వారు వసతిగృహం యజమానికి సమాచారం ఇచ్చారు. తలుపులు పగులగొట్టి చూడగా మల్లికార్జున్ టవల్‌తో ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ ఉన్నాడు. కిందకు దించి సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రేమ విఫలమై ఆత్మహత్య చేసుకొని ఉంటాడని భావిస్తున్నారు.

విమానాశ్రయంలో ప్రయాణికుడికి అస్వస్థత

శంషాబాద్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విమానాశ్రయంలో ప్రయాణికుడు అస్వస్థతకు గురయ్యాడు. ఆదె రవి అబుదాబికి వెళ్లేందుకు విమానం ఎక్కాడు. టేకాఫ్ తీసుకుంటుండగా బ్రీతింగ్ రావడం లేదని సిబ్బందికి చెప్పడంతో పైలెట్‌కు సమాచారం ఇచ్చి విమానాన్ని 26ఏ గేటు వద్దకు తీసుకెళ్లారు. రవిని ఏఎంసీ సిబ్బంది అపోలో ఆస్పత్రికి తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

ఎయిర్‌పోర్టులో వ్యక్తి అదృశ్యం

- 400 డాలర్లు ఇస్తే విడిచి పెడతామని గుర్తుతెలియని వ్యక్తుల డిమాండ్

శంషాబాద్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): థాయిలాండ్‌కు వెళ్తున్న ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ కనకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లా ఆలంపూర్‌కు చెందిన మధు అనే వ్యక్తిని ఈ నెల 16న ఆయన సోదరుడు అందెల పరశురాముడు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విడిచిపెట్టి వెళ్లాడు. ఈ నెల 22 వరకు ఫోన్ కాల్స్‌లో అందుబాటులో ఉన్న మధు రెండు రోజుల నుంచి అందుబాటులోకి రాలేదు. విదేశాల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి.. మీ సోదరుడు డ్రగ్స్ కేసులో పట్టుబడ్డాడని, 400 డాలర్లు ఇస్తే విడిచిపెడతామని డిమాండ్ చేస్తున్నారని పరశురాముడు తెలిపారు. కుటుంబ సభ్యులు గురువారం ఆర్‌జీఐ ఔట్‌పోస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎవరి ముచ్చట వారిదే..

- జూబ్లీహిల్స్‌లో అంతుచిక్కని ఓటరు నాడి
- ప్రధాన అభ్యర్థులందరికీ జై కొడుతున్న జనం
- అయోమయానికి గురవుతున్న పార్టీ ముఖ్యనేతలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటరు నాడి అంతుచిక్కడం లేదు. నామినేషన్ల పర్వం ముగిసి వారం రోజులు గడిచినా.. ప్రధాన పార్టీల అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నా.. ఓటర్ల మనసులో ఏముందన్న విషయంపై స్పష్టత రాని పరిస్థితి. ప్రచారానికి ఏ పార్టీ అభ్యర్థి వెళ్లినా మా మద్దతు మీకేనంటూ హామీ ఇస్తున్నారు. భరోసా ఇచ్చిన వారు పోలింగ్ రోజున అదే మాటపై ఉంటారో.. మాట తప్పుతారో తెలియక పరేషాన్ అవుతున్నారు. దీంతో నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీలు, గల్లీలు, సామాజిక వర్గాల వారీగా తమకు ఎన్ని ఓట్లు నమ్మకంగా పడుతాయనే అంచనాకు రాలేక అభ్యర్థులు, పార్టీ ముఖ్య నాయకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జూబ్లీహిల్స్ ఎన్నిక ప్రచారం జోరందుకుంది. ప్రధాన పార్టీల నాయకులు తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు క్షేత్రస్థాయిలో ముమ్మరంగా తిరుగుతున్నారు. అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో పాటు ప్రతిపక్షానికి చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులకు డివిజన్లు, కాలనీలు, బస్తీల వారీగా బాధ్యతలు అప్పగించి తిప్పుతున్నారు. 1000-1200 ఓట్లకు ఓ ముఖ్యనాయకుడికి పూర్తి బాధ్యతలు అప్పగించారు. ఆయన కింద దాదాపు 50 మంది పనిచేసే విధంగా ఏర్పాటు చేశారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రచారం నిర్వహిస్తున్నారు.

మాటంటే మాటే!

ఇంటింటి ప్రచారానికి వెళ్తున్న అభ్యర్థులకు ఓటర్లు మా ఓట్లు మీకేనని, చుట్టుపక్కల వారితో మరో 50 ఓట్లు తప్పకుండా వేయిస్తామని చెబుతున్నారు. మనది మాటంటే.. మాటేనని, ఒక్కసారి చెబితే వందసార్లు చెప్పినట్లేనని, ఇందులో ఏ మాత్రం అనుమానం పడొద్దని, మీ గెలుపు పక్కా.. అని భరోసా ఇస్తున్నారు. దీంతో ప్రచారానికి వెళ్లిన నాయకులు తమ పార్టీ విజయం గ్యారంటీ అని నమ్ముతున్న పరిస్థితి నెలకొంటుంది. ఇలా ఏ పార్టీ అభ్యర్థి వెళ్లినా, అభ్యర్థి తరపు నాయకులు ప్రచారం చేసినా.. అదే ముచ్చట చెబుతుండడం ఆసక్తికరంగా మారింది.



ఎవరు గెలిస్తే వారే మావోళ్లు

ప్రచారానికి ఎవరు వెళ్లినా వారికే ప్రజలు మద్దతు తెలుపుతుండడంతో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. మాట ఇచ్చిన వారిలో ఎంతమంది నమ్మకంగా ఓట్లు వేస్తారోననే అభ్యర్థులు, పార్టీ ముఖ్యనాయకులు, వారి అనుచరులు సందిగ్ధంలో పడుతున్నారు. ఇదిలా ఉండగా, అందరికీ మద్దతు ఇస్తూ మా ఓట్లన్నీ తప్పకుండా మీకే వేస్తామని మాట ఇస్తున్న వారిలో కొంతమంది పక్కా ప్రణాళికతో ఉన్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాము ఓటు ఎవరికి వేశామో ఎవరికీ తెలియదని.. ఎవరు గెలిస్తే వారికే మా ఓట్లు వేశామని చెబితే సరిపోతుందనే భావనతో ఉన్నారు.

విశేషం

కృతజ్ఞతా దీపం

తెలుగు మాసాలలో ఎంతో పవిత్రమైన కార్తికం... ఆకాశదీపంతో ప్రారంభమవుతుంది. వాస్తవానికి ఆకాశదీపాలు అంటే... సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు. వాటిని వెలిగించినది పరమేశ్వరుడు. లోకాన్ని వెలుగులతో నింపుతున్న ఆ దైవానికి కృతజ్ఞతగా... భక్తులు ఆకాశదీపాలు వెలిగిస్తారు. గాలికి ఆరిపోకుండా చుట్టూ మూసి ఉండే, చిన్న రంధ్రాలు కలిగిన పాత్రలో దీపం వెలిగించి, దానికి తాడు కట్టి, ధ్వజస్తంభానికి వేలాడదీసిన తాడుతో జాగ్రత్తగా పైకి లాగుతారు. ఆ దీపం పితృదేవతలకు దారి చూపిస్తుందనే నమ్మకం ఉంది. ఆకాశదీపాన్ని వెలిగించినా, చూసినా, తలచుకున్నా ఎంతో మంచిదని, ఆ దీపకాంతి ప్రసరించే ప్రదేశాన్ని పరమేశ్వరుడు కాపాడుతాడని పెద్దలు చెబుతారు. దీనివల్ల ప్రతికూల శక్తులు నశిస్తాయి. ఈ దీపం కోసం భక్తులు చమురు, పత్తితో తయారు చేసిన వత్తులు తమ శక్తి కొద్దీ ఇస్తూ ఉంటారు.



ప్రదోషకాలంలో...

ధ్వజస్తంభం మీద ప్రకాశించే ఆకాశదీపం ఆ చుట్టుపక్కల ప్రాంతమంతా వెలుతురు విరజిమ్ముతుంది. ధ్వజస్తంభం పైకి ఆకాశదీపాన్ని ఆరోహణ చేస్తే... ఈశ్వరుడి ఉత్సవం నిర్వహిస్తున్నట్టు లెక్క. పూర్వకాలంలో, రవాణా వ్యవస్థ అంతగా అభివృద్ధి చెందని రోజుల్లో... బాటసారుల కోసం ఆకాశదీపాన్ని పెట్టేవారు. కాలినడకన వచ్చే బాటసారులు ఆకాశదీపాన్ని చూసి, ఆ సమీపంలో దేవాలయం, ఒక గ్రామం ఉన్నాయని తెలుసుకొనేవారు. రాత్రి ఆ గ్రామంలో విశ్రమించి, మరునాడు ప్రయాణాన్ని కొనసాగించేవారు. ప్రదోష వేళల్లో వెలిగించిన ఆకాశదీపాలను దర్శిస్తే... సకల దోషాలు, పాపాలు దూరమవుతాయంటారు.

ఉసిరి దీపాలు...

కార్తిక మాసంలో దీపాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. పత్తితో చేసిన వత్తులను ఆవునెయ్యిలో నానబెట్టి, వాటిని అరటి దొప్పల్లో పెట్టి వెలిగిస్తారు. అలాగే ఈ మాసంలో ఉసిరి దీపాలు కూడా వెలిగిస్తారు. ఉసిరి కాయల పైభాగాన్ని గుండ్రంగా కోసి, మధ్యలో తొలిచి, దానిలో ఆవునేతిలో నానబెట్టిన వత్తి వేసి దీపం వెలిగించడం ఎంతో పుణ్యంగా భక్తులు భావిస్తారు. దీనివల్ల శుభాలు కలుగుతాయని, నవగ్రహ దోషాల పరిహారం జరుగుతుందని, ఇంటికి నరదృష్టి తొలగిపోతుందని నమ్ముతారు. త్రిమూర్తులు, సకల దేవతలు ఉసిరి చెట్టులో కొలువై ఉంటారని విశ్వసిస్తారు. ప్రధానంగా దశమి, ఏకాదశి, పౌర్ణమి తిథుల్లో, సోమవారం నాడు ఉసిరి చెట్టు కింద దీపాలు వెలిగించడం ఆనవాయితీ. ఇది శ్రీమహావిష్ణువుకు, లక్ష్మీదేవికి ప్రీతికరమని పురాణాలు చెబుతున్నాయి. ఉసిరికి హిందూ ధర్మంలో ప్రత్యేక స్థానం ఉంది. కార్తిక మాసంలో దీని స్థానం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. స్నానం, దానం, దీపం, భోజనం... ఇలా అన్నిటిలోనూ ఉసిరిని మన పూర్వులు చేర్చారు. ముఖ్యంగా కార్తిక పౌర్ణమినాడు ఉసిరి చెట్టు దగ్గర దీపం పెట్టి, ఉసిరికి సంబంధించిన ఇరవై ఒక్క నామాలను చదువుతారు. దీపావళి తరువాత ఎనిమిది రోజుల పాటు 'ఉసిరి నవమి' వ్రతాన్ని పాటిస్తారు. తొమ్మిదో రోజును 'అక్షయ నవమి' అంటారు. ఆ రోజు ఉపవాసం ఉంటారు. ఉసిరి చెట్టును విష్ణు స్వరూపంగా పూజిస్తారు. అనంతరం ఆ చెట్టు కింద కూర్చొని భోజనం చేస్తారు. ఇలా చేయడం వల్ల అన్ని రకాల పాపాలు, వ్యాధులు పోతాయనేది విశ్వాసం.

• సి.ఎన్.మూర్తి, 8328143489

ఎప్పటినుంచో ఒక మాట ప్రసిద్ధిలోకి వచ్చింది... శివుడికి ఇష్టమైన మాసం కార్తికం, విష్ణువుకు ప్రీతికరమైనది మార్గశిరం అని. పైపై దృష్టితో చూసేవాళ్ళు అన్న మాటలు ఇవి. వాస్తవానికి ఇది శివకేశవులు ఇద్దరికీ సంబంధించిన మాసం. ఎందుకంటే వారిద్దరికీ ఎలాంటి భేదం లేదు, ఉండదు.

కార్తిక మాసం



కార్తికం... ఇద్దరికీ ఇష్టమే!

కార్తిక మాసంలో మొట్టమొదటి రోజున 'గోక్రీడనం' అనే ఉత్సవం జరుగుతుంది. ఆ రోజున యజమానులు తమ ఆవులను ఏ చెరువు దగ్గరకో తీసుకువెళ్తారు. ఎండుగడ్డితో వాటిని చక్కగా తోమి, స్నానాలు చేయిస్తారు. పసుపు కుంకుమలతో అలంకరించి, మెడలో పూలమాలలు వేసి, పృష్ఠభాగం మీద కూడా పసుపు కుంకుమలను అద్దుతారు. వాటికి ప్రదక్షిణలు చేస్తారు. శ్రీమహావిష్ణువు కూడా కృష్ణావతారంలో గోపాలకునిగా ఉంటూ... గోవులకు ఎనలేని సేవ చేశాడు. ఒక మడుగును ఆక్రమించుకున్న కాళీయుడు అనే పెను సర్పాన్ని పారద్రోలాడు. ఆ మడుగును గోవుల స్నానపానాదులకు వీలుగా మార్చాడు. అందుకే కార్తిక మాసంలోని ఎనిమిదో రోజున 'గోష్ఠాష్టమి' లేదా 'గోపాష్టమి' అనే పేరుతో ఉత్సవం నిర్వహిస్తారు. శివునికి ప్రీతిపాత్రమని అనుకొనే ఈ మాసంలో... ఏకాదశి తిథినాడు యోగ నిద్ర నుంచి శ్రీహరి మేలుకుంటాడు. 'ఉత్థాన ఏకాదశి' ఉత్సవాన్ని చేయించుకుంటాడు. ఆ మరునాడు... 'క్షీరాబ్ధి ద్వాదశి' పేరిట తన మామగారి ఇల్లు అయిన పాల సముద్రంలో, శేషునిపై పరుండి... తనవారందరికీ దర్శనం ఇస్తున్నాడు. మరో రెండు రోజుల తరువాత... 'వైకుంఠ చతుర్దశి' రోజున... మొత్తం దేవలోకంలోని వారందరికీ తన దర్శనాన్ని అనుగ్రహిస్తున్నాడు.

ఇల్లరికపు అల్లుళ్ళు

శివకేశవులు ఇద్దరూ శంఖాలను ధరిస్తారు (వనమాలీ గదీ శార్ఙ్గీ శంఖీ...), ఒకరు నిరంతరం శరీరం నిండా పాముల్ని ధరించి కనిపిస్తూ ఉంటే, మరొకరు ఆదిశేషుడు అనే పెద్ద సర్పాన్ని శయ్యగా చేసుకొని పవళిస్తూ... అక్కడి నుంచే దర్శనం ఇస్తూ ఉంటాడు. శివుడు తన మామగారి ఇల్లయిన హిమాలయంపై తన నివాసాన్ని ఏర్పాటు చేసుకుంటే, శ్రీమహాలక్ష్మి పుట్టినిల్లయిన పాలసముద్రాన్ని తన నివాసంగా శ్రీహరి మార్చుకున్నాడు. ఇద్దరూ ఉండేది మామగార్ల ఇళ్ళలోనే... అంటే ఇల్లరికమే! శివుడు 'పినాకం' అనే వింటిని ధరిస్తే (పినాకపాణి), శ్రీహరి 'శార్ఙ్గ'మనే వింటిని (శార్ఙ్గధన్వా) ధరించి ఉంటాడు. శివుడు తన జటాజూటాన్ని పాదాలవరకూ ధరించి ఉంటే... రామావతారంలో శ్రీహరి దండకారణ్యానికి వెళ్ళే సందర్భంలో జటలను పెంచి, చివరి వరకూ అలాగే ఉన్నాడు (చీర అజిన జటాధారీ). శివుడు ఏనుగు చర్మాన్ని రాత్రివేళ, పులి చర్మాన్ని పగటిపూటా ధరిస్తాడు. శ్రీహరి రామావతారంలో పూర్తిగా ముతక నార వస్త్రాలను (వసనం చర్మ చ) ధరించాడు. శివుడు తన అర్ధ భాగాన్ని భార్యకు ఇచ్చి 'అర్ధనారీశ్వరుడు' అని అనిపించుకంటే, శ్రీహరి తన వక్షస్థలాన్ని లక్ష్మీ దేవికి స్థానంగా ఇచ్చాడు. ఆమె నిరంతరం అక్కడ కూర్చోగా, కూర్చోగా ఆ ప్రదేశంలో ఒక ఆనవాలు ఏర్పడింది అదే 'శ్రీ-వత్స-అంకం'. అందుకే ఆయనను 'శ్రీవత్సాంకుడు' అని కీర్తిస్తారు.

ఒకటే పేరు...

వారు వేరువేరుగా రాక్షసులను వధించారు. ఇద్దరూ కలిసి త్రిపురుడనే రాక్షసుణ్ణి చంపడం కోసం... ఒకరు (శివుడు) ధనువు కాగా, మరొకరు (శ్రీహరి) దానిలో తొడిగే బాణం అయ్యారు. ఆ ఇరువురికీ తోడుగా అగ్నిదేవుడు ఆ బాణం చివర ఉండే ములికిగా మారాడు. అగ్నిదేవుడు వారిద్దరికీ కుడికన్నే కదా! శివకేశవులకు భేదమే ఉన్నట్టయితే... వారిద్దరికీ కలిపి ఒకే పేరు ఉండడం కుదురుతుందా? హరికీ, హరుడికీ కలిపి ఉన్న పేరు 'వృషాకపి' (హర విష్ణూ వృషాకపీ). సరే... వారిద్దరూ అన్యోన్యంగా కనిపించవచ్చేమో కానీ... విభేదాలే ఉంటే వారి భార్యలు కలిసిమెలసి ఉండడం సాధ్యమేనా? కాదు కదా! ఆ ఇద్దరికీ (లక్ష్మీ పార్వతులకు) కలిపి 'వృషకపాయి' అనే పేరు ఉంది. ఇలా ఇద్దరి మధ్యా ఎన్నో కనిపిస్తాయి. ఇక శివకేశవ భేదం ఎక్కడుంది?

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు 9866700425

సకల ఆత్మల పండుగ

దైవమార్గం



క్రైస్తవులలోని క్యాథలిక్‌లు ప్రతి సంవత్సరం నవంబరు రెండో తేదీని 'సకల ఆత్మల పండుగ'గా పాటిస్తారు. తమ కుటుంబాలలో మరణించిన వ్యక్తుల ఆత్మ శాంతి కోసం ఆ రోజు పూజలు చేయిస్తారు. తమ ఆత్మీయుల సమాధుల దగ్గరకు వెళ్ళి, వాళ్ళకు దైవానుగ్రహం లభించాలని, మోక్షాన్ని పొందాలని కోరుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు జరిపిస్తారు. ఈ రోజును 'సమాధుల పండుగ' అని కూడా అంటారు. మృత్యువు, నిత్య జీవం తదితర అంశాలపై ఉపన్యాసాలు ఉంటాయి.

చినిగి పోయిన వస్త్రాల మాదిరిగా ఆత్మను ధరించిన ఈ శరీరాలు కూడా భ్రష్టమైపోతాయనీ, పచ్చని చెట్ల నుంచి ఆకులు రాలినట్టు జీవులకు అంతిమంగా మరణం తప్పదనీ పవిత్ర గ్రంథమైన బైబిల్ (సీరా- 14:17) బోధిస్తోంది. "నా జీవనమార్గం అంతా నల్లటి మేఘాలతో ఆవరించి ఉంది. మరణ చిహ్నమైన శూన్యాన్ని అయిపోయాను. మృత్యు సంకేతంగా అదృశ్యం అయిపోయాను" అంటాడు తోబి అనే భక్తుడు.

పాపం వల్ల వచ్చే చీకటి నాకు వద్దని సొలోమాన్ రాజు చెప్పాడు. అందుకే... మనిషి తన జీవిత కాలంలో మనిషిగా బతకాలి. దేవుడు చెప్పినవాటిని తుచా తప్పకుండా ఆచరించాలి. ముఖ్యంగా తన తోటి మనుషులను ఎటువంటి అరమరికలు లేకుండా ప్రేమించాలి. అటువంటి పనుల ద్వారా ఇక్కడ, పరలోకంలో శాశ్వతమైన స్థానాన్ని సంపాదించుకోవాలి.

పాపభూయిష్ఠమైన జీవితం మరణానికి కారణమని, మరణ సూచనలు పాప భీతి వల్ల మనకు ముందే తెలుస్తాయనీ బైబిలు చెబుతోంది. "దురాశ గర్భాన్ని ధరించి పాపాన్ని కంటుంది, పాపం పరిపక్వమై మరణాన్ని కంటుంది" అంటాడు యాకోబు. ప్రేమమయుడైన దేవుడు అంతిమంగా తన బిడ్డలను తన చెంతకు పిలుచుకుంటాడు. దానికోసం మానవులు చేయవలసిన మంచి పనులు ఉన్నాయి. మనిషి శరీరం దాని మూల రూపమైన మట్టిలో కలిసిపోయినా... అందులోని ఆత్మ దైవాన్ని చేరుకుంటుందని (ప్రసంగి/ ఉపదేశి) బైబిల్ స్పష్టం చేస్తోంది. మళ్ళీ మళ్ళీ తప్పులు చేయకూడదని హెచ్చరిస్తూ... మానవాళిని మేలుకొలుపుతోంది. తెలిసో, తెలియకో తమ ఆత్మీయులు తప్పులు చేసినట్టయితే... ఆత్మల పండుగ రోజున తాము చేసే ప్రార్థనలు వారిని దైవ సన్నిధికి చేరుస్తాయనే విశ్వాసం ఉంది.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్, 9866755024

అష్టభుజాలతో ఆదిదేవుడు

'నిరాకారో మహేశ్వరః' అంటారు. ఈశ్వరుడికి ఆకారం లేదని చెబుతారు. కేదారేశ్వరుడి నుంచి రామేశ్వరుడి వరకు ఏ జ్యోతిర్లింగాన్ని దర్శించినా, కాళహస్తీశ్వరుడి నుంచి జంబుకేశ్వరుడి వరకు ఏ పంచభూతేశ్వరుడిని చూసినా, అమరేశ్వరుడి నుంచి భీమేశ్వరుడి వరకు ఏ పంచారామ క్షేత్రానికి వెళ్లినా కనిపించేది ఆ మహాదేవుడి లింగ రూపమే. కానీ, ఆదిదేవుడు సాకార రూపంలో కొలువైన ప్రదేశం... నెల్లూరులోని మహామృత్యుంజయ క్షేత్రం. ఇక్కడ ఆ సర్వేశ్వరుడు సాకార, నిరాకార రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు.



చిన్న ఆలయంగా మొదలై...

ఆమంచర్ల శివశంకర శర్మ (శంకరయ్య స్వామి) పరమ శివ భక్తుడు. అనారోగ్యం, అర్థాయుష్షు, అకాల మరణం లాంటి వాటితో బాధపడుతున్న వారికి ఆది వైద్యుడైన ఆ ముక్కంటి అనుగ్రహం ఉండాలని ఆశించారు. మహా మృత్యుంజయేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలని సంకల్పించారు. 2007లో తాత్కాలికమైన చిన్న ఆలయం ఏర్పాటు చేసి... నిత్యం రుద్రాభిషేకము, పూజలు జరిపేవారు. ఏటా ఉత్సవాలు నిర్వహించేవారు. తదనంతరం అప్పటి కంచి పీఠాధిపతి శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి, కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతి స్వామి ఆశీస్సులతో ప్రధాన ఆలయ నిర్మాణానికి 2008లో పునాది వేశారు. ఎందరో దాతలు, భక్తుల సహకారంతో 2020 నాటికి ఆలయ నిర్మాణం పూర్తయింది అదే ఏడాది నవంబర్‌లో ప్రతిష్ఠ జరుపుకొంది.

ఆలయ దర్శనం

స్వహస్తాలతో అభిషేకం

మహా మృత్యుంజయేశ్వర స్వామి వారికి నిత్యం రుద్రాభిషేకం, ప్రతి నెలా శుక్ల, కృష్ణ పక్షాలలో త్రయోదశి నాడు ప్రదోష కాల అభిషేకాలు జరుగుతాయి. ప్రతి మాస శివరాత్రి రోజున రుద్ర, మృత్యుంజయ హోమాలు నిర్వహిస్తారు. అమ్మవార్లు ఇద్దరికీ ప్రతి రోజూ శ్రీచక్ర కుంకుమార్చన, ప్రతి శుక్రవారం విశేష అభిషేకాలు జరుగుతాయి. ప్రతి శుక్ల పక్ష చతుర్దశి రోజున రుద్ర సహిత చండీ హోమం జరుపుతారు. ఏటా మాఘ మాసంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు, ఆశ్వయుజ మాసంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు, కార్తిక మాసోత్సవాలు నిర్వహిస్తారు. ఆ ఆలయంలో భక్తులు స్వహస్తాలతో స్వామి వారిని అభిషేకించే అవకాశం ఉంది.

ఎలా చేరుకోవాలి?: నెల్లూరు నగరంలోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీ ప్రారంభంలో ఈ ఆలయం ఉంది. అది జాతీయ రహదారి నుంచి కనుపర్తిపాడు మీదుగా రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఆలయం వరకు ఆటో, బస్సు సౌకర్యాలు ఉన్నాయి.

మహా మృత్యుంజయేశ్వర స్వామి, ఆదిపరాశక్తి, మహాకాళి అమ్మవార్లను నూతన ఆలయంలో ప్రతిష్ఠించారు. లక్ష్మీ గణపతి, బాలసుబ్రహ్మణ్యేశ్వరుడు, మేధా దక్షిణామూర్తి స్వామి సన్నిధులు, నాగదేవత సహిత నాగేశ్వర స్వామి మందిరం కూడా ఉన్నాయి.

ఆరోగ్య, ఆయుఃప్రదాత

ఈ క్షేత్రంలో మహా మృత్యుంజయేశ్వర స్వామి అష్టభుజాలతో, వ్యాఘ్ర చర్మంపై యోగ ముద్రలో ఆసీనుడై, నాలుగు చేతులతో అమృత కలశాలను ధరించి, తనను తానే అభిషేకించుకుంటూ దర్శనమిస్తారు. మరో రెండు హస్తాలతో జపమాలను, శంఖాన్ని ధరించి ఉంటారు. అలాగే ఆదిపరాశక్తి, కాళికాదేవి కూడా ఎనిమిది చేతులతో పూజలు అందుకుంటున్నారు. ఇక్కడ కాళీదేవి ప్రసన్న వదనంతో, చిరు మందహాసంతో కనిపిస్తుంది. ముఖ్యంగా ఆరోగ్యాన్ని, ఆయుష్షును ప్రసాదించే క్షేత్రంగా పేరు పొందిన ఈ మహా మృత్యుంజయేశ్వర స్వామి ఆలయాన్ని శీఘ్ర వివాహం, సంతాన ప్రాప్తి, మృత్యుగండ దోష పరిహారం నిమిత్తం ఎక్కువ మంది భక్తులు దర్శిస్తారు.

• శ్రీకంఠం రమణయ్య

సహజయోగ

వన సమారాధన... ప్రకృతి ఆరాధన

సహజమైన సంపదకు అసలైన అర్థం ఏమిటో తెలుసుకోవడంతో పాటు ఆ సంపదను మనం పూర్తిగా అనుభవించడం కోసం పూర్వీకులు అనేక ఆచారాలను, సంప్రదాయాలను ఏర్పరిచారు. అవి మనకు దైనందిన జీవితంలో అలవడేలా చూశారు. ఆ విధంగా ఏర్పాటుచేసినవే కార్తిక మాసంలోని వనభోజనాలు. అనుకూలమైన వనంలో బంధుమిత్రుల కలయిక, అక్కడే వంటలు, ఆటపాటలు, భోజనాలు. ఒకవైపు ఆధ్యాత్మిక వాతావరణం, మరోవైపు ఆహ్లాదకరమైన సామూహిక ఆనందం. కార్తిక మాసంలో వన సమారాధనలు అంటే మనకు గుర్తొచ్చేవి ఇవే. దీనిలో ఇమిడి ఉన్న ఆధ్యాత్మిక ప్రయోజనాల గురించి శ్రీమాతాజీ నిర్మలాదేవి వివిధ సందర్భాల్లో వివరించారు.



మన ఋషులు, మునులు ఏర్పాటు చేసిన సంప్రదాయాలన్నీ మన సూక్ష్మ శరీరంలోని కుండలినీ జాగృతి కోసం చక్రనాడుల శుద్ధి కోసం ఉద్దేశించినవే. ఎందరో మహనీయులు జన్మించి, తమ పాదస్పర్శతో చైతన్యపరచిన, పునీతం చేసిన భూమి మనది. అలాంటి భూమిని మనం తగిన విధంగా గౌరవిస్తున్నామా? భూమాతతో అనుసంధానమై ఉంటున్నామా? అనేది ఆత్మపరిశీలన చేసుకోవాలి. దీనికి వనభోజనాలు చక్కటి సమాధానం అందిస్తాయి. ప్రకృతితో మమేకం కావడంతో పాటు... సామూహికంగా అందరూ కలిసి ఆనందించడానికి దోహదం చేస్తాయి. ఈ మాసంలో ఉసిరి చెట్టు కింద వనభోజనాలు చేస్తారు. ఇలా ఉసిరికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం వెనుక ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. ఈ నెల నుంచి శీతాకాలం మొదలవుతుంది. సీజనల్ వ్యాధులతో పాటు దగ్గు, జలుబు లాంటివి వచ్చే ప్రమాదం ఉంది. ఈ నెలలో ఉసిరి తినడం ద్వారా, లేక ఉసిరి చెట్టు నీడన గడపడం వల్ల ఆ దోషాలను నివారించుకోవచ్చు. "సకల మానవాళిని రక్షించే, వృద్ధాప్యాన్ని దరిచేరనివ్వని ఔషధ మొక్కలలో ఉసిరికి ఉసిరే సాటి" అని చరక సంహిత పేర్కొంది.

సామూహిక జీవనం కోసం...

మానవ శరీరం పంచభూతాలైన భూమి, ఆకాశం, వాయువు, జలం, అగ్ని అనే అయిదు మూలకాలతో తయారవుతుంది. ఈ పంచభూతాల తత్త్వాలతోనే మన సూక్ష్మ శరీరంలోని ఆరు చక్రాలు రూపొందాయి. ఉదాహరణకు మన సూక్ష్మ శరీరంలోని మొదటి శక్తి కేంద్రం అయిన మూలాధార చక్రం భూతత్త్వంతో ఏర్పడుతుంది. ఆ శక్తి కేంద్రంలో ఏదైనా సమస్య వచ్చినప్పుడు... మనం భూమి మీద కూర్చొని, రెండు చేతులు భూమి మీద పెట్టి, సహజయోగ పద్ధతిలో ధ్యానం చేస్తే... ఆ సమస్య నుంచి విముక్తి పొందవచ్చు. ఈ విధంగా పంచభూతాత్మకమైన ప్రకృతి... మానవుల సూక్ష్మ శరీరంలోని శక్తికేంద్రాలను చైతన్యపరచి, ఆరోగ్యాన్ని, ఆనందాన్ని ప్రసాదిస్తుంది. వనభోజనాల ద్వారా సమకూరే మరో ప్రయోజనం... మనలో సామూహిక జీవనం మరింత బలపడం. పరస్పరం కలిసి పనిచేయడం వల్ల ప్రేమపూరితమైన వాతావరణం ఏర్పడుతుంది. అక్కడ ఉన్న మొక్కలు, చెట్లు, పువ్వుల పేర్లను పిల్లలకు పరిచయం చేయడం వల్ల... ప్రకృతి మనకు అందిస్తున్న అపారమైన సంపద ఏమిటో వారు గ్రహిస్తారు.

అందరితో సత్సంబంధాలు

మన విశుద్ధ చక్రం ఆకాశతత్త్వాన్ని కలిగి ఉంటుంది. వన భోజనాల లాంటి సామూహిక కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు... ఆ చక్రం వృద్ధి చెంది, చక్కటి సంభాషణా చాతుర్యం అలవడుతుంది. అందరితో సత్సంబంధాలు పెంచుకోగలుగుతాం. మనలోపల ఉన్న ఆరు చక్రాలూ సహజమైన ప్రకృతిలో ఉన్న పంచభూత తత్త్వాల ద్వారా చాలా వేగంగా స్పందిస్తాయి. కాబట్టి ఏడాదికి ఒకసారైనా కార్తిక మాసంలో వన భోజనాల ద్వారానైనా ప్రకృతితో మమేకమై, ధ్యానంతో, భజనలతో, ఆటపాటలతో గడిపితే... మన సామాజిక జీవితం మరింత బలోపేతం అవుతుంది.



డాక్టర్ పి. రాకేష్,
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

తెలుసుకుందాం



నిరాకారుడి సాకార రూపం

నిర్గుణుడైన భగవంతుడి సాకార దర్శనాన్ని అందించేవి విగ్రహాలు. విగ్రహం అనే పదానికి ... 'వి' అంటే 'విశేషం', 'గ్రహం' అంటే 'చోటు'... అంటే "భగవంతుడు విశేషంగా ఉండే చోటు" అనే అర్థం ఉంది. దాని ద్వారా భగవంతుణ్ణి రూపగుణాతిశయాలు ఉన్న సగుణ స్వరూపుడిగా మనసులో ఉంచుకొని ధ్యానించడం సులభం అవుతుంది. సాధారణ ప్రజలు భగవంతుణ్ణి విగ్రహ రూపంలోనే దర్శించుకుంటారు. దీనికి పెద్దగా వేదాంతం, తత్త్వం, జ్ఞానం లాంటివి ఏవీ అవసరం లేదు. కేవలం భక్తి భావం ఉంటే చాలు.


అయిదు రూపాలు...

దేవుని ప్రతిరూపమైన విగ్రహ రూపాల్లో... మనకు కనిపించేవి అయిదు రకాలుగా ఉన్నాయి. అవి: స్వయంభూ, దైవిక, ఆర్ష, మానుష, అసుర. తనకుతానుగా వెలసిన విగ్రహాన్ని 'స్వయంభూ' అంటారు. బ్రహ్మ, ఇంద్రుడు, శ్రీరాముడు, ఇతర దేవతలు పూజించిన మూర్తిని 'దైవికం' అంటారు. మహర్షులు పూజించిన విగ్రహాలు 'ఆర్షములు'గా ప్రసిద్ధి పొందాయి. మానవులు ప్రతిష్ఠించినవాటిని 'మానుషాలు' అనీ, పురాణాల ప్రకారం అసురులు ప్రతిష్ఠించినవాటిని 'అసురమూర్తులు' అనీ పిలుస్తారు.



విగ్రహ భేదాలు...: విగ్రహాలను వాటి భంగిమ, ముఖ భావం, లక్షణాలను బట్టి నాలుగు రకాలుగా విభజించారు. అవి: సౌమ్య విగ్రహాలు, భోగ విగ్రహాలు, యోగ విగ్రహాలు, ఉగ్ర విగ్రహాలు.

సౌమ్య విగ్రహాలు: రాజరాజేశ్వరి, లక్ష్మి, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, అన్నపూర్ణ తదితర అభయ రూపులైన దేవతల విగ్రహాల ముఖంలో శాంత భావం ఉంటుంది. వాటిని 'సౌమ్య విగ్రహాలు' అంటారు. ఈ దేవతలను గ్రామం, నగరం తదితర చోట్ల ఎక్కడైనా ప్రతిష్ఠించి, పూజించుకోవచ్చు.



భోగ విగ్రహాలు: కూర్చొని ఉన్న, నిలబడి ఉన్న, దేవేరులతో కూడి ఉన్న దైవాల విగ్రహాలు. ఉదాహరణకు లక్ష్మీ నారాయణులు, ఉమామహేశ్వర స్వామి, సీతారాములు, రాధాకృష్ణులు తదితరుల విగ్రహాలు. సౌమ్య, భోగ మూర్తుల విగ్రహాలను జనావాసాలకు దగ్గరగా నిర్మించిన దేవాలయాలలో ప్రతిష్ఠించవచ్చు.



యోగ విగ్రహాలు: తపస్సు చేస్తున్న భంగిమలో ఉన్న విగ్రహాలు. ఉదాహరణకు యోగ నరసింహ స్వామి, యోగ దక్షిణామూర్తి, అయ్యప్పస్వామి తదితర దైవాల యోగ మూర్తులను అరణ్యాలలో, కొండలపైన, గుహలలో ప్రతిష్ఠించడం కనిపిస్తుంది. తపస్సు చేసుకోవడానికి అనువైనవిగా భావించే ప్రదేశాలలోనే ఈ యోగ విగ్రహాలను, ఆలయాలను నిర్మిస్తూ ఉంటారు.



ఉగ్ర విగ్రహాలు: రౌద్రభావం కలిగిన ముఖంతో, ఉగ్ర భంగిమలో ఉన్న విగ్రహాలు. ఉదాహరణకు ఉగ్ర నరసింహస్వామి, వీరభద్రస్వామి, భైరవమూర్తి, కాళికాదేవి, భైరవి, దుర్గ, చాముండేశ్వరి లాంటి దైవాలు. సౌమ్య దేవతల ప్రతిష్ఠకు ఉత్తరాయణం, ఉగ్ర దేవతల ప్రతిష్ఠకు దక్షిణాయనం మంచివని ఆగమాలు చెప్పాయి.

• దగ్గుపాటి నాగవరప్రసాద్, స్థపతి, 9440525788

రొమ్ము క్యాన్సర్ రాజధానిగా హైదరాబాద్!

సగటున దేశంలోనే అత్యధిక కేసులు ఇక్కడే

- జాతీయ సగటు లక్షకు 26.6 కేసులు.. హైదరాబాద్ సగటు 54 కేసులు
- తర్వాతి స్థానాల్లో చెన్నై, బెంగళూరు, ముంబై, ఢిల్లీ, పుణె
- ఆలస్య వివాహాలు, ఆలస్య ప్రసవాలు, పిల్లలకు ఎక్కువకాలం పాలు
- ఇవ్వకపోవడం, అధిక బరువు, వాయు కాలుష్యం.. ప్రధాన కారణాలు
- స్టార్ ఆస్పత్రి మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సాయినాథ్ వెల్లడి



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు అరుదుగా కనిపించే రొమ్ము క్యాన్సర్ కేసుల సంఖ్య ఇటీవలికాలంలో పెరుగుతోంది. మరీ ముఖ్యంగా.. ఈ విషయంలో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉండడం ఆందోళన కలిగిస్తోందని స్టార్ ఆస్పత్రి మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సాయినాథ్ వివరించారు. దేశంలో రొమ్ము క్యాన్సర్‌పై జరిగిన పలు అధ్యయనాలు, మెడికల్ జర్నల్స్‌లో ప్రచురితమైన అధ్యయన నివేదికలను పరిశీలించి ఆయన పలు కీలక అంశాలను, గణాంకాలను వెల్లడించారు. అమెరికాలో గడిచిన రెండు దశాబ్దాలుగా రొమ్ము క్యాన్సర్ కేసుల రేటు స్థిరంగా ఉండగా.. భారత్‌లో 21 శాతం మేర పెరిగినట్టు ఆయన తెలిపారు. విదేశాల్లో 90 శాతం కేసుల్లో ఈ సమస్యను మొదటి దశలోనే గుర్తిస్తుండగా.. మన దగ్గర చాలా మంది 3, 4 దశల్లో ఉన్నప్పుడు ఆస్పత్రికి వస్తున్నారని.. అప్పటికే పరిస్థితి చేయి దాటిపోతోందని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. విదేశాల్లో స్ర్కీనింగ్ (పరీక్షలు) విస్తృతంగా జరుగుతున్నాయని, మన దగ్గర చాలా తక్కువగా జరగడమే ఈ ఆలస్యానికి కారణమని పేర్కొన్నారు. ఆయన తెలిపిన మరికొన్ని ముఖ్యాంశాలు..

- దేశంలో రొమ్ము క్యాన్సర్ కేసులు 2000 సంవత్సరంలో ప్రతి లక్ష మందికిగాను సగటున 22 నమోదు కాగా.. 2022 నాటికి ఆ సగటు 26.6 కేసులకు చేరింది. అమెరికాలో ఈ సగటు 130 నుంచి 135 దాకా ఉంది. కానీ, రెండు దశాబ్దాలుగా అక్కడ స్థిరంగానే ఉంది. పెరగలేదు.
- హైదరాబాద్‌లో ఈ సగటు 54. అంటే ప్రతి లక్ష మందికిగాను 54 కేసులు. జాతీయ సగటుతో పోలిస్తే ఇది దాదాపుగా రెట్టింపు. మన భాగ్యనగరం తర్వాతి స్థానాల్లో వరుసగా చెన్నై (45.4), బెంగళూరు (46.7), ముంబై (34.4), ఢిల్లీ (38.6), పుణె (30) ఉన్నాయి.
- 2022లో భారతదేశంలో 1,92,020 రొమ్ము క్యాన్సర్ కేసులు.. 98,337 మరణాలు నమోదయ్యాయి. ఇది దేశంలో మహిళలకు వచ్చే క్యాన్సర్లలో 26.6 శాతం వాటాతో మొదటి స్థానంలో ఉంది.
- హైదరాబాద్‌లో రొమ్ముక్యాన్సర్ కేసుల సంఖ్య ప్రపంచంలోని పలు ప్రధాన నగరాలతో సమానంగా ఉంటోంది. ఆయా నగరాల్లో క్యాన్సర్ స్ర్కీనింగ్ విస్తృతంగా జరుగుతుండగా.. ఇక్కడ చాలా తక్కువగా జరుగుతోంది. దీనివల్ల ఎక్కువ మంది మహిళల్లో ఈ సమస్య ఆలస్యంగా బయటపడుతోంది.

ఇవీ కారణాలు..

ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం, ఆలస్యంగా పిల్లలను కనడం.. ఇటీవలికాలంలో పెరిగింది. శాస్త్రీయ ఆధారాలను బట్టి.. త్వరగా పిల్లలను కనే మహిళలతో పోలిస్తే, 30 ఏళ్ల తర్వాత బిడ్డలకు జన్మనిచ్చే మహిళలకు రొమ్ము క్యాన్సర్ ముప్పు ఎక్కువ. 30 ఏళ్ల తర్వాత ప్రతి అదనపు సంవత్సరంతో ఈ ముప్పు పెరుగుతూ ఉంటుంది. యుక్తవయసులో గర్భం దాల్చితే రొమ్ము కణాలు త్వరగా పరిణతి చెంది క్యాన్సర్ కారకాల నుంచి రక్షణ కల్పిస్తాయి. అలాగే.. పిల్లలకు ఎక్కువకాలం పాలివ్వడం వల్ల కూడా రొమ్ము క్యాన్సర్ బారిన పడే ప్రమాదం తగ్గుతుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. అలాగే.. ఎక్కువ క్యాలరీలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం, శారీరక శ్రమ లేకపోవడం వల్ల ఊబకాయం బారినపడుతున్నవారి సంఖ్య భారతీయ నగరాల్లో బాగా పెరుగుతోంది. దీనివల్ల మహిళల్లో ఈస్ట్రోజెన్ స్థాయిలు పెరిగి.. రొమ్ము కణాలు ఆ హార్మోన్‌కు ఎక్స్‌పోజ్ అయ్యి క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది (పిల్లలకు పాలిచ్చేటప్పుడు ఈస్ట్రోజెన్ స్థాయిలు తగ్గుతాయి). అలాగే.. రుతుక్రమం ఆగిపోయిన మహిళల్లో కూడా ఊబకాయం వల్ల రొమ్ము క్యాన్సర్ బారిన పడే 30-40% పెరుగుతుంది. ఇక.. మారిన కాలమాన పరిస్థితుల రీత్యా చాలా మంది మహిళలు రాత్రి పూట ఉద్యోగాలు చేస్తున్నారు. దీనివల్ల మెలటోనిన్ ఉత్పత్తి తగ్గి.. ఈస్ట్రోజెన్ స్థాయిలు పెరుగుతున్నాయి. మెలటోనిన్ సరిగ్గా ఉత్పత్తి కాకపోవడం వల్ల డీఎన్ఏ దెబ్బతిని క్యాన్సర్ బారిన పడే ముప్పు పెరుగుతోంది. వీటన్నింటికీ తోడు.. వాయుకాలుష్యం, మద్యపానం వంటివి కూడా రొమ్ము క్యాన్సర్ కేసుల సంఖ్యను పెంచుతున్నాయని డాక్టర్ సాయినాథ్ వెల్లడించారు. పీఎం 2.5 కణాలు (వాయు కాలుష్యం) రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని 8 శాతం పెంచుతాయని.. హైదరాబాద్‌లో వాహన కాలుష్యం, పరిశ్రమల వ్యర్థాలు ప్రమాద స్థాయిలో ఉన్నాయని ఆయన ఆందోళన వెలిబుచ్చారు. ఇక.. దేశంలో సగటున 5 నుంచి 15 శాతం మంది మహిళలు ఆల్కహాల్ తీసుకుంటుండగా, హైదరాబాద్‌లో ఆ సగటు 6-7 శాతంగా ఉందని ఆయన పేర్కొన్నారు. రోజుకు ఒక డ్రింక్ మాత్రమే తీసుకున్నా.. అది రొమ్ము క్యాన్సర్ ముప్పును 7-10% పెంచుతుందని వివరించారు. అలాగే.. బీఆర్‌సీఏ1, బీఆర్‌సీఏ2 జన్యు ఉత్పరివర్తనాలు భారతీయ మహిళల్లో అధికంగా ఉన్నాయని... ఇవి రొమ్ము క్యాన్సర్ రిస్క్‌ను 55-70శాతం పెంచుతాయని చెప్పారు.

ట్రిపుల్ నెగిటివ్ బ్రెస్ట్ క్యాన్సర్


రొమ్ము క్యాన్సర్‌లో ట్రిపుల్ నెగిటివ్ బ్రెస్ట్ క్యాన్సర్ (టీఎన్‌బీసీ) అనేది అరుదైన రొమ్ము క్యాన్సర్ రకం. ఈ తరహా కేసులు ఇప్పుడు ఎక్కువగా నమోదవుతున్నాయని డాక్టర్ సాయినాథ్ తెలిపారు. మన దేశంలో ఈ కేసులు 30శాతం వరకు ఉన్నట్టు చెప్పారు. హైదరాబాద్‌లో మొత్తం క్యాన్సర్ కేసుల్లో పది శాతం టీఎన్‌బీసీ కేసులేనన్నారు.

భారత్‌లో స్ర్కీనింగ్ తక్కువ



భారతదేశంలో 45 ఏళ్లు దాటిన మహిళల్లో కేవలం 1.3% మంది మాత్రమే రొమ్ము పరీక్షలు చేయించుకుంటున్నారు. హైదరాబాద్‌లో ఇది 2.05 శాతంగా ఉండగా, అమెరికాలో 70-84 శాతంగా ఉంది. భారత్‌లో 50-70 శాతం క్యాన్సర్ కేసులను ఆఖరి దశల్లోనే గుర్తిస్తుండగా.. అమెరికాలో మాత్రం 66 శాతం కేసులు ప్రారంభ దశలోనే గుర్తించగలుగుతున్నారు. అక్కడ స్ర్కీనింగ్ ఎక్కువగా జరగడమే ఇందుకు కారణం. మన దగ్గర స్ర్కీనింగ్ తక్కువ జరుగుతోంది. బ్రెస్ట్ క్యాన్సర్ కేసులను ప్రతి నెలా 15 నుంచి 20 మందిలో చూస్తున్నాను. ట్రిపుల్ బ్రెస్ట్ క్యాన్సర్ తీవ్రత ఎక్కువగా ఉంటోంది.

- డాక్టర్ సాయినాథ్, మెడికల్ అంకాజిస్టు, స్టార్ ఆస్పత్రి



ఘనంగా నారా రోహిత్ - శిరీషల వివాహం

పెళ్లి పెద్దలుగా సీఎం చంద్రబాబు దంపతులు

ప్రముఖ నటుడు నారా రోహిత్, శిరీష లేళ్ల పెళ్లి గురువారం రాత్రి 10.35 గంటలకు అంగరంగ వైభవంగా జరిగింది. ఏపీ సీఎం, రోహిత్ పెదనాన్న చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి ఈ పెళ్లికి పెద్దలుగా వ్యవహరించారు. మంత్రి లోకేశ్ దంపతులు, సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ దంపతులతోపాటు నందమూరి, నారా కుటుంబాలకు చెందిన బంధుమిత్రుల నడుమ పెళ్లివేడుక ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని అజీజ్ నగర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.

-అమరావతి, (ఆంధ్రజ్యోతి)



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న 'అఖండ 2: తాండవం' కోసం థమన్ అందిస్తున్న శక్తిమంతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను మరింత అద్భుతంగా మార్చేందుకు సర్వేపల్లి సిస్టర్స్ గాత్రాన్ని పాటల కోసం వాడుతున్నట్లు చిత్రబృందం తెలిపింది.

నిజం నేనే.. ఇజం నేనే



దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా సెల్వమణి సెల్వరాజ్ తెరకెక్కిస్తోన్న పీరియాడికల్ డ్రామా 'కాంత'. స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, వేఫేరర్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ బేనర్లపై రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. టీజర్, పాటలతో చిత్రంపై అంచనాలు పెంచిన మేకర్స్ తాజాగా లిరికల్ వీడియోను విడుదల చేశారు. నిజం నేనే..ఇజం నేనే..పడి పడి లేచే అలల తల పొగరుని..నేనే అంటూ సాగే ఝాను చంతర్ స్వర పర్చిన పాట అదిరి పోయింది. వింటేజ్ ఎలిమెంట్స్‌ను ఆధునిక రాప్ బీట్స్, పవర్‌ఫుల్ సౌండ్‌తో మేళవిస్తూ రూపొందించిన ఈ బాణి ఎంతో ఆకట్టుకుంటోంది.

'ఝూమ్ షరాబీ..'



అజయ్ దేవ్‌గన్, రకుల్‌ప్రీత్ సింగ్ జంటగా నటించిన సినిమా 'దే దే ప్యార్ దే-2'. అన్షుల్ శర్మ తెరకెక్కించిన ఈ చిత్రం 'దే దే ప్యార్‌దే'కు సీక్వెల్‌గా వస్తోంది. లవ్ రంజన్, భూషణ్ కుమార్, అంకుర్ గార్గ్ నిర్మించారు. నవంబరు 14న విడుదల కానుంది.

దాంతో ప్రచార హోరు పెంచిన మేకర్స్ తాజాగా 'ఝూమ్ షరాబీ' అంటూ సాగే పాటను రిలీజ్ చేశారు. అజయ్ దేవ్‌గన్ తన మిత్రులతో కలిసి పబ్‌లో పాడే ఈ పాటలో రకుల్‌ప్రీత్ సింగ్ స్టెప్పులతో అదరగొట్టారు. గులాబీ వర్ణం చీరలో ఆమె గ్లామరస్‌గా కనిపించారు. ఈ పాటను హీరో, హీరోయిన్‌పై చిత్రీకరించినప్పటికీ ప్రత్యేక గీతాన్ని తలదన్నేలా ఉంది.

సందేశాలిచ్చే ధైర్యం చేయను

రాహుల్ రవీంద్రన్



'సినిమా చూసిన ప్రేక్షకులు మంచీ, చెడూ ఆలోచించుకుంటారనే నమ్మకం నాకుంది. అందుకే ఎవరికీ సందేశాలు ఇచ్చే ధైర్యం చేయను. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రంలో బలమైన అభిప్రాయాలు, తీవ్ర భావోద్వేగాలు ఉన్న ఓ ప్రేమ కథని వాస్తవిక కోణంలో చూపించే ప్రయత్నం చేశాం' అని వివరించారు దర్శకుడు రాహుల్ రవీంద్రన్. రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించిన చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. నవంబరు 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ 'నేను కాలేజీలో ఉన్నప్పుడు చూసిన ఓ సంఘటన ఆధారంగా ఈ కథ రాశాను. అప్పట్లో వచ్చిన ఓ పాట కూడా ఈ కథ రాసేందుకు ప్రేరణనిచ్చింది. రష్మికకు స్ర్కిప్ట్ పంపినప్పుడు.. 'ఒక అమ్మాయిగా నేను ఈ కథకు చాలా కనెక్ట్ అయ్యాను. అమ్మాయిలందరికీ నేనిచ్చే బిగ్ హగ్ ఈ సినిమా' అని అన్నారు. కథలో హీరో, హీరోయిన్ ఇద్దరి పాత్రలకూ ప్రాధాన్యం ఉంటుంది. అయితే హీరోయిన్ కోణంలో తెరకెక్కించాం. రెండు సినిమాల తర్వాత రష్మికతో మరో సినిమా చేయబోతున్నా' అని చెప్పారు.

సరికొత్త ప్రేమకథ



-వెంకీ అట్లూరి

సాత్విక్ వర్మ, ప్రీతి నేహా జంటగా భాను తెరకెక్కించిన చిత్రం 'ప్రేమిస్తున్నా'. కనకదుర్గారావు పప్పుల నిర్మిస్తున్నారు. నవంబర్ 7న విడుదల కానుంది. దర్శకుడు వెంకీ అట్లూరి ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. 'అన్ కండీషనల్ లవ్‌తో తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తుంది. ఇందులోని ప్రధాన పాత్రధారుల నటన మీ అందరినీ కట్టిపడేస్తుంది' అని భాను తెలిపారు. 'చాలా రోజుల తర్వాత ఓ అందమైన ప్రేమకథను చూశామన్న భావనను ఈ చిత్రం కలిగిస్తుంది. మంచి టీమ్ వర్క్‌కు ఈ సినిమా ఒక ఉదాహరణలా నిలుస్తుంది' అని కనకదుర్గారావు పప్పుల చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: శిరీష్ ప్రసాద్, సినిమాటోగ్రఫీ: భాస్కర్ శ్యామల.

'ది తాజ్ స్టోరీ' విడుదలకు లైన్ క్లియర్

- నిషేధం కోసం వేసిన పిటిషన్లను కొట్టేసిన ఢిల్లీ హైకోర్టు



తాజ్‌మహల్ చుట్టూ ప్రచారంలో ఉన్న పలు వివాదాస్పద అంశాల ఆధారంగా రాసుకున్న కథతో దర్శకుడు తుషార్ అమ్రిష్ గోయల్ తెరకెక్కించిన చిత్రం 'ది తాజ్ స్టోరీ'. నేడు విడుదలవుతోంది. బాలీవుడ్ నటుడు పరేశ్ రావల్ ప్రధాన పాత్ర పోషించారు. 'ది తాజ్ స్టోరీ' చిత్రానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించడంతో ఈ చిత్రం విడుదలకు అడ్డంకులు తొలగిపోయాయి. ఈ సినిమా విడుదలపై నిషేధం విధించాలి లేదా 'ఇదొక వివాదాస్పద కథనం మాత్రమే వాస్తవం కాదు' అని స్పష్టమైన వివరణను టైటిల్స్‌కు జోడించాలని న్యాయవాదులు చేత్న గౌతమ్, షకీల్ అబ్బాస్ కోర్టును ఆశ్రయించారు. 'మేమేమైనా సూపర్ సెన్సార్‌బోర్డ్ అనుకుంటున్నారా?, చట్టపరమైన పరిమితుల్లోనే కోర్టులు పనిచేస్తాయి, సెన్సార్ బోర్డు ఇచ్చిన సర్టిఫికేషన్‌ను ప్రశ్నించే అధికారం మాకు లేద'ని న్యాయస్థానం స్పష్టం చేసింది. దీనిపై కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించడానికి పిటిషనర్లకు అనుమతి ఇచ్చి, కేసులను కొట్టి వేసింది.

హైదరాబాద్‌లో సినిమాటిక్ ఎక్స్‌పో



పి.జి.విందా

హైదరాబాద్ హెచ్ఐసీసీలో నవంబరు 1, 2 తేదీల్లో 'సినిమాటిక్ ఎక్స్‌పో 2025' మూడో ఎడిషన్ నిర్వహిస్తున్నామని తెలుగు సినిమాటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, సినిమాటిక్ ఎక్స్‌పో అండ్ సినికా క్రియేటర్స్ కౌన్సిల్ ఎం.డి పి.జి.విందా తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... సినికా క్రియేటర్స్ కౌన్సిల్ అనే స్వచ్ఛంద సంస్థ, తెలంగాణ ప్రభుత్వ మద్దతుతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సినిమాటోగ్రఫీ, వీఎఫ్ఎక్స్, వర్చువల్ ప్రొడక్షన్, ఏఐ ఫిల్మ్ మేకింగ్ వంటి ఆధునిక సాంకేతికతలపై మాస్టర్ క్లాసులు నిర్వహిస్తామన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపుమేరకు 'హాలీవుడ్ టు హైదరాబాద్' కాన్సెప్ట్‌తో భారతీయ సినిమాను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే కొత్త మైలురాయిగా ఈ ఎడిషన్ నిలుస్తుందని పేర్కొన్నారు.

చాంపియన్‌ను కొట్టేసి ఫైనల్ బెర్త్ పట్టేసి..

అజేయ ఆస్ట్రేలియాకు సెమీస్‌లో చెక్

మహిళల వన్డే వరల్డ్ కప్



- జెమీమా రోడ్రిగ్స్ శతకమోత
- విజృంభించిన హర్మన్‌ప్రీత్
- దక్షిణాఫ్రికాతో భారత్ టైటిల్ పోరు

నవీ ముంబై: వన్డే వరల్డ్ కప్ చరిత్రలోనే అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన భారత మహిళల జట్టు మూడోసారి ఫైనల్లోకి అడుగుపెట్టింది. జెమీమా రోడ్రిగ్స్ (134 బంతుల్లో 14 ఫోర్లతో 127 నాటౌట్), హర్మన్‌ప్రీత్ కౌర్ (88 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సలతో 89) అదరగొట్టడంతో.. గురువారం ఉత్కంఠభరితంగా సాగిన రెండో సెమీస్‌లో డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియాను భారత్ 5 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. తొలుత ఆస్ట్రేలియా 49.5 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌటైంది. ఫోబీ లిచ్‌ఫీల్డ్ (119), ఎలీస్ పెర్రీ (77), ఆష్లే గార్డ్‌నర్ (63) శ్రమ వృథా అయింది. శ్రీచరణి, దీప్తి చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో భారత్ 48.3 ఓవర్లలో 341/5 స్కోరు చేసి గెలిచింది. రిచా ఘోష్ (26) దూకుడుగా ఆడింది. కిమ్ గార్త్, సదర్లాండ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఓపెనర్‌గా షఫాలీని ఎంపిక చేయగా.. హర్లీన్ డియోల్ స్థానంలో అమన్‌జోత్ కౌర్ జట్టులోకి వచ్చింది. జెమీమా ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచింది. కాగా భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య **ఫైనల్ మ్యాచ్ ఆదివారం** జరుగుతుంది.

ఆందోళనకు గురైనా.. : భారీ ఛేదనలో జెమీమా జట్టును ముందుండి నడిపించింది. కెప్టెన్ హర్మన్‌తో కలిసి మూడో వికెట్‌కు 167 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన రోడ్రిగ్స్.. దీప్తి శర్మ (24), రిచా, అమన్‌జోత్ కౌర్ (15 నాటౌట్)తో కలసి జట్టును విజయ తీరాలకు చేర్చింది. ఓపెనర్ షఫాలీ వర్మ (10) స్వల్ప స్కోరుకే వెనుదిరిగింది. అయితే, మరో ఓపెనర్ స్మృతి మంధాన (24), వన్‌డౌన్ బ్యాటర్ జెమీమా రెండో వికెట్‌కు 46 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. కానీ, లెగ్‌సైడ్‌లో వెళ్తున్న బంతిని కదిలించి మరీ మంధాన అవుట్ కావడంతో భారత్ 59/2తో నిలిచింది. అయితే, రోడ్రిగ్స్‌కు కెప్టెన్ హర్మన్ జత కావడంతో స్కోరు ఊపందుకొంది. స్ట్రయిక్ రొటేట్ చేస్తూనే వీలుచిక్కినప్పుడల్లా షాట్లు ఆడుతూ రన్‌రేట్‌ను నియంత్రణలో ఉంచారు. ఈ క్రమంలో జెమీమా అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. ఆ తర్వాత కౌర్ జోరందుకొంది. 29వ ఓవర్‌లో సింగిల్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న హర్మన్ ఆ తర్వాత రెండు భారీ సిక్సలతో దూకుడు పెంచింది. దీంతో 32వ ఓవర్‌లో టీమ్ స్కోరు 200 మార్క్ దాటింది. వరుస బౌండ్రీలతో విరుచుకుపడుతున్న కౌర్‌ను సదర్లాండ్ అవుట్ చేసింది. ఈ దశలో దీప్తితో కలసి జెమీమా జట్టును గెలిపించే బాధ్యత భుజాన వేసుకొంది. కానీ, చివరి 10 ఓవర్లలో 82 పరుగులు కావల్సి ఉండగా.. దీప్తి రనౌట్ అయింది. అనంతరం క్రీజులోకి వచ్చిన రిచా అటాకింగ్ గేమ్‌తో ఆసీస్ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించే ప్రయత్నం చేసింది. మరోవైపు బౌండరీతో సెంచరీ పూర్తి చేసుకొన్న రోడ్రిగ్స్.. సదర్లాండ్ బౌలింగ్‌లో మెక్‌గ్రాత్ క్యాచ్ చేజారడంతో బతికిపోయింది. 45వ ఓవర్‌లో గార్డ్‌నర్ బౌలింగ్‌లో రిచా 6,4తో జోరు చూపడంతో.. సమీకరణం 34 బంతుల్లో 30 పరుగులకు దిగివచ్చింది. కీలక సమయంలో రిచాను అవుట్ చేసిన సదర్లాండ్ ఉత్కంఠ రేపింది. కానీ, అమన్‌జోత్, జెమీమా చెరో రెండు బౌండ్రీలతో మోతెక్కించడంతో.. భారత్ 9 బంతులు మిగిలుండగానే గెలుపు అందుకొంది.

బ్రేకులేసిన చరణి..: ఓపెనర్ లిచ్‌ఫీల్డ్, పెర్రీ రెండో వికెట్‌కు 155 పరుగుల దూకుడైన భాగస్వామ్యంతో ఆసీస్ భారీ స్కోరు చేసింది. ఒకదశలో స్కోరు 400 మార్క్ దాటేలా కనిపించింది. కానీ, చివరి 16.1 ఓవర్లలో 118 పరుగులకు 8 వికెట్లు పడగొట్టిన భారత బౌలర్లు ఆసీస్ జోరుకు కొంతమేర బ్రేకులు వేశారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ స్వల్ప స్కోరుకే కెప్టెన్ హీలీ (5) వికెట్ కోల్పోయింది. కానీ, ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. లిచ్‌ఫీల్డ్, పెర్రీ క్రీజులో నిలదొక్కుకోవడంతో పరుగుల వరద పారింది. ముఖ్యంగా లిచ్‌ఫీల్డ్ గతితప్పిన భారత బౌలింగ్‌ను ఉతికి ఆరేసింది. ఫీల్డింగ్ కూడా పేలవంగా ఉండడంతో ఫోబి స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసింది. ఆమెను నియంత్రించడానికి హర్మన్‌ప్రీత్ బౌలర్లను మార్చి ప్రయోగించిన ఫలితం దక్కలేదు. ఈ క్రమంలో శతకం పూర్తి చేసుకొన్న లిచ్‌ఫీల్డ్‌ను అమన్‌జోత్ బౌల్డ్ చేసి జట్టుకు ఊరటనిచ్చింది. ఆ తర్వాత బెత్ మూనీ (24), సదర్లాండ్ (3)ను చరణి అవుట్ చేయడంతో స్కోరు వేగం మందగించింది. ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న పెర్రీని రాధ బౌల్డ్ చేసింది. కానీ, డెత్ ఓవర్లలో గార్డ్‌నర్ ఎడాపెడా షాట్లతో చెలరేగడంతో ఆసీస్ 330కి పైగా స్కోరు సాధించింది.



జెమీమా (134 బంతుల్లో 14 ఫోర్లతో 127 నాటౌట్)



కెప్టెన్ హర్మన్



ఫోబీ లిచ్‌ఫీల్డ్ (119)

3 మహిళల వన్డేల్లో 300 పైగా స్కోరును ఛేధించడం ఇది మూడోసారి. ఇదే టోర్నీలో భారత్‌తో మ్యాచ్‌లో 331 పరుగుల రికార్డు లక్ష్యాన్ని ఆసీస్ అధిగమించింది. ఇప్పుడు భారత్ 339 పరుగుల టార్గెట్‌ను ఛేదించి టాప్‌లో నిలిచింది. గతేడాది సౌతాఫ్రికాపై లంక 302 స్కోరు చేసి గెలిచింది.

ఏడుసార్లు వరల్డ్‌కప్ చాంపియన్ ఆస్ట్రేలియాకు ప్రపంచ కప్ సెమీస్‌లో ఓడడం ఇది రెండోసారి మాత్రమే. రెండు సార్లూ భారతే ఓడించింది.

వరల్డ్‌కప్‌లో ఫైనల్‌కు చేరడం భారత్‌కిది మూడోసారి. 2005, 2017లలో రన్నరప్‌గా నిలిచింది.

ఆస్ట్రేలియా వరుస 15 వన్డేల విజయాలకు బ్రేక్

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా: హీలీ (బి) క్రాంతి 5, లిచ్‌ఫీల్డ్ (బి) అమన్‌జోత్ 119, పెర్రీ (బి) రాధ 77, బెత్ మూనీ (సి) జెమీమా (బి) చరణి 24, సదర్లాండ్ (సి అండ్ బి) చరణి 3, గార్డ్‌నర్ (రనౌట్/క్రాంతి) 63, మెక్‌గ్రాత్ (రనౌట్/జెమీమా) 12, కిమ్ గార్త్ (రనౌట్/అమన్‌జోత్) 17, కింగ్ (సి) రిచా (బి) దీప్తి 4, మోలినెక్స్ (బి) దీప్తి 0, మేగన్ షట్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 49.5 ఓవర్లలో 338 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-25, 2-180, 3-220, 4-228, 5-243, 6-265, 7-331, 8-336, 9-336; **బౌలింగ్:** రేణుక 8-0-39-0, క్రాంతి గౌడ్ 6-0-58-1, శ్రీచరణి 10-0-49-2, దీప్తి శర్మ 9.5-0-73-2, అమన్‌జోత్ 8-0-51-1, రాధ 8-0-66-1.

భారత్: షఫాలీ (ఎల్బీ) గార్త్ 10, మంధాన (సి) హీలీ (బి) గార్త్ 24, జెమీమా (నాటౌట్) 127, హర్మన్ (సి) గార్డ్‌నర్ (బి) సదర్లాండ్ 89, దీప్తి (రనౌట్/గార్త్) 24, రిచా (సి) గార్త్ (బి) సదర్లాండ్ 26, అమన్‌జోత్ (నాటౌట్) 15; **ఎక్స్‌ట్రాలు: 26; మొత్తం: 48.3 ఓవర్లలో 341/5; వికెట్ల పతనం:** 1-13, 2-59, 3-226, 4-264, 5-310; **బౌలింగ్:** మేగన్ షట్ 6-0-40-0, కిమ్ గార్త్ 7-0-46-2, గార్డ్‌నర్ 8-0-55-0, మోలినెక్స్ 6.3-0-44-0, సదర్లాండ్ 10-0-69-2, అలనా కింగ్ 9-0-58-0, తహిల 2-0-19-0.




మ. 1.45 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

మెల్‌బోర్న్‌లో మోతెక్కించేనా?

జోష్‌లో టీమిండియా ● ఆసీస్‌తో రెండో టీ20

మెల్‌బోర్న్: ఐదు టీ20ల సిరీస్‌లో ఆరంభ మ్యాచ్ వర్షంతో రద్దయిన వేళ.. శుక్రవారం భారత్-ఆస్ట్రేలియా జట్లు మరో పోరుకు సిద్ధమయ్యాయి. ప్రఖ్యాత మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో జరిగే ఈ రెండో టీ20లో నెగ్గి బోణీ చేసేందుకు ఇరుజట్లూ ఎదురుచూస్తున్నాయి. పొట్టి వరల్డ్‌కప్ విజేతగానే కాకుండా ఇటీవలి ఆసియాకప్ టీ20 టోర్నీని గెలిచిన భారత్ బుధవారం నాటి తొలి మ్యాచ్‌ను ఆత్మవిశ్వాసంతో ఆరంభించింది. 9.4 ఓవర్ల ఆటే సాగినా 97/1 స్కోరుతో సరైన ట్రాక్‌లో ఉన్నట్టు కనిపించింది. కెప్టెన్ సూర్యకుమార్ 24 బంతుల్లోనే 39 రన్స్‌తో మునుపటి ఫామ్‌ను అందుకోవడంతో పాటు, హాజెల్‌వుడ్ ఓవర్‌లో ఏకంగా 125మీ. దూరం బాదిన సిక్సర్‌తో ఆసీస్‌ను బెదరగొట్టాడు. అటు ఓపెనర్ గిల్ మాత్రం క్రీజులో కుదురుకున్నాడు. మరో ఓపెనర్ అభిషేక్ కాన్‌బెర్రాలో విఫలమైనా.. ఎంసీజీలో చెలరేగాలనుకుంటున్నాడు. మిడిలార్డర్‌లో తిలక్, శాంసన్, దూబే కీలకం కానున్నారు. మరోవైపు ఐదుగురు బ్యాటర్లు, ముగ్గురు ఆల్‌రౌండర్లు, ముగ్గురు బౌలర్లతో తొలి మ్యాచ్ ఆడిన జట్టు నేటి మ్యాచ్‌లోనూ ఇదే కాంబినేషన్‌ను కొనసాగించవచ్చు. అదే జరిగితే పేసర్ అర్ష్‌దీప్ బెంచీకి పరిమితం కాక తప్పదు. అతనికన్నా హర్షిత్ మెరుగైన బ్యాటర్ కావడంతో కోచ్ గంభీర్ అతడి వైపే మొగ్గుచూపుతున్నాడు. అయితే కుల్దీప్, వరుణ్‌లలో ఒక్కరికే చాన్స్ కల్పిస్తే అర్ష్‌దీప్‌ను తీసుకోవచ్చు.

ఎదురుదాడే లక్ష్యంగా..: భారత్ తరహాలోనే ఆస్ట్రేలియా కూడా ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగుతోంది. ఓపెనర్లు హెడ్, మార్ష్ మెరుపు ఆరంభాలతో భారీ స్కోరు అందుకోవాలనుకుంటోంది. ఆ తర్వాత ఇన్‌గ్లి‌స్, డేవిడ్, స్టొయినిస్ బ్యాట్లు ఝుళిపిస్తే భారత బౌలర్లకు కష్టమే. ఇక పేసర్ హాజెల్‌వుడ్‌కు ఈ సిరీస్‌లో ఇదే చివరి మ్యాచ్. రాబోయే యాషెస్ సిరీస్ కోసం అతడికి విశ్రాంతినివ్వనున్నారు. బార్ట్‌లెట్, ఎలిస్, స్పిన్నర్ కునేమన్ బౌలింగ్‌పై ఆధారపడి ఉంది.



మార్ష్

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్, శాంసన్, దూబే, అక్షర్, హర్షిత్, కుల్దీప్, వరుణ్, బుమ్రా.

ఆస్ట్రేలియా: హెడ్, మార్ష్ (కెప్టెన్), ఇన్‌గ్లిస్, డేవిడ్, ఓవెన్, స్టొయినిస్, ఫిలిప్, బార్ట్‌లెట్, ఎలిస్, కునేమన్, హాజెల్‌వుడ్.

పిచ్, వాతావరణం

2022 టీ20 వరల్డ్‌కప్ ఫైనల్ తర్వాత ఎంసీజీలో పొట్టి ఫార్మాట్‌లో జరుగుతున్న మొదటి మ్యాచ్ ఇది. బౌలర్లకు సహకరించే ఈ పిచ్‌పై సగటు స్కోరు 152. అయితే శుక్రవారం కూడా మెరుపులతో కూడిన వాతావరణం ఉండడంతో మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించే అవకాశం ఉంది.

పసిడీలా!



క్యూ3లో 16 శాతం తగ్గిన బంగారం గిరాకీ

- ధరలు రికార్డు స్థాయికి పెరగడమే కారణం
- పెట్టుబడి డిమాండ్‌లో 20 శాతం వృద్ధి
- డబ్ల్యూజీసీ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: ధరలు రికార్డు స్థాయికి పెరగడంతో ఈ జూలై-సెప్టెంబరు త్రైమాసికం (క్యూ3)లో పసిడి గిరాకీ 16 శాతం తగ్గి 209.4 టన్నులకు పరిమితమైందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) గురువారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గత ఏడాదిలో ఇదే కాలానికి డిమాండ్ 248.3 టన్నులుగా నమోదైంది. అయితే, అధిక ధరల కారణంగా ఈ క్యూ3లో బంగారం గిరాకీ విలువ వార్షిక ప్రాతిపదికన 23 శాతం పెరిగి రూ.2,03,240 కోట్లకు చేరిందని రిపోర్టు తెలిపింది. 2024లో ఇదే సమయానికిది రూ.1,65,380 కోట్లుగా ఉంది. డబ్ల్యూజీసీ నివేదికలో మరిన్ని విషయాలు..

- ఈ క్యూ3లో బంగారం నగల గిరాకీ వార్షిక ప్రాతిపదికన 31 శాతం తగ్గి 117.7 టన్నులకు పడిపోయింది. డిమాండ్ విలువ మాత్రం దాదాపు గత ఏడాది స్థాయిలోనే (రూ.1,14,270 కోట్లుగా) నమోదైంది.
- పసిడిలో పెట్టుబడుల డిమాండ్ పరిమాణం పరంగా 20 శాతం పెరిగి 91.6 టన్నులకు చేరుకోగా.. పెట్టుబడుల విలువ 74 శాతం పెరిగి రూ.88,970 కోట్లకు ఎగబాకింది.
- గడిచిన మూడు నెలల్లో దేశంలోకి బంగారం దిగుమతులు 37 శాతం తగ్గి 194.6 టన్నులకు పరిమితమైంది. గత ఏడాదిలో ఇదే సమయానికి 308.2 టన్నులు దిగుమతైంది. పాత బంగారం పునర్ వినియోగం కూడా 7 తగ్గి 21.8 టన్నులుగా నమోదైంది.

క్యూ3 సగటు ధర రూ.97,074

గడిచిన మూడు నెలలకు బంగారం సగటు ధర (దిగుమతి సుంకం, జీఎస్‌టీ మినహాయించి) రూ.97,074.9గా నమోదైంది. గత ఏడాదిలో ఇదే కాలానికి నమోదైన సగటు ధర రూ.66,614.1తో పోలిస్తే 46 శాతం పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ సగటు రేటు 2,474.3 డాలర్ల నుంచి 3,456.5 డాలర్లకు పెరిగింది.

ఏడాది గిరాకీ 600-700 టన్నులు

ఈ సంవత్సరం మొత్తానికి పసడి గిరాకీ 600-700 టన్నుల స్థాయిలో నమోదు కావచ్చని డబ్ల్యూజీసీ అంచనా వేసింది. గడిచిన 9 నెలలకు (జనవరి-సెప్టెంబరు) డిమాండ్ 462.4 టన్నులుగా ఉంది.

ప్రపంచవ్యాప్త గిరాకీ 1,313 టన్నులు

ఈ జూలై-సెప్టెంబరు కాలానికి ప్రపంచవ్యాప్తంగా పసిడి డిమాండ్ రికార్డు స్థాయిలో 1,313 టన్నులకు పెరిగింది. ఆయా దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు జోరుగా పసిడి కొనుగోలు చేయడం, ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో ఈ విలువైన లోహంలోకి రికార్డు స్థాయిలో పెట్టుబడులు వచ్చి చేరడం ఇందుకు కారణం.

క్యూ4లో బలమైన గిరాకీ

దీర్ఘకాలంలో విలువ పెంచేదిగా బంగారంపై భారత వినియోగదారులకు ఉన్న నిబద్ధతను తాజా గణాంకాలు నొక్కి చెబుతున్నాయి. క్యూ3లో గిరాకీ పరిమాణం 16% తగ్గినా, విలువపరంగా 23% పెరగడాన్ని విస్మరించలేం. భారత వినియోగదారుల తలసరి ఆదాయంతో పాటు ఖర్చు పెట్టే స్థోమత కూడా క్రమంగా పెరుగుతోంది. దీపావళి సీజన్‌లో బంగారం విక్రయాలు భారీగా జరిగాయని విక్రేతల నుంచి సంకేతాలందుతున్నాయి. పెళ్లిళ్ల సీజన్ కూడా ఉన్నందున నాలుగో త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు)లో బలమైన గిరాకీ నమోదు కానుందని ధీమాగా ఉన్నాం.

- సచిన్ జైన్, రీజనల్ సీఈఓ, డబ్ల్యూజీసీ ఇండియా

ఎంపిక చేసిన జియో 5జీ యూజర్లకు ఉచితంగా గూగుల్ ఏఐ ప్రో సేవలు

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ కృత్రిమ మేధ(ఏఐ) అనుబంధ విభాగమైన రిలయన్స్ ఇంటెలిజెన్స్ తాజాగా గూగుల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. తద్వారా రిలయన్స్ జియోకు చెందిన ఎంపిక చేసిన (18-25 ఏళ్లలోపు) 5జీ వినియోగదారులకు రూ.35,100 విలువైన 'గూగుల్ ఏఐ ప్రో' సేవలను 18 నెలల పాటు ఉచితంగా అందించనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ గురువారం ప్రకటించింది. ఈ ఉచిత సేవల్లో భాగంగా గూగుల్ జెమినీ యాప్‌లో జెమినీ 2.5 ప్రో మోడల్ యాక్సెస్‌తో పాటు అన్‌లిమిటెడ్ చాట్స్, 2 టీబీ క్లౌడ్ స్టోరేజీ, వీఈఓ 3.1పై వీడియో జనరేషన్, నానో బనానా ద్వారా ఇమేజ్ జనరేషన్, అధ్యయనం, పరిశోధన కోసం నోట్‌బుక్ ఎల్ఎంకు విస్తృత యాక్సెస్ సహా ఇతర అధునిక ఏఐ టూల్స్‌ను వినియోగించుకునే అవకాశం అర్హులైన వినియోగదారులకు లభించనుంది.

తగ్గిన యూనియన్ బ్యాంక్ లాభం

ముంబై: ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ).. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.4,249 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 10 శాతం క్షీణించింది. కీలక ఆదాయాలు, రికవరీలు తగ్గటం పనితీరుపై ప్రభావం చూపించాయని బ్యాంక్ పేర్కొంది. సమీక్షా త్రైమాసికంలో నికర వడ్డీ ఆదాయం 2.6 శాతం తగ్గి రూ.8,812 కోట్లకు చేరింది. అలాగే నికర వడ్డీ మార్జిన్ కూడా 2.90 శాతం నుంచి 2.6 శాతానికి క్షీణించింది.

బిజినెస్


మేఘా ఇంజనీరింగ్ చేతికి టీఏక్యూఏ నైవేలీ పవర్ ప్లాంట్

అబుదాబీ కంపెనీ నుంచి 100% వాటా కొనుగోలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్).. తమిళనాడులోని టీఏక్యూఏ నైవేలీ పవర్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్‌ను చేజిక్కించుకుంది. అబుదాబీ నేషనల్ ఎనర్జీ కంపెనీ పీజేఎస్‌సీ (టీఏక్యూఏ) నుంచి 100 శాతం వాటాలను అనుబంధ సంస్థ ఎంఈఐఎల్ ఎనర్జీ కొనుగోలు చేసిందని మేఘా ఇంజనీరింగ్ వెల్లడించింది. అయితే ఎంత మొత్తానికి ఈ వాటాను కొనుగోలు చేసిందనే వివరాలను మాత్రం వెల్లడించలేదు. టీఏక్యూఏ నైవేలీ పవర్ ప్లాంట్ ప్రస్తుతం తమిళనాడులో 250 మెగావాట్ల సామర్థ్యం గల లిగ్నైట్ ఆధారిత విద్యుదుత్పత్తి ప్లాంట్‌ను నిర్వహిస్తోంది. తమిళనాడు విద్యుత్ పంపిణీ సంస్థలకు విద్యుత్‌ను సరఫరా చేసేందుకు టీఏక్యూఏ నైవేలీ ఇప్పటికే దీర్ఘకాలిక ఒప్పందాలు కూడా కుదుర్చుకుంది. ఇప్పటికే ఎంఈఐఎల్‌కు ఉన్న 5,200 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం గల పోర్టుఫోలియోను ఈ కొనుగోలుతో మరింతగా విస్తరించే అవకాశం లభిస్తుందని తెలిపింది. వ్యూహాత్మక పెట్టుబడుల ద్వారా ఇంధన రంగంలో కార్యకలాపాలు మరింతగా విస్తరించే అవకాశం లభించనుందని ఎంఈఐఎల్ గ్రూప్ సీఎఫ్ఓ సలీల్ కుమార్ మిశ్రా తెలిపారు. థర్మల్, హైడ్రో, పునరుత్పాదక ఇంధన వనరులన్నింటితో కూడిన సమతూకమైన, సుస్థిర పోర్టుఫోలియో అభివృద్ధి చేయాలన్నది తమ లక్ష్యమని మిశ్రా పేర్కొన్నారు.


ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

31వ తేదీ




హైదరాబాద్	570	విజయవాడ	575
వరంగల్	572	గోదావరి	580
చిత్తూరు	593	విశాఖపట్నం	570
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	120
వరంగల్	112	గుంటూరు	124
కరీంనగర్	112	ఒంగోలు	124
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	114
కర్నూలు	112	నెల్లూరు	119
విశాఖపట్నం	116	అనంతపురం	119
గోదావరి	120		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,20,490 ▼	1,10,450 ▼	1,65,000 ▲
విజయవాడ	1,23,200 ▼	1,16,000 ▼	1,51,200 ▲
విశాఖపట్నం	1,23,520 ▼	1,10,450 ▼	1,65,000 ▼
రాజమండ్రి	1,21,470 ▼	1,11,350 ▼	1,48,000 ▼
ప్రొద్దుటూరు	1,19,500 ▲	1,09,940 ▲	1,50,000 ▲
ముంబై	1,19,619 ▼	1,09,571 ▼	1,46,783 ▲

కెనరా బ్యాంక్ లాభం రూ.4,774 కోట్లు



క్యూ2లో 19 శాతం వృద్ధి

- రూ.50 కోట్లతో అమరావతిలో ప్రాంతీయ కార్యాలయం
- బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్.. సెప్టెంబరుతో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను బ్యాంక్ నికర లాభం 19 శాతం వృద్ధి చెంది రూ.4,774 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.4,015 కోట్లుగా ఉంది. త్రైమాసిక కాలంలో మొండి బకాయిలు గణనీయంగా తగ్గటం ఎంతగానో కలిసి వచ్చిందని బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు వెల్లడించారు. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం కూడా రూ.34,721 కోట్ల నుంచి రూ.38,598 కోట్లకు పెరిగిందన్నారు. ఈ కాలంలో బ్యాంక్ వడ్డీ ఆదాయం కూడా రూ.29,740 కోట్ల నుంచి రూ.31,544 కోట్లకు పెరగగా నికర వడ్డీ ఆదాయం మాత్రం రూ.9,315 కోట్ల నుంచి రూ.9,141 కోట్లకు తగ్గింది. బ్యాంక్ మొత్తం డిపాజిట్లు 13.4 శాతం వృద్ధి చెంది రూ.15,27,922 కోట్లకు చేరుకున్నాయి. మొత్తం అడ్వాన్సులు కూడా 13.7 శాతం పెరిగి రూ.11,51,041 కోట్లకు చేరుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 2.75-2.8 శాతం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బ్యాంక్ తెలిపింది.

తగ్గిన మొండి బకాయిలు: సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 3.73 శాతం నుంచి 2.35 శాతానికి తగ్గగా నికర ఎన్‌పీఏలు కూడా 0.98 శాతం నుంచి 0.54 శాతానికి తగ్గినట్లు బ్యాంక్ పేర్కొంది. మరోవైపు మొండి పద్దుల కోసం చేసిన కేటాయింపులు రూ.2,587 కోట్ల నుంచి రూ.1,504 కోట్లకు తగ్గినట్లు తెలిపింది. అలాగే ప్రొవిజన్ కవరేజీ నిష్పత్తి (పీసీఆర్) 90.89 శాతం నుంచి 93.59 శాతానికి పెరిగిందని పేర్కొంది. కాగా వ్యాపార విస్తరణకు సంబంధించి బ్యాంక్ వద్ద ప్రస్తుతం సరిపడా నిధులు ఉన్నాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అదనపు నిధులను సమీకరించాల్సిన అవసరం లేదని బ్యాంక్ ఎండీ సత్యనారాయణ రాజు తెలిపారు.

అమరావతిలో రీజినల్ కార్యాలయం

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో కెనరా బ్యాంక్ రీజినల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సత్యనారాయణ రాజు వెల్లడించారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో ఇప్పటికే చర్చించినట్లు ఆయన చెప్పారు. అయితే మొంథా తుపాను కారణంగా భూమి కేటాయింపు వాయిదా పడిందన్నారు. రూ.50 కోట్లతో పూర్తి హంగులతో ఈ ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. రీజినల్ ఆఫీస్‌తో పాటు జోనల్ ఆఫీస్, రిటైల్, ఎంఎస్ఎంఈ విభాగాలకు సంబంధించి కార్యాలయాలు అనుబంధంగా ఉంటాయని రాజు తెలిపారు.

రూ.3 లక్షల కోట్ల సంపద ఆవిరి

- సెన్సెక్స్ 593 పాయింట్లు డౌన్
- 25,900 దిగువ స్థాయికి నిఫ్టీ

ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం భారీగా నష్టపోయాయి. సెన్సెక్స్ 592.67 పాయింట్లు క్షీణించి 84,404.46 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 176.05 పాయింట్ల పతనమై 25,877.85 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 23 నష్టపోయాయి. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ.3 లక్షల కోట్లు తగ్గి రూ.472.36 లక్షల కోట్లకు పడిపోయింది.

4న గ్రో ఐపీఓ: స్టాక్ బ్రోకింగ్ సేవల యాప్ 'గ్రో' మాతృసంస్థ బిలియన్ బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ రూ.6,632 కోట్ల తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చే నెల 4న ప్రారంభమై 7న ముగియనుంది. ఇష్యూ ధరల శ్రేణిని కంపెనీ రూ.95-100గా నిర్ణయించింది.

కెనడాలో డాక్టర్ రెడ్డీస్‌కు చుక్కెదురు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బరువు తగ్గించే సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్‌ను కెనడాలో విడుదల చేసే విషయంలో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌కు చుక్కెదురైంది. అబ్రివేటెడ్ న్యూ డ్రగ్ సబ్‌మిషన్ (ఏఎన్‌డీఎస్) వ్యవహారంలో నిబంధనలు ఉల్లంఘించారంటూ కెనడాకు చెందిన ఫార్మాస్యూటికల్ డ్రగ్ డైరెక్టరేట్ నోటీసు జారీ చేయడంతో ఆ ఔషధం విడుదల మరింత జాప్యం అయ్యే ఆస్కారం ఉంది. అయితే సెమాగ్లుటైడ్ ఔషధం విషయంలో అదనపు సమాచారాన్ని, వివరణలను డ్రగ్ డైరెక్టరేట్ కోరిందని, వారు నిర్దేశించిన గడువు లోగానే తాము సమాధానం ఇస్తామని డాక్టర్ రెడ్డీస్ స్పష్టీకరించింది.

పవర్‌గ్రిడ్‌కు 220 కేవీ ఎం-జీఐఎస్: తోషిబా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశీయంగా తయారైన తొలి 220 కేవీ మొబైల్ గ్యాస్ ఇన్సులేటెడ్ స్విచ్‌గేర్ (ఎం-జీఐఎస్) వ్యవస్థను పవర్‌గ్రిడ్ కార్పొరేషన్‌కు అందించినట్లు తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (టీటీడీఐ) ప్రకటించింది. తెలంగాణలోని టీటీడీఐ తయారీ కేంద్రంలో ఈ స్విచ్ గేర్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపింది. స్థలం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అధిక వోల్టేజీ విద్యుత్ పంపిణీకి జీఐఎస్ వ్యవస్థను ఉపయోగిస్తారని కంపెనీ తెలిపింది.

ఆలయాల విశిష్టత తెలిపే 'కాఫీ టేబుల్' బుక్!

హైదరాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలు, సంస్కృతి, సంప్రదాయాలు తెలియజెప్పేలా దేవాదాయ శాఖ 'కాఫీ టేబుల్' బుక్ రూపొందిస్తోంది. చారిత్రక గోల్కొండ బోనాలు, శక్తి పీఠం జోగులాంబ అమ్మవారి ఆలయం, యాదాద్రి, మేడారం జాతర, బాసర నది హారతి ఇలా అనేక ఆలయాల చరిత్ర, విశిష్టతలు వివరిస్తు కాఫీ టేబుల్ బుక్ సిద్ధం చేస్తున్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అర్చక, ఉద్యోగులకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, శిధిలావస్థకు చేరిన పురాతన ఆలయాల పునరుద్ధరణ చిత్రాల్ని కూడా ఈ బుక్‌లో పొందుపరుస్తున్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కాఫీ టేబుల్ బుక్ రూపొందించడం ఇదే మొదటిసారి.

బియ్యం ఎగుమతుల వృద్ధితో రైతులకు లాభం

- పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

న్యూఢిల్లీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బియ్యం ఎగుమతుల పెరుగుదలతో రైతులకు లాభం చేకూరుతుందని ఆహార, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో ఇంటర్నేషనల్ రైస్ కాన్ఫరెన్స్ జరిగింది. ఇక్కడ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఏర్పాటు చేసిన తెలంగాణ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్టాల్‌లోని ఎంటీయూ 1010, ఆర్ఎన్ఆర్ 15048, బీపీటీ 5204, కేఎన్ఎం 1638, కేఎన్ఎం 118 - జై శ్రీరామ్, హెచ్ఎంటీ సోనా, చిట్టిముత్యాలు వంటి ప్రీమియం రకాల బియ్యం శాంపిళ్లు వివిధ దేశాల ప్రతినిధుల దృష్టిని ఆకర్షించాయి. కువైట్, ఆఫ్రికా దేశాల ప్రతినిధి ఎన్‌సీఈఎల్ ఎండీ ఉనుపోమ్ కౌసిక్, ఇండియన్ రైస్ ఎక్స్‌పోర్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ప్రేమ్ గార్గ్, స్వదేశానికి చెందిన ప్రముఖ బియ్యం ఎగుమతిదారులు తెలంగాణ స్టాల్‌ను సందర్శించారు.

యాదగిరిగుట్ట ఆలయ ఇన్‌చార్జి ఎస్ఈ నివాసాల్లో ఏసీబీ సోదాలు

- లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన దేవస్థాన ఇంజనీర్

యాదాద్రి/కొత్తపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): లడ్డూ ప్రసాదాల యంత్రాల మరమ్మతు బిల్లు మంజూరుకు కమీషన్ డిమాండ్ చేసిన యాదగిరిగుట్ట దేవస్థానం విద్యుత్ విభాగం ఇన్‌చార్జి ఎల్బీనగర్ నివాసంతో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ గురువారం ఏకకాలంలో ఏసీబీ సోదాలు కొనసాగాయి. ఏసీబీ నల్లగొండ జిల్లా రేంజ్ డీఎస్పీ జగదీష్ చంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట సమీపంలోని ఓ కాంట్రాక్టర్‌కు ఆలయంలో లడ్డూ ప్రసాదాల యంత్రాల మరమ్మతుకు సంబంధించి రూ.11.50 లక్షల బిల్లులు రావాల్సి ఉంది. వాటి మంజూరు కోసం ఆలయ ఇన్‌చార్జి ఎస్ఈ ఊడెపు వెంకట రామారావును సంప్రదించగా, ఆయన 20శాతం కమీషన్ డిమాండ్ చేశారు. సదరు కాంట్రాక్టర్ రూ.1.90లక్షలు లంచం ఇచ్చేందుకు అంగీకరించి ఆధారాలతో ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని బోడుప్పల్ వద్ద కాంట్రాక్టర్ నుంచి వెంకట రామారావు నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం రామారావును యాదిగిరిగుట్టలోని ఈఈ కార్యాలయానికి తీసుకువచ్చి అర్ధరాత్రి వరకు సోదాలు నిర్వహించామని డీఎస్పీ జగదీశ్ చంద్ర తెలిపారు.

నెయ్యి కాంట్రాక్టర్లకు చిన్న అప్పన్న బెదిరింపులు!!


- నిర్ధారించుకున్నాకే జూన్‌లో వైవీ సుబ్బారెడ్డి పీఏకి నోటీసు

తిరుపతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమలేశుడి లడ్డూప్రసాదం తయారీ కోసం కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో బుధవారం అరెస్టయిన టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సన్నిహిత అనుచరుడు కడూరు చిన్న అప్పన్న పాత్రపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లోతుగా దర్యాప్తు చేస్తోంది. టీటీడీకి నెయ్యి సరఫరా చేసిన డెయిరీల నుంచి అతడు కమీషన్లు దండుకున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలో వైవీ వ్యవహారాలు చక్కబెట్టే క్రమంలో చిన్న అప్పన్న 2022 నుంచి 2024 ఎన్నికల దాకా నెయ్యి సరఫరా కాంట్రాక్టు వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నట్లు సిట్ గుర్తించింది. 2022లో టీటీడీ మార్కెటింగ్ విభాగం కీలక అధికారి నుంచి నెయ్యి సరఫరా చేస్తున్న డెయిరీల జాబితా, ధరల వివరాల వంటివి అతడు సేకరించినట్లు నిర్ధారించింది. భోలేబాబా డెయిరీ, ప్రీమియం డెయిరీ దాకా టీటీడీకి నెయ్యి సరఫరా చేసే అన్ని డెయిరీల ప్రతినిధులతో చర్చించినట్లు పసిగట్టింది. వారితో ఫోన్లో, నేరుగా పలు దఫాలుగా మాట్లాడి కమీషన్ల కోసం ఒత్తిడి చేశాడని, మాట వినకుంటే కాంట్రాక్టులు రద్దు చేయిస్తానంటూ బెదిరించాడని విశ్వసనీయంగా తెలిసింది. ఆయా డెయిరీల నుంచీ హవాలా మార్గంలో కమీషన్లను అందుకున్నట్టు తెలిసింది. వీటన్నింటినీ నిర్ధారించుకున్న తర్వాతే సిట్ అధికారులు చిన్న అప్పన్నకు నోటీసులు జారీ చేసి గత జూన్‌లోనే తొలి విడత విచారించారు. అతడి అరెస్టును అడ్డుకునేందుకు వైవీ సుబ్బారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆయనకు అనుకూలంగా తీర్పురావడంతో ప్రభుత్వం సుప్రీంను ఆశ్రయించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో దర్యాప్తు పునఃప్రారంభమైన వెంటనే చిన్న అప్పన్నను అరెస్టు చేయడం గమనార్హం.

కార్గో క్యాబిన్‌లో రెండో డ్రైవర్ నిద్ర

- కర్నూలు బస్సు ప్రమాదంపై విచారణలో ఆసక్తికర అంశాలు

కర్నూలు/న్యూఢిల్లీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాదం ఘటనపై విచారణ చేస్తున్న పోలీసులకు పలు ఆసక్తికర అంశాలు తెలుస్తున్నాయి. వి.కావేరీ ట్రావెల్ బస్సు మంటల్లో చిక్కుకున్న సమయంలో రెండో డ్రైవర్ శివనారాయణ బస్సు కింది భాగంలోని కార్గో క్యాబిన్‌లో నిద్రిస్తున్నట్టు తెలిసింది. పోలీసుల విచారణలో రెండో డ్రైవర్ పలు ఆసక్తి విషయాలు వెల్లడించాడు. ప్రమాద సమయంలో తాను కార్గో క్యాబిన్‌లో గాఢనిద్రలో ఉన్నట్టు, భారీ శబ్దం రావడంతో మెలుకువ వచ్చినట్లు చెప్పాడు. ముందుభాగంలో మంటలు చెలరేగిన సమయంలో కంగారుగా డ్రైవర్ లక్ష్మయ్య తన వద్దకు వచ్చినట్లు తెలిపాడు. బస్సు కుడివైపు అద్దాలు పగులకొట్టి కొంతమంది ప్రయాణికులను బయటకు లాగామని వెల్లడించాడు. ఇతరులతో కలసి తాము చేసిన ప్రయత్నం వల్లే 27 మంది ప్రయాణికులు ప్రాణాలతో బయట పడ్డారన్నాడు. ప్రమాదంలో మృతి చెందిన 19 మంది కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన నలుగురికి రూ. 50 వేల చొప్పున వి.కావేరి ట్రావెల్స్ యాజమాన్యం ఆర్థిక సాయం అందజేసింది. ఈ మేరకు రూ. 40 లక్షల చెక్‌ను ఆ ట్రావెల్ సంస్థ ప్రతినిధులు జిల్లా కలెక్టరేట్‌లో గురువారం రాష్ట్ర మంత్రి టీజీ భరత్‌కు అందజేశారు.



నారాయణ విద్యాసంస్థల్లో 'మాస్టర్ ఆరేటర్ కాంటెస్ట్'

హైదరాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచనలు అభివృద్ధి చేయడం లక్ష్యంగా తమ విద్యార్థులకు 6వ 'మాస్టర్ ఆరేటర్ కాంటెస్ట్' పోటీలు తెలంగాణలో విజయవంతంగా నిర్వహించామని నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తమ పాఠశాలల్లో 1-9వ తరగతుల విద్యార్థులకు గత జూలైలో ప్రారంభించిన ఈ పోటీలు ఇటీవలే ముగిశాయని, ఇతర రాష్ట్రాల్లో కొనసాగుతున్నాయని విద్యాసంస్థల డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'నేను జంతువులతో మాట్లాడగలిగితే', 'నేను సూపర్ హీరో అయితే', 'ప్రపంచంలో నేను మార్చాలనుకునే ఒక విషయం' వంటి ఆలోచనాత్మక అంశాలపై ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యార్థులు ప్రసంగించారని వారు పేర్కొన్నారు. గుణాత్మక విద్య, లింగ సమానత్వం, ఆరోగ్యం-శ్రేయస్సు, కాలుష్య నియంత్రణ వంటి సామాజిక అంశాలపై 8, 9వ తరగతుల విద్యార్థులు మాట్లాడారని, విజేతలకు బహుమతులు ప్రదానం చేశామని డైరెక్టర్లు తెలిపారు.

ప్రాణ నష్టం జరగొద్దు

వర్షాలు, వరదలతో జాగ్రత్త.. పంటలకు నష్టం వాటిల్లకుండా చూడాలి

- 24 గంటలూ సమీక్షించాలి
- కలెక్టర్లు ఎప్పటికప్పుడు మంత్రులకు సమాచారం ఇవ్వాలి
- అధికారుల సెలవులు రద్దు చేయండి
- వరంగల్‌తో పాటు ప్రభావం ఎక్కువగా ఉన్న చోట హైడ్రా సేవలు వాడుకోండి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



వర్షాలపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి తుమ్మల, సీఎస్ రామకృష్ణ, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాణ నష్టం జరగకుండా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆ దిశగా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్న జిల్లాల్లో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్లు, ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాలు, వరదల వల్ల ప్రధానంగా వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని మంత్రులు, కలెక్టర్లు సీఎంకు తెలిపారు. ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాలతో పాటు హుస్నాబాద్ నియోజకవర్గంలో వరద నష్టం ఎక్కువగా ఉందని చెప్పారు. సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తుపాను నేపథ్యంలో ప్రాణ నష్టం జరగకుండా చూడాలన్నారు. పశువుల రక్షణకూ చర్యలు చేపట్టాలని సూచించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, గ్రామాలు, కాలనీల్లో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టర్లు 24 గంటలూ పరిస్థితులను సమీక్షించడంతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.

రైతులకు నష్టం.. బాధగా ఉంది..

అనుకోని ఉపద్రవంతో రైతులకు తీరని నష్టం కలుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వర్షంతో చాలా చోట్ల ధాన్యం తడిసిపోయిందని, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొట్టుకుపోవడం ఆందోళన కలిగించిందని అన్నారు. కళ్లాల్లో, ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే దగ్గర్లోని గోదాములు, మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. మిల్లులు, గోదాములు లేని చోట సమీపంలోని ఫంక్షన్ హాళ్లలో నిల్వ చేయాలని సూచించారు. వర్షాలకు ధాన్యం తడవకుండా చూడాలని, అవసరమైన మేరకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ప్రతి కొనుగోలు కేంద్రానికీ ఇన్‌చార్జి అధికారిని నియమించాలన్నారు. ఇప్పుడున్నవారు నిర్లక్ష్యంగా ఉంటే వెంటనే వేరే వాళ్లను నియమించాలని సూచించారు. ప్రతి ఐకేపీ సెంటర్ నుంచి రోజూ సాయంత్రం నివేదిక తెప్పించుకోవాలని, అలా ఇవ్వని అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. అధికారులు, ఉద్యోగుల సెలవులు రద్దు చేసి.. అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించేలా, ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటే.. పౌరసరఫరాల శాఖ కమిషనర్ వెంటనే సీఎస్ దృష్టికి తీసుకురావాలన్నారు. వరద తగ్గిన తర్వాత అధికారులు అన్ని రకాల నష్టం అంచనాలను తయారు చేయాలని ఆదేశించారు. ఈసారి 80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, అందుకు తగ్గట్లుగా పౌరసరఫరాల శాఖ చర్యలు చేపట్టాలని చెప్పారు.

వరంగల్‌లో హైడ్రా సేవలు..

వరంగల్‌లో తుపాను ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పోలీసులతో పాటు అవసరమైతే హైదరాబాద్ నుంచి హైడ్రా బృందాలను, అవసరమైన సామగ్రిని పంపించాలని సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డిని సీఎం ఆదేశించారు. వరంగల్‌లో తక్షణ సహాయక చర్యలకు అవసరమైన పడవలను అక్కడికి పంపించాలని, వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని తక్షణమే తరలించాలని చెప్పారు. సహాయ శిబిరాలను ఏర్పాటు చేయాలని, వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. ఎక్కడైనా వరదల్లో చిక్కుకొని మిద్దెలపైకి చేరిన వారికి డ్రోన్ల ద్వారా తాగునీరు, ఆహార పొట్లాలను పంపిణీ చేయాలని సూచించారు. వరంగల్‌లో 24 గంటలూ పరిస్థితిని పర్యవేక్షించేందుకు వీలుగా కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలోనూ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి వరదలు, విపత్తులు వచ్చినప్పుడు వెంటనే స్పందించాలని చెప్పారు. కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, పొన్నం, ఉత్తమ్, కోమటిరెడ్డి, కొండా సురేఖ, వాకిటి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏరియల్ సర్వే..

వరద ప్రభావిత వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలిస్తారు. వరంగల్ నగరంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తారు. బాధితులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలిస్తారు. మధ్యాహ్నం హనుమకొండ కలెక్టరేట్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షించనున్నారు.

మంత్రులు పరిస్థితులను సమీక్షించాలి..

తుపాను, వర్షాల ప్రభావం ఉన్న జిల్లాల్లో చేపడుతున్న సహాయక చర్యలు, రహదారుల పునరుద్ధరణ, ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు సమీక్షించాలని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. మంత్రులు సొంత జిల్లాల్లో అందుబాటులో ఉంటూనే.. ఇన్‌చార్జిగా ఉన్న జిల్లాల ప్రజలను ఆదుకునే చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని చెప్పారు. రాష్ట్రంలోని 16 జిల్లాలపై తుపాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిందని సీఎం గుర్తుచేశారు. విద్యుత్తు శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఖమ్మం జిల్లాలో ఒక డీసీఎం వ్యాన్, డ్రైవర్ వాగులో కొట్టుకుపోవడం దురదృష్టకరమన్నారు. అన్ని రహదారులపై ఉన్న వంతెనలు, లో లెవల్ కాజ్ వేలు, కల్వర్టుల వద్ద అప్రమత్తంగా ఉంటే ఇలాంటి ఘటనలను నివారించవచ్చని రేవంత్ పేర్కొన్నారు. రహదారులపైకి వరద చేరే ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాలు అటువైపు వెళ్లకుండా పోలీసులు నిషేధాజ్ఞలు అమలు చేయాలన్నారు. వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

మంత్రిగా అజారుద్దీన్.. ప్రమాణం నేడే



(మొదటిపేజీ తరువాయి)

పాయల శంకర్, మర్రి శశిధర్‌రెడ్డి, కె.ఆంథోనిరెడ్డిలు గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అజారుద్దీన్ గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారని.. ఇప్పుడు ఆయనకు మంత్రి పదవి ఇవ్వడమంటే ఒక వర్గం ఓటర్లను ప్రభావితం చేయడమేనని తెలిపారు. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. ఈ ఫిర్యాదును సుదర్శన్‌రెడ్డి ఈసీ పరిశీలన కోసం పంపారు. అయితే, ఈ ఫిర్యాదును ఈసీ డిస్మిస్ చేయడం లాంఛనమేనని, అజర్ ప్రమాణ స్వీకారం యథాతథంగా జరుగుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

అందుకే అజర్‌కు మంత్రి పదవి: కేటీఆర్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ ఆపద మొక్కులు మొక్కుతోందని, అక్కడ గెలవాలనే మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రజల్లో తమ పరిస్థితి ఏమిటో వారికి అర్థమైందని, పూర్తిగా దిగజారిన పార్టీ పరువును కాపాడుకోవడానికి కాంగ్రెస్ అడ్డగోలు ప్రయత్నాలు చేస్తోందని ఎక్స్‌లో ఆరోపించారు. ఉప ఎన్నిక కోసం సినీ కార్మికులకు అడ్డగోలు వాగ్దానాలు చేయడం, అజారుద్దీన్‌ను క్యాబినెట్‌లోకి తీసుకోవడం, ఎన్నడూ లేనివిధంగా మంత్రులు హైదరాబాద్ వీధుల్లో హడావుడిగా తిరగడం వంటివి ఆ పార్టీ తీవ్ర ఒత్తిడిలో ఉందనేందుకు నిదర్శనమని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజలు కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోయేలా చేస్తేనే.. 2023లో వారిచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 వాగ్దానాలను అమలు చేయడం ప్రారంభిస్తుందని కేటీఆర్ అన్నారు.

అజర్‌కు మంత్రి పదవా?: కిషన్‌రెడ్డి

'కాంగ్రెస్ నేత అజారుద్దీన్ వివిధ కేసుల్లో నిందితుడు. ఆయనకు ఏ ప్రాతిపదికన మంత్రి పదవి ఇస్తారు' అని సీఎం రేవంత్‌ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన అజర్‌ను ఇప్పుడు హడావుడిగా మంత్రిని చేయాలని నిర్ణయించారన్నారు. '22 నెలలుగా మంత్రివర్గంలో మైనారిటీ నేత ఒక్కరు కూడా లేరు. నిజంగా మైనారిటీల సంక్షేమంపై శ్రద్ధ ఉంటే అజర్‌కు ముందే అవకాశం ఇచ్చేవారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు మంత్రి పదవి ఇవ్వడం చట్ట విరుద్ధం. కాంగ్రెస్ పార్టీ ఇంతగా దిగజారింది' అని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు.

ముందు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలివ్వండి

- 1లోపు 900 కోట్లు విడుదల చేయాలి
- తర్వాతే విజిలెన్స్ విచారణకు సహకరిస్తాం
- ప్రైవేటు కాలేజీ యాజమాన్య సంఘాలు
- విజిలెన్స్ దాడులు దుర్మార్గం: సంజయ్

హైదరాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసిన తర్వాతే విజిలెన్స్ విచారణ నిర్వహించాలని తెలంగాణ ప్రైవేటు కాలేజీల యాజమాన్య సంఘాల సమాఖ్య(ఫాతీ) ప్రభుత్వాన్ని కోరింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందుతున్న అన్ని ఉన్నత విద్యాసంస్థల్లో ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించడంపై ఫాతీ గురువారం అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించింది. బకాయిల కోసం సమ్మె ప్రకటించిన తర్వాత ప్రభుత్వం విచారణకు ఆదేశించడం కక్ష సాధింపుగా పరిగణిస్తున్నామని ఫాతీ అధ్యక్షుడు నిమ్మగడ్డ రమేష్ బాబు చెప్పారు. ప్రభుత్వం దసరాకు ముందు ఇచ్చిన హామీ మేరకు నవంబరు-1 లోపు రూ.900 కోట్లు విడుదల చేయాలని, లేనిపక్షంలో నవంబరు-3 నుంచి అన్ని ప్రైవేటు వృత్తివిద్యా కాలేజీలు నిరవధిక సమ్మెలో పాల్గొంటాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే కాలేజీలపై విజిలెన్స్ దాడులు చేయించడం దుర్మార్గమని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. నాలుగేళ్లుగా ఫీజు బకాయిలు చెల్లించకపోతే విద్యా సంస్థలు ఎలా నడుస్తాయని ఆయన ప్రశ్నించారు. ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో 15 లక్షల మంది విద్యార్థులు అల్లాడుతున్నా సోయి లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు.

బకాయిలు చెల్లించమంటే దాడులా?

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్న ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలపై విజిలెన్స్ దాడులను ఏఐఎస్ఎఫ్ తప్పుబట్టింది. పెండింగ్‌లో ఉన్న 8వేల కోట్ల బకాయిలు చెల్లించిన తరువాతే తనిఖీలు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డిమాండ్ చేశారు.

'రూ.2 కోట్ల డీల్' ఎస్సై సస్పెన్షన్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆర్థిక మోసం కేసులో నిందితుడితో రూ.2 కోట్ల డీల్ కుదుర్చుకుని అతడిని వదలేసిన ఎస్సై శ్రీకాంత్ గౌడ్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు సీపీ సజ్జనార్ ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా ఎస్సై వదిలేసిన ఆర్థిక నేరగాడు ఉప్పలపాటి సతీశ్‌ను అరెస్ట్ చేసేందుకు 5 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. సతీశ్ షెల్ కంపెనీలు ఏర్పాటు చేసి పలువురిని నమ్మించి రూ.336 కోట్ల వరకు వసూలు చేశాడు. అతనిపై 2021లో సీసీఎస్ ఆర్థిక నేరాల విభాగంలో కేసు నమోదైంది. సతీశ్, అతని భార్య శిల్ప ముంబైలోని అంధేరి ప్రాంతంలో ఉంటున్నట్లు గుర్తించారు. అతన్ని అరెస్ట్ చేసేందుకు టాస్క్‌ఫోర్స్ ఎస్సై శ్రీకాంత్ గౌడ్ నేతృత్వంలో బృందాన్ని పంపారు. సతీశ్‌ను తీసుకొస్తున్న క్రమంలో అతనితో శ్రీకాంత్ గౌడ్ డీల్ కుదుర్చుకుని వదిలేశాడు.

మజ్లిస్ పార్టీ ఓ చీడపురుగు

జూబ్లీహిల్స్‌లో తన అభ్యర్థిని కాంగ్రెస్‌కు అద్దెకిచ్చింది.. ఎవరి ఒత్తిళ్లు, సూట్‌కేసులకు తలొగ్గింది?

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం
- అక్రమ కబేళాలపై చర్యల్లేవని విమర్శ

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మజ్లిస్ పార్టీ తెలంగాణకు, దేశానికి పట్టిన చీడపురుగు అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రజాకార్ల వారసత్వాన్ని మోస్తున్న ఆ పార్టీ హిందువుల మనోభావాలతో చెలగాటమాడుతోందని, హైదరాబాద్‌లో రాజ్యాంగేతర శక్తిగా ఎదుగుతోందని ఆరోపించారు. 'జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎందుకు పోటీ చేయడం లేదు? ఎవరి ఒత్తిళ్లతో, ఎవరి సూట్‌కేసులకు తలొగ్గి మీ అభ్యర్థిని కాంగ్రెస్‌కు అద్దెకిచ్చారు' అని మజ్లిస్‌ను ప్రశ్నించారు. కుహనా లౌకికవాదం, బుజ్జగింపు రాజకీయాలతో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు మజ్లిస్‌కు రక్షణ కవచంగా నిలుస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగైపోయిందన్నారు. బీఆర్ఎస్ ఫాంహౌస్‌కే పరిమితమైందని, ఆ విషయం ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికలతో తేలిపోయిందన్నారు.



ప్రచారంలో బియ్యంలో రాళ్లు తీస్తున్న చింతల రాంచంద్రారెడ్డి. చిత్రంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అక్రమ కబేళాలపై చర్యలేవీ?

తెలంగాణ ప్రభుత్వం గోరక్షణ చట్టాలను అమలు చేయాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. 'అటవీ ప్రాంతాల్లో అక్రమ కబేళాలు నడుస్తున్నాయి. హైదరాబాద్‌లో న్యూ బోయిగూడ, గోల్నాక ప్రాంతాల్లో కూడా కొనసాగుతున్నాయి. వాటిని మూసివేయించాలి. తెలంగాణలోని 39 అక్రమ కబేళాలపై నేను గతంలో సీఎం, సీఎస్‌లకు లేఖలు రాశా. ఇప్పటివరకు వాటిపై ఏ చర్యలు తీసుకున్నారో వెల్లడించాలి' అని కోరారు. గోవుల అక్రమ రవాణా మాఫియాకు మజ్లిస్ అండగా ఉందని ఆరోపించారు. అక్రమ కబేళాలు నడుపుతున్న ఇబ్రహీం ఖురేషీపై ఛత్తీస్‌గఢ్‌లో కూడా కేసులు నమోదయ్యాయన్నారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో అతనికి సన్నిహిత సంబంధాలున్నట్లు మజ్లిస్ మద్దతుదారులే చెబుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు కూడా అక్రమ కబేళాల్లో భాగస్వాములేనని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

'జూబ్లీహిల్స్' గెలుపు బాధ్యత కిషన్‌రెడ్డిపైనే?

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిని గెలిపించుకునే బాధ్యత కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిపై పడిందా? ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోనే జూబ్లీహిల్స్ సెగ్మెంట్ ఉండటంతో ఆయనపైనే భారం వేస్తున్నారా? కొంతమంది సీనియర్ నాయకుల నర్మగర్భ వ్యాఖ్యల అంతరార్థం ఇదేనా?.. ఈ ప్రశ్నలకు బీజేపీ వర్గాలు అవుననే సమాధానమే ఇస్తున్నాయి. సిట్టింగ్ ఎంపీగా, కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి ఈ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు. ఇందుకు అనుగుణంగానే ఆయన విస్తృతంగా ప్రచారంలో పాల్గొంటున్నారని అంటున్నారు. మూడు నెలల కిందటే జాతీయ నాయకత్వం కిషన్‌రెడ్డికి రాష్ట్ర పార్టీ సారథ్య బాధ్యతల నుంచి ఉపశమనం కలిగించినా.. ఇప్పుడీ ఉప ఎన్నిక కొత్త సవాల్‌ను తెచ్చిపెట్టిందని అభిప్రాయపడుతున్నారు. పార్టీ అభ్యర్థి దీపక్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా 'జూబ్లీహిల్స్.. కిషన్‌రెడ్డి అడ్డా.. ఆయన నాయకత్వంలో బీజేపీని గెలిపించుకుంటారు..' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తున్నారు. మరోవైపు ఉప ఎన్నికలో ప్రభావం చాటేందుకు కిషన్‌రెడ్డి శ్రమిస్తున్నారు. స్థానిక కేడర్‌తో వరుస సమావేశాలు, ఇంటింటి ప్రచారంలో నిమగ్నమయ్యారు. రెండు రోజుల కింద జరిగిన కేంద్ర కేబినెట్ భేటీకి కూడా వెళ్లలేదు. ఎంపీ అర్వింద్ కూడా జూబ్లీహిల్స్‌లో బీజేపీ గెలుపుపై ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. మరోవైపు ఈ ఉప ఎన్నికలో బీజేపీ ఎన్ని ఓట్లతో ఓడిపోతోందో చెప్పాలని కిషన్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు కూడా పార్టీ వర్గాల్లో చర్చకు దారితీశాయి.



ఉచిత విద్యుత్తు అని బిల్లులేస్తున్నారేం వృద్ధులకు ఇస్తానన్న 4వేలు ఎక్కడ?

- ప్రచారంలో మంత్రి జూపల్లిని నిలదీసిన వృద్ధురాలు

ఎర్రగడ్డ, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో మంత్రి జూపల్లి కృష్ణారావుకు చేదు అనుభవం ఎదురైంది. ఎర్రగడ్డ డివిజన్లో ప్రచారం నిర్వహిస్తుండగా ఓ వృద్ధురాలు మంత్రిని నిలదీసింది. రేవంత్ ముఖ్యమంత్రి అయ్యాక పేదలకు ఏం చేశారని అడిగింది. వయోవృద్ధులకు 4వేలు ఇస్తానని హామీ ఇచ్చారు కదా.. అవెక్కడని ప్రశ్నించింది. ఉచితవిద్యుత్తు అన్నవారు బిల్లులు ఎందుకు వేస్తున్నారని అడిగింది. మంత్రి మాట్లాడేందుకు ప్రయత్నిస్తుండగా 'నాకు వినేఓపిక లేదు. వాగ్దానాలు నెరవేర్చకుండా మళ్లీఓట్లు అడగడానికి వచ్చారని' ఆమె మండిపడింది.

కాళేశ్వరం డిస్ట్రిబ్యూటరీల అంచనాల సవరణకు ఆమోదం

దేవాదుల మూడో దశలో రామప్ప చెరువు నుంచి ధర్మసాగర్ టన్నెల్‌కు అంగీకారం

హైదరాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం పరిధిలోని కొండ పోచమ్మ సాగర్ కింద రామాయంపేట కెనాల్‌తోపాటు 41వేల ఎకరాలకు సాగునీరందించే డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ సవరణ అంచనాలకు నీటిపారుదలశాఖ రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో రామాయంపేట కెనాల్ కింద 12,978ఎకరాలకు సాగునీరందించే ఉప్పరపల్లి బ్రాంచ్ కెనాల్ సవరణ అంచనాలను ఆమోదించారు. ముక్తేశ్వర్ (చిన్న కాళేశ్వరం) ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు 2027 ఆగస్టు 31 వరకూ గడువు పొడిగిస్తూ సమావేశం ఆమోదం తెలిపింది. దేవాదుల మూడో దశలో రామప్ప చెరువు నుంచి ధర్మసాగర్ చెరువు టన్నెల్ నిర్మాణానికి అంగీకరించింది. డిసెంబర్‌కల్లా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని వట్టెం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ బండ్ నిర్మాణం, వచ్చే ఏడాది జూలై నెలాఖరుకల్లా కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో సింగోటం రిజర్వాయర్ నుంచి గుడిపల్లిగట్టు బ్యాలెన్సింగ్ కెనాల్ పనులు, 70 వేల ఎకరాలకు నీటిని అందించే డిస్ట్రిబ్యూటరీ పనులతోపాటు ఫీల్డ్ ఛానల్ పనుల పూర్తికి గడువు ఇచ్చారు. ఇంకా పలు పనులను పూర్తి చేయడానికి గడువునిస్తూ స్టాండింగ్ కమిటీ నిర్ణయాలు తీసుకుంది.


హనుమకొండ హంటర్ రోడ్ భద్రకాళి బండ్ జంక్షన్ నుంచి సంతోషి మాత దేవాలయం వరకు నీట మునిగిన కాలనీలు



భట్టుపల్లి రోడ్ మైసయ్యనగర్ లో చిక్కుకున్న ప్రజలను ఒడ్డుకు చేరుస్తున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు

కన్నీటి ధారలు

డ్రైనేజీ పాలైన ఓ మహిళా రైతు 150 క్వింటాళ్ల వడ్లు

- లోపలికి దిగి గంపతో వడ్లు ఎత్తిపోసిన రైతు తారవ్వ
- సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మార్కెట్ యార్డులో ఘటన
- తనను ఆదుకోవాలని కలెక్టర్ కాళ్లమీద పడి విజ్ఞప్తి
- రాష్ట్రవ్యాప్తంగా రైతులది తారవ్వలాంటి పరిస్థితే


మైసయ్యనగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ


డ్రైనేజీలోంచి ధాన్యం ఎత్తుతున్న మహిళా రైతు తారవ్వ

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఎక్కడెక్కడ ఎన్నెన్ని అప్పులు చేసిందో.. ఎంత పెట్టుబడి పెట్టిందో పాపం.. ఆ మహిళా రైతు ఆరుగాలం పడిన కష్టమంతా వరదపాలైంది. కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యమంతా వర్షపు నీటి వరదలో కొట్టుకుపోయి డ్రైనేజీ పాలైంది. దిక్కుతోచని స్థితిలో తానే ఆ మోరీలోకి దిగి బిగ్గరగా రోదిస్తూ నీళ్లలో ముంచి గంపలతో ధాన్యాన్ని పైకెత్తి పోసింది! అర క్వింటానా.. క్వింటానా? కొట్టుకుపోయింది దాదాపు 150 క్వింటాళ్ల ధాన్యం! తాను ఆ మోరీ లోంచి ఎంత ధాన్యమని ఎత్తిపోయగలదు? అయినా.. ఆగని తన కన్నీటి ధార తరహాలోనే మోరీ నీళ్లలోకి గంప ముంచడం.. వడ్లను ఆమె ఎత్తిపోయడం ఆగడం లేదు!! సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లోని వ్యవసాయ మార్కెట్‌లో కేడిన తారవ్వ అనే రైతును ఇలా చూసిన వారి గుండెలు ద్రవించాయి. రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన వడ్లన్నీ నీటిపాలయ్యాయంటూ నష్ట పరిశీలనకు వచ్చిన సిద్దిపేట కలెక్టర్ హైమావతి కాళ్లపై పడి తారవ్వ బోరున విలపించింది. 150 క్వింటాళ్ల ధాన్యం మొత్తం కొట్టుకుపోయిందని.. రూ. 2.50 లక్షల పెట్టుబడి మట్టిపాలైందని రోదించింది.. 15 రోజుల క్రితం అల్లుడు చనిపోయాడని, ఇప్పుడు పండించిన పంట కూడా వరదపాలైందని.. తనను సర్కారు ఆదుకోవాలంటూ ఆమె వేడ కుంది. మార్కెట్‌యార్డుకు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్, తారవ్వను ఓదార్చారు. తక్షణసాయం కింద ఆమెకు రూ.10వేలు అందజేశారు. జిల్లెలగడ్డకు చెందిన లావుడ్య నీలా అనే మహిళా రైతు.. తాను ఆరు ఎకరాల్లో పండించిన పంటంతా వరదలో కొట్టుకపోయిందని కన్నీరుమున్నీరైంది. కొందరు రైతులు డ్రైనేజీలో కొట్టుకపోయిన ధాన్యాన్ని జేసీబీతో ఎత్తుకున్నారు. మార్కెట్ యార్డులో ఏ రైతును కదిలించినా ఇలా హృదయవిదారక దృశ్యాలే కనిపించాయి. రాష్ట్రవ్యాప్తంగా రైతుల పరిస్థితి దాదాపు తారవ్వ మాదిరిగానే ఉంది. కొనుగోలు కేంద్రాల్లో, రోడ్లపైన ఆరబెట్టిన ధాన్యం వరదపాలవ్వడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం శ్రీశైలం డ్యాం వెనుక వైపున మత్స్యకారుల కాలనీ దారిపై కొండచరియలు విరిగిపడ్డాయి. శ్రీశైలం-హైదరాబాద్ హైవేలో నాగర్‌కర్నూల్ జిల్లా డిండి ప్రాజెక్టు వద్ద బ్రిడ్జి 500 అడుగుల మేర కోతకు గురైంది.

ముంపులో వరంగల్, హనుమకొండ

ఉమ్మడి వరంగల్ జిల్లాను మరోసారి వరద ఉక్కిరిబిక్కిరిచేసింది. ప్రధానంగా వరంగల్, హనుమకొండ, కాజీపేటలో ఇళ్లు ఇంకా వరద ముంపులోనే ఉన్నాయి. హనుమకొండ ఇందిరాగనర్ లోని 500 ఇళ్లను చుట్టుముట్టిన వరద అలాగే ఉంది. కొందరు పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లగా.. ఇంకొందరు ఇంటి డాబాల మీదే ఉండిపోయారు. తిండి, తాగడానికి కనీసం మంచినీళ్లయినా దొరక్క ఇబ్బంది పడ్డారు. వరంగల్ ఎస్‌ఆర్ నగర్, సాయినగర్, మధురానగర్, వీవర్స్ కాలనీ, ఎంహెచ్‌నగర్ తదితర కాలనీల్లో వరద నీరు తగ్గలేదు. ఖమ్మం జిల్లా మున్నేరు వాగు పరీవాహక ప్రాంతంలోని గ్రామాలు, కాలనీల్లోకి వరద నీరు చేరడంతో అక్కడి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. మున్నేరు ఉధృతికి ఆటోనగర్ పరిధిలోని 200 వాహనాల రిపేరు షాపుల్లోంని కార్లు నీట మునిగాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో భారీ వర్షానికి రోడ్లు వాగులను తలపించాయి. ప్రధాన రహదారికి రెండువైపుల ఉన్న దుకాణాల్లోకి వరద నీరు చేరింది. కిరాణాషాపుల్లోని సరుకులు అక్కరకు రాకుండాపోయాయి. వస్త్రదుకాణాల్లోని బట్టలు పాడయ్యాయి. ఓరుగంటి వెంకటరెడ్డి అనే ఎరువుల వ్యాపారికి చెందిన 400 యూరియా బస్తాలు వరదనీటితో తడిసిపోయాయి. పట్టణంలోని రోడ్లు కోతకు గురై ఇసుకమేటలు పెట్టాయి. నెహ్రూ రోడ్డు పక్క కాలనీల్లో ఇళ్ళలోకి నీరు చేరింది. సెల్లార్లలో నీటిని మోటార్లతో ఎత్తిపోశారు.

విషాదాలు

సిద్దిపేట జిల్లాలోని అక్కన్నపేట మండలం మోత్కులపల్లె వాగు దాటుతూ బైక్‌పై వెళుతున్న భార్యాభర్తలు ప్రవాహంలో కొట్టుకుపోయారు. దంపతులను ఇసంపల్లి ప్రణయ్, కల్పనగా గుర్తించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వరంగల్ ఎస్‌ఆర్ నగర్‌లో ఇంట్లోకి వరద నీరు చేరడంతో అనారోగ్యంతో కదల్లేని స్థితిలో ఉన్న ఆడెపు కృష్ణమూర్తి (75) అనే వృద్ధుడు పడుకున్న మంచం నీళ్లలో మునిగింది. ఆ నీటిలోనే మునిగి కృష్ణమూర్తి మృతిచెందారు. ఇంట్లో ఆయన ఒక్కరే ఉంటున్నారు. మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లి సమీపంలోని మెట్లతండా వద్ద జంపన్నవాగులో రెడ్యాలకు చెందిన పులిగుజ్జు సంపత్ (30) అనే వ్యక్తి గల్లంతై మృతిచెందాడు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం కోనాయిచలం వద్ద బోళ్ల మత్తడి వాగు ఉధృతికి బైక్‌పై వెళుతున్న బక్క శ్రావ్య (18), శివకుమార్ అనే ప్రేమ జంట కొట్టుకుపోయింది. శ్రావ్య గల్లంతైంది. శివకుమార్ ఈదుకుంటూ బయటకొచ్చాడు. వరంగల్ జిల్లా గీసుకొండ సమీపంలోని ఓ మోరీలో అనిల్ కుమార్ (30) అనే వ్యక్తి మృతదేహం లభ్యమైంది. వరంగల్ జిల్లా గూడూరు మండలం గాజులగుట్టలో గోడ కూలి కోల రామక్క (65) అనే మహిళ మృతిచెందింది. రంగారెడ్డి జిల్లా బాటసింగారం వద్ద వాగులో బైక్‌పై వెళుతూ కృష్ణవేణి (44) అనే అంగన్‌వాడీ టీచర్ కొట్టుకుపోయి మృతిచెందింది. వరంగల్ జిల్లా ధర్మాసాగర్ మండలం ముప్పారంలో రెండు ఆవులు, ఒక గేదె మృతిచెందాయి. జనగామ జిల్లా వెల్దెండలో మేతకు వెళ్లిన 110 గొర్రెలు వరదలో కొట్టుకుపోయాయి. జిల్లాలోని రఘునాథపాలెంలో ఓ ఎద్దు మృతిచెందింది. మహబూబాద్ జిల్లా గూడురులో 58 గొర్రెలు మృతిచెందాయి.


ఖమ్మం జిల్లాలో జలమయమైన వెంకటేశ్వరనగర్


ఖమ్మం పట్టణంలోని ఆటోనగర్‌లో మునిగిన కార్లు


హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం కొత్తకొండ మల్లారం మధ్యలో గండి పడిన ప్రధాన రహదారి

తుఫాను సహాయక చర్యలకు విపత్తు నిధిని వాడుకోండి

- నిధులకు ఎలాంటి ఇబ్బంది లేదు: భట్టి విక్రమార్క



హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నేపథ్యంలో సహాయ, పునరావాస చర్యల కోసం రాష్ట్ర విపత్తుల సహాయ నిధి(ఎస్‌డీఆర్ఎఫ్)ని వాడుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. తుఫాను పరిస్థితులపై గురువారం ఆయన ప్రజాభవన్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుత అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో ఎస్‌డీఆర్ఎఫ్‌ను ముందుగా వినియోగించుకుని, ఆ తర్వాత 30 రోజుల్లో నిధులకు ఆమోదం తీసుకోవచ్చని సూచించారు. నిధులకు సంబంధించి ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం 48 గంటలు ముందుగానే రాష్ట్ర ప్రజలను అప్రమత్తం చేయడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగామన్నారు. తుఫాను మాన్యువల్ ప్రకారం.. సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలన్నారు. పత్తి తడవకుండా టార్పాలిన్లు కప్పడం, గోదాముల్లోకి పత్తిని తరలించడం వంటి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తుఫాను కారణంగా ఎక్కడా విద్యుత్తు సమస్య తలెత్తకుండా మొబైల్ వ్యాన్ల ద్వారా విద్యుత్తు సిబ్బంది రకరకాల సేవలు అందించారని ప్రశంసించారు. తుఫాను వల్ల 33/11 కె.వి. సబ్ స్టేషన్లు 11 దెబ్బతినగా.. వాటిలో ఏడింటిని పునరుద్ధరించడం జరిగిందని, మిగతా నాలుగింటిని త్వరలో పునరుద్ధరిస్తారన్నారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 171 దెబ్బతినగా.. 49 ప్రాంతాల్లో పునరుద్ధరించారని, మరో 122 ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయన్నారు.

రోడ్లకు రూ.225 కోట్ల నష్టం: మంత్రి కోమటిరెడ్డి

'మొంథా' తుఫాను ప్రభావంతో రాష్ట్రంలో రోడ్లు-భవనాల శాఖ పరిధిలోని రోడ్లకు రూ.225 కోట్ల మేర నష్టం వాటిల్లింది. వరద ప్రవాహంతో 201 చోట్ల రోడ్లపై నుంచి నీరు ప్రవహించింది. మొత్తం 334 ప్రాంతాల్లో 23.041 కి.మీ మేర రోడ్లు దెబ్బతిన్నట్టు ఆర్ అండ్ బీ అధికారులు గుర్తించారు. 8 చోట్ల రోడ్లు కోతకు గురవ్వగా 156 చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వీటిలో కొన్నింటిని పరిష్కరించి, ట్రాఫిక్‌ను మళ్లించారు. ఈ పనుల తాత్కాలిక మరమ్మతులకు రూ.6.96 కోట్లు, శాశ్వత పనులకు రూ.225.75 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదించారు. కాగా రాష్ట్రంలో కురిసే వర్షాల పట్ల ఆర్ అండ్ బీ శాఖ అప్రమత్తంగా ఉందని, సీఎం రేవంత్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే శాఖ ఈఎన్‌సీలు, సీఈలు అంతా క్షేత్రస్థాయిలో ఉన్నారని తెలిపారు. అకాల వర్షాలతో నష్టపోయిన నల్లగొండ జిల్లా రైతాంగంపై ప్రత్యేక దృష్టి సారించి ఆదుకోవాలని సీఎం రేవంత్‌ను విజ్ఞప్తి చేశారని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) ఆధ్వర్యంలో పలు సంస్థల సహకారంతో ఉద్యోగ అవకాశాల కోసం నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. శిక్షణతో పాటు ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. వివరాల కోసం 8008937800/ 9032504507 నంబర్లను సంప్రదించాలని న్యాక్ అధికారులు సూచించారు.




నల్లగొండ జిల్లా చందంపేట మండలం నక్కలగండితండాలో నీట మునిగిన పత్తిచేలు, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్‌లో మృతి చెందిన కోడిపిల్లలు

4,47,864 ఎకరాల్లో పంట నష్టం

(మొదటిపేజీ తరువాయి)

వరంగల్, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పంట నష్టం తీవ్రంగా ఉందని తేల్చింది. ఈ మేరకు గురువారం వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికను సమర్పించింది.

ప్రభావిత ప్రాంతాల్లో సర్వే చేసి..

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ, కరీంనగర్ జిల్లాల్లో మొంథా తుఫాను ప్రభావానికి పంటలు దెబ్బతిన్నాయి. కొనుగోలు కేంద్రాల్లో వరి, మక్కలు, పత్తి తడిసిపోయాయి. ఈ క్రమంలో వ్యవసాయ శాఖ బుధ, గురువారాల్లో ప్రాథమిక సర్వే నిర్వహించింది. 2,82,379 ఎకరాల్లో వరి, 1,51,707 ఎకరాల్లో పత్తి, 4,963 ఎకరాల్లో మొక్కజొన్న, 3,613 ఎకరాల్లో మిర్చి, 1,228 ఎకరాల్లో పప్పు ధాన్యాలు, 2,674 ఎకరాల్లో వేరుశనగ, 1,300 ఎకరాల్లో ఉద్యాన పంటలు కలిపి మొత్తం 4,47,864 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు గుర్తించింది. అత్యధికంగా వరంగల్ జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 80,500 మంది రైతులు నష్టపోయారు. ఖమ్మం జిల్లాలో 62,400 ఎకరాలు, సూర్యాపేటలో 56,330, నల్లగొండలో 52,071 ఎకరాల్లో పంటనష్టం జరిగింది. ఇక నష్టంపై పూర్తిస్థాయి సర్వే చేపట్టాలని వ్యవసాయ మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు.


జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెంలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతు మంద పద్మ

సమగ్ర సర్వే తర్వాత పంటనష్టం నిర్ధారణ

తుఫాను, భారీ వర్షాలతో వచ్చిన వరదల ప్రభావం ఇంకా తగ్గలేదు. అధికారులు పూర్తిస్థాయిలో క్షేత్ర పర్యటనలు చేయలేదు. సమగ్ర సర్వే చేపడితే పంట నష్టంపై కచ్చితమైన నిర్ధారణకు వచ్చే అవకాశాలున్నాయి. దీనితో వ్యవసాయ, రెవెన్యూ, ఉద్యాన, అనుబంధ శాఖల అధికారులతో బృందాలను ఏర్పాటుచేసి సమగ్ర సర్వే చేపట్టి.. నష్ట శాతాన్ని తేల్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. వరద నీళ్లు తగ్గాగానే కొన్ని పంటలు కోలుకునే అవకాశాలు ఉంటాయి. దానికి తోడు ఎక్కడైనా, ఏదైనా పంట 33శాతానికి మించి దెబ్బతింటేనే నష్టపరిహారం కోసం సిఫారసు చేయాలనే నిబంధన ఉంది. పంటలు ప్రస్తుమున్న దశను బట్టి నష్టశాతం ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో మూడు ప్రధాన పంటలు దిగుబడికి ముందు దశలో ఉండటంతో నష్టశాతం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం: తుమ్మల

మొంథా తుఫాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రకటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటిస్తారని తెలిపారు. ఎకరానికి ఎంత నష్టపరిహారం ఇవ్వాలనే దానిపై సీఎంతో చర్చించిన తర్వాత ప్రకటిస్తామని చెప్పారు. నష్టపోయిన రైతులకు పరిహారం తప్పకుండా చెల్లిస్తామని భరోసా ఇచ్చారు.

ఎకరానికి పది వేల పరిహారం?

రాష్ట్రంలో ప్రస్తుతం పంటల బీమా పథకం అమల్లో లేదు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని కూడా అమలు చేయటం లేదు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు రాష్ట్ర ప్రభుత్వమే సర్వే చేయించి, నష్టపరిహారం ఇస్తోంది. గత ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం ఇచ్చింది. ఇప్పుడు కూడా అదే తరహాలో ఎకరానికి రూ.10వేల చొప్పున పంపిణీ చేయవచ్చని వ్యవసాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ప్రాథమిక నివేదిక ప్రకారం చూస్తే.. 4.48 లక్షల ఎకరాల్లో పంట నష్టానికి రూ.448 కోట్ల నష్టపరిహారం చెల్లించాల్సి రానుంది.


కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలో నీటమునిగిన వరిని చూపిస్తున్న రైతు


భూపాలపల్లి జిల్లా కాటారం మండలం పోతులవాయిలో వరి పంటలో నిలిచిన వర్షం నీరు

మొంథా బాధితులను ఆదుకుంటాం

- కేంద్రం సహకరించకున్నా ఎకరాకు రూ.10 వేల పరిహారం
- ఖమ్మం మున్నేరు ప్రాంతంలో మంత్రి తుమ్మల పర్యటన


ఖమ్మం నయాబజార్ పాఠశాలలోని పునరావాస కేంద్రంలో బాధితుల గోడు వింటున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంట నష్టపోయిన రైతులతోపాటు మొంథా తుపాను బాధితులందరినీ ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. గత వరదల సమయంలో కేంద్రం ఒక్క రూపాయి కూడా సాయం చేయలేదని, ఇప్పుడూ సహకరించకున్నా.. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల పరిహారం అందిస్తామని తెలిపారు. ఖమ్మంలోని మున్నేరు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం పర్యటించిన తుమ్మల.. వరద ముంపు పరిస్థితిని తెలుసుకున్నారు. ముంపు ప్రాంతాలైన బొక్కలగడ్డ, పద్మావతి నగర్ తదితర కాలనీలను పరిశీలించారు. నయాబజార్ పాఠశాలలోని పునరావాస కేంద్రానికెళ్లి వరద బాధితులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా తమ గోడు వెల్లబోసుకున్న బాధితులకు అండగా ఉంటామని.. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. వరదల ప్రభావాన్ని అంచనా వేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం వరంగల్, కరీంనగర్, హనుమకొండ, హుస్నాబాద్, సిద్దిపేట జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తామని తుమ్మల వెల్లడించారు.

జోరుగా ఆరోగ్య బీమా

- ఇటీవలి కాలంలో ఏకంగా 38% వృద్ధి
- జీఎస్టీ ఎత్తివేతే ప్రధాన కారణం : పాలసీ బజార్ నివేదిక

న్యూఢిల్లీ, అక్టోబరు 30: ఆరోగ్యబీమా పథకాలపై కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీని తొలగించడంతో ఆరోగ్య బీమా పట్ల ప్రజల్లో ఆసక్తి గణనీయంగా పెరిగింది. హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటున్న వారి సంఖ్య ఇటీవలికాలంలో 38శాతం వృద్ధి చెందిందని ప్రముఖ ఆన్‌లైన్ ఇన్సూరెన్స్ సంస్థ పాలసీ బజార్ వెల్లడించింది. ఈమేరకు విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గతంలో పాలసీదారులు ఎంచుకునే ఆరోగ్య బీమా కవరేజీ సగటున రూ.13 లక్షలు ఉండగా.. ఇప్పుడది రూ.18 లక్షలకు పెరిగింది. కొత్తగా ఆరోగ్య బీమా తీసుకుంటున్న వారిలో దాదాపు సగం (45%) మంది రూ.15-25 లక్షల కవరేజీని ఎంచుకుంటున్నారు. 24% మంది రూ.10-15 లక్షల కవరేజీకి మొగ్గు చూపుతుండగా..18% మంది రూ.10 లక్షలలోపు కవరేజీ తీసుకుంటున్నారు. ఇప్పటికే ఆరోగ్యబీమా ఉన్న వారు జీఎస్టీ తొలగింపు అనంతరం.. ఉన్న పాలసీకి మరిన్ని కొత్త సదుపాయాలను ఎంపిక చేసుకుంటూ అవసరమైన అదనపు ప్రీమియం చెల్లిస్తున్నారు. 61ఏళ్లు, ఆపై వయస్కుల్లో ఎక్కువ మొత్తం కవరేజీతో కూడిన బీమా పథకాల పట్ల ఆసక్తి 11.5% పెరిగింది. చిన్న పట్టణాల్లోనూ హెల్త్ ఇన్సూరెన్స్‌పై ఆసక్తి పెరుగుతోంది. భారీ కవరేజీ ఉన్న బీమా పథకాలు తీసుకుంటున్నారు. మొత్తంగా ఆరోగ్యబీమాపై దేశ వ్యాప్తంగా ప్రజల్లో ఆసక్తి గణనీయంగా పెరిగిందని, జీఎస్టీ ఎత్తివేతే దీనికి ప్రధాన కారణమని పాలసీ బజార్ నివేదిక వెల్లడించింది.

నేతాజీ విమాన ప్రమాదంలో చనిపోలేదు

- ఇది దేవర్ మాట: ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

చెన్నై, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): 'నేతాజీ విమాన ప్రమాదంలో చనిపోలేదనే నేను నమ్ముతున్నాను. అయితే దీనిని నిరూపించడానికి నావద్ద ఎలాంటి ఆధారం లేదు' అని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ (సీపీఆర్) అన్నారు. తమిళనాడులోని రామనాథపురం జిల్లా పసుంపొన్ గ్రామంలో గురువారం జరిగిన స్వాతంత్ర్య సమరయోధుడు ముత్తురామలింగ దేవర్ జయంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. దేవర్ స్మారక స్థలం వద్ద నివాళులర్పించారు. ఆ సందర్భంగా సీపీఆర్ విలేకరులతో మాట్లాడుతూ.. 'దేవర్... నేతాజీకి బలమైన మద్దతుదారుడు. ఆయన తన జీవితకాలంలో ఎన్నడూ అబద్ధమాడలేదు. ఆయన, 'నేతాజీ విమాన ప్రమాదంలో చనిపోలేదు. అయనను నేను కలిశాను' అని చెప్పారు.

2020 ఢిల్లీ అల్లర్ల వెనుక పెద్ద కుట్ర

- సుప్రీంలో ఢిల్లీ పోలీసుల కౌంటర్ అఫిడవిట్

న్యూఢిల్లీ, అక్టోబరు 30: ఈశాన్య ఢిల్లీలో 2020లో జరిగిన మత అల్లర్ల వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, దేశ స్వరూపాన్ని మార్చాలనే లక్ష్యంతో చాలా జాగ్రత్తగా ఈ అల్లర్లను నిందితులు ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్ తదితరులు సృష్టించారని పోలీసులు సుప్రీంకోర్టుకు తెలిపారు. వారి బెయిల్ పిటిషన్లను తిరస్కరించాలంటూ గురువారం కౌంటర్ అఫిడవిట్‌ను సమర్పించారు. భారత పర్యటనలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశరాజధానిలో ఉన్న సమయంలోనే అక్కడ మత అల్లర్లు రేపాలని నిందితులు కుట్ర చేశారని, వారి చాట్ మెసేజ్‌ల్లో ట్రంప్ పేరు రికార్డయిందని ఆ అఫిడవిట్‌లో పోలీసులు పేర్కొన్నారు.

'అవినీతి' యువరాజులు!

- రాహుల్, తేజస్విపై ప్రధాని మోదీ ఫైర్

ఛాప్రా/ముజఫర్‌పూర్, అక్టోబరు 30: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ, ఆర్‌జేడీ నేత తేజస్వి యాదవ్ అవినీతి యువరాజులని ప్రధాని మోదీ విమర్శించారు. వీరిలో ఒకరు దేశంలోనే అత్యంత అవినీతి కుటుంబానికి చెందిన వారని.. వేరొకరు బిహార్లో అత్యంత అవినీతిమయ కుటుంబసభ్యుడని విరుచుకుపడ్డారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీ గురువారం ముజఫర్‌పూర్, ఛాప్రా సభల్లో ప్రసంగించారు. 'ఈ ఇద్దరూ 24 గంటలూ నన్ను ద్వేషిస్తారు.. అవమానాలపాల్జేయాలని చూస్తారు. శాపనార్థాలు పెడుతూనే ఉంటారు. ఎందుకంటే వెనుకబడిన పేద కుటుంబానికి చెందిన వ్యక్తి ప్రధాని స్థాయికి ఎదగడం వారు సహించలేకపోతున్నారు. బుధవారం ఈ ఇద్దరూ నన్ను దూషించారు. అలా తిట్టడం తమ జన్మహక్కుగా భావిస్తున్నారు' అని ఆయన ధ్వజమెత్తారు.

సామ్రాట్ చౌదరికి 'పెద్ద పదవి'

- బిహార్ అసెంబ్లీ ఎన్నికల సభలో హోంమంత్రి అమిత్‌షా

పట్నా, అక్టోబరు 30: బిహార్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రస్తుత డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరికి ప్రధాని మోదీ 'పెద్ద పదవి' ఇవ్వనున్నారని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముంగేర్ జిల్లా తారాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో గురువారం బహిరంగ సభలో అమిత్‌షా ఈ వ్యాఖ్యలు చేశారు. 'మీరు ఆయన (సామ్రాట్ చౌదరి)కు ఓటేసి విజయాన్ని ఖరారు చేయండి. కొన్ని రోజుల్లోనే ఆయనకు ప్రధాని మోదీ.. 'చాలా పెద్ద పదవి' ఇవ్వనున్నారు'అని తెలిపారు. జేడీయూ అధినేత, బిహార్ సీఎం నితీశ్ కుమార్‌ను పక్కకు నెట్టేసి.. తమ నేతను సీఎంగా నియమించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్న విపక్షాల విమర్శల నేపథ్యంలో అమిత్‌షా వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది.

ట్రంప్‌ను ఎదుర్కొనే ధైర్యం మోదీకి లేదు: రాహుల్

నలంద, అక్టోబరు 30: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఎదుర్కొనే ధైర్యం ప్రధాని మోదీకి లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. బిహార్‌లోని నలంద, షేక్‌పురాలో గురువారం జరిగిన ఎన్నికల ర్యాలీల్లో ఆయన మాట్లాడారు. "భారత్- పాక్ యుద్ధం తన వల్లే ఆగిందని ట్రంప్ పదే పదే ప్రకటించుకుంటున్నారు. అది నిజం కాకపోతే ట్రంప్ అబద్ధాలు ఆడుతున్నారని మోదీ చెప్పాలి. మోదీకి నిజంగా ధైర్యం ఉంటే ఆ పని చేయాలి" అని సవాల్ విసిరారు. మోదీ అమెరికాకు వెళ్లాలనుకున్నా.. ట్రంప్‌నకు భయపడి వెళ్లడం లేదని విమర్శించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో 'ఓట్ చోరీ'కి పాల్పడి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే, ఇప్పుడు రాజ్యాంగాన్ని నాశనం చేయడానికి కంకణం కట్టుకుందని ఆయన అన్నారు.

ఆంక్షల నుంచి 'చాబహర్'కు మినహాయింపులు

- 6 నెలలు కొనసాగుతాయని అమెరికా వెల్లడి

వాషింగ్టన్, న్యూఢిల్లీ, అక్టోబరు 30: ఇరాన్‌లోని చాబహర్ పోర్టుపై ఆంక్షలకు సంబంధించి ఆరు నెలల పాటు మినహాయింపులు కొనసాగుతాయని అమెరికా స్పష్టంచేసింది. దీంతో ఈ ఓడరేవుపై భారీగా పెట్టుబడులు పెట్టిన భారత్‌కు ఊరట లభించినట్లైంది. ఈ పోర్టుపై గత ఏడాది మే 13న ఇరాన్-భారత్ మధ్య ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం రాబోయే పదేళ్ల పాటు పోర్టులోని షహీద్ బెహెస్తీ టెర్మినల్ అభివృద్ధి, నిర్వహణ భారత్‌దే. గత ఏడాది ఈ ఒప్పందం కుదరగానే భారత్‌ను అమెరికా హెచ్చరించింది. ఇరాన్‌పై తాము ఆంక్షలు విధించామని, టెహ్రాన్‌తో వ్యాపార లావాదేవీలు నడిపితే ఆంక్షలు అమలవుతాయని స్పష్టంచేసింది. అయితే ఈ పోర్టు అభివృద్ధి వల్ల ఈ ప్రాంతానికంతటికీ మేలు జరుగుతుందని, ఆంక్షలు విధించవద్దని భారత్ హితవు పలికింది. దీంతో అగ్రరాజ్యం చాబహర్ పోర్టు వరకు ఆంక్షల నుంచి మినహాయింపు ఇచ్చింది. మినహాయింపుల గడువు గురువారంతో ముగిసిన నేపథ్యంలో మరో ఆరు నెలలు పొడిగించింది.

ఫిబ్రవరి 17 నుంచి 10, 12 తరగతుల పరీక్షలు

- బోర్డు పరీక్షల షెడ్యూల్ వెల్లడించిన సీబీఎస్ఈ

న్యూఢిల్లీ, అక్టోబరు 30: వచ్చే ఏడాది ఫిబ్రవరి 17 నుంచి 10వ, 12వ తరగతి బోర్డు పరీక్షలు ప్రారంభమవుతాయని కేంద్ర మాధ్యమిక విద్యా మండలి (సీబీఎస్ఈ) గురువారం ప్రకటించింది. మార్చి 10న 10వ తరగతి, ఏప్రిల్ 9న 12వ తరగతి పరీక్షలు ముగుస్తాయని తెలిపింది. సీబీఎస్ఈ 10వ, 12 తరగతి బోర్డు పరీక్షల నిర్వహణ తేదీలను 110 రోజుల ముందే ప్రకటించడం ఇదే తొలిసారి. అలాగే, ఈ విద్యా సంవత్సరం నుంచే రెండు దఫాలు 10వ తరగతి బోర్డు పరీక్షలు నిర్వహించడం ఇదే ప్రథమం. రెండో దఫా 10వ తరగతి బోర్డు పరీక్షలు మే 15 నుంచి జూన్ ఒకటో తేదీ వరకూ నిర్వహించడంతోపాటు రెండు సబ్జెక్టుల మధ్య విద్యార్థుల ప్రిపరేషన్‌కు మరో రోజు అదనపు సమయం ఇస్తున్నట్లు సీబీఎస్ఈ తెలిపింది.

పాటలు పాడి, గుసగుసలాడే ఏఐ..'లూనా'

- భారత్‌కు చెందిన 25 ఏళ్ల యువకుడి ఆవిష్కరణ



జైపూర్, అక్టోబరు 30: జైపూర్ కేంద్రంగా పని చేసే పీక్సా ఏఐ అనే స్టార్టప్ కంపెనీ వ్యవస్థాపకుడైన స్పర్ష్ అగర్వాల్ అనే 25 ఏళ్ల యువకుడు కృత్రిమ మేధ(ఏఐ)కి సంబంధించి అద్భుతమైన ఆవిష్కరణ చేశారు. ప్రపంచంలోనే తొలి స్పీచ్ టు స్పీచ్ ఏఐ మోడల్.. అంటే మనుషుల మాటలు విని తిరిగి మాటల రూపంలోనే బదులిచ్చే ఏఐని అభివృద్ధి చేసి అందుబాటులోకి తెచ్చారు. 'లూనా' అనే పేరు కలిగిన ఈ ఏఐ మోడల్.. మనిషి మాట్లాడే మాటలకు అచ్చం మనిషిలానే స్పందించి మాటలతోనే బదులిస్తుంది. లూనా గుసగుసలాడుతుంది, కబుర్లు చెబుతుంది, మాట్లాడే విషయానికి అనుగుణంగా తన గొంతు సవరించుకుంటుంది.. అంతేనా సొంతంగా పాటలు కూడా పాడుతుంది. సరిగ్గా చెప్పాలంటే ఏఐతో కాదు ఓ మనిషితోనే మాట్లాడుతున్నామనేలా పని చేస్తుంది. ఐఐటీ భువనేశ్వర్ పట్టభద్రుడైన స్పర్ష్ అగర్వాల్.. పెద్దగా సాంకేతిక మౌలిక సదుపాయాలు, లక్షల కోట్ల పెట్టుబడులు లేకుండానే ఈ ఆవిష్కరణ చేశారు. జీపీయూ(గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్)లు, క్లౌడ్ క్రెడిట్‌లు అద్దెకు తీసుకొని, క్రెడిట్ కార్డు ద్వారా అప్పులు చేసి స్పర్ష్ లూనాను అభివృద్ధి చేశారు. స్పర్ష్ బృందంలో నితీశ్ కార్తీక్, అపూర్వ్ సింగ్, ప్రత్యూష్ కుమార్ సభ్యులు కాగా మరో ముగ్గురు ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సాయం అందించారు. ఎక్స్ వేదికగా బుధవారం(అక్టోబరు 29న) లూనాను ప్రపంచానికి పరిచయం చేసిన స్పర్ష్.. లూనా సామర్థ్యాన్ని తెలిపే ఓ వీడియోను పోస్ట్ చేశారు. భావోద్వేగాలను అర్థం చేసుకుని వాటికి అనుగుణంగా పని చేసే ఏఐ మోడళ్ల అభివృద్ధికి భారతదేశాన్ని కేంద్రంగా మార్చడమే తన లక్ష్యమని స్పర్ష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

చైనాతో ట్రంప్ రాజీ!

- సుంకాలు 57% నుంచి 47%కు తగ్గింపు
- జిన్‌పింగ్‌తో చర్చల తర్వాత ట్రంప్ ప్రకటన



బుసాన్, అక్టోబరు 30: భారీ స్థాయిలో సుంకాలు విధిస్తామంటూ చైనాపై అంతెత్తున లేచిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. అందుకు భిన్నంగా రాజీకి వచ్చారు. అదే సమయంలో చైనా కూడా కొంతమేర దిగి వచ్చింది. ట్రంప్ చైనాపై సుంకాలను పది శాతం తగ్గించగా.. అరుదైన లోహాల సరఫరాపై నియంత్రణలను వాయిదా వేసేందుకు, అమెరికా సోయా ఉత్పత్తులను దిగుమతి చేసుకునేందుకు చైనా అంగీకరించింది. గురువారం దక్షిణకొరియాలోని బుసాన్‌లో చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం ట్రంప్ ఈ వివరాలను వెల్లడించారు. ఏపీఈసీ సదస్సులో పాల్గొనేందుకు దక్షిణ కొరియాకు వచ్చిన ట్రంప్, జిన్‌పింగ్.. గురువారం ఉదయం బుసాన్ విమానాశ్రయంలో సుమారు రెండు గంటల పాటు భేటీ అయ్యారు. అనువాదకుల సాయంతో కీలక అంశాలపై చర్చించారు. అనంతరం ట్రంప్ అమెరికాకు తిరుగుప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. "భేటీ అద్భుతంగా జరిగింది. దీనికి పదికి 12 మార్కులు ఇవ్వొచ్చు. చైనాపై సుంకాలను ప్రస్తుతమున్న 57శాతం నుంచి 47శాతానికి తగ్గిస్తున్నాం. అరుదైన లోహాల సరఫరాపై విధించిన నియంత్రణలను ఏడాది పాటు వాయిదా వేసేందుకు చైనా అంగీకరించింది. అమెరికా నుంచి సోయాబీన్ ఉత్పత్తులను దిగుమతి చేసుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది" అని ట్రంప్ వెల్లడించారు. అమెరికా నుంచి ఇంధనం కొనుగోలుకు జిన్‌పింగ్ ముందుకొచ్చారని.. ఫెంటానిల్ మత్తుమందు, దాని మూల పదార్థాల సరఫరాను అరికట్టడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని ఆపే అంశంపైనా చర్చించామన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తాను చైనాలో పర్యటిస్తానని, ఆ తర్వాత జిన్‌పింగ్ కూడా అమెరికాలో పర్యటిస్తారని ట్రంప్ చెప్పారు. ఇక చైనా వాణిజ్య శాఖ కూడా అరుదైన లోహాల సరఫరా, సోయా ఉత్పత్తుల దిగుమతులపై ట్రంప్, జిన్‌పింగ్ మధ్య ఒప్పందం కుదిరినట్లు ప్రకటించింది. అయితే కీలకమైన ఎన్‌వీడియా చిప్‌సెట్లను చైనాకు అనుమతించడం, తైవాన్ వివాదం, అమెరికాలో టిక్‌టాక్‌పై నిషేధం ఎత్తివేత, రష్యా చమురు కొనుగోళ్ల వంటి అంశాలపై ట్రంప్-జిన్‌పింగ్ మధ్య చర్చలు జరగలేదు. దీనితో తాజా ఒప్పందంతో పెద్దగా ప్రయోజనం లేదని మార్కెట్ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాగా, భారత్‌లోని నాలుగు కంపెనీలు అరుదైన (రేర్ ఎర్త్) అయస్కాంతాలను దిగుమతి చేసుకునేందుకు చైనా నుంచి లైసెన్సులు పొందాయని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ గురువారం వెల్లడించారు. దీనికి సంబంధించి ఇతర వివరాలేవీ వెల్లడించలేదు.

కెనడాపై టారిఫ్‌లు ఎత్తివేసేందుకు సెనేట్ తీర్మానం

కెనడాపై ట్రంప్ వేసిన అడ్డగోలు టారిఫ్‌లను ఎత్తివేయాలంటూ అమెరికా చట్టసభ సెనేట్ తీర్మానం చేసింది. ఈ తీర్మానానికి అనుకూలంగా 50, వ్యతిరేకంగా 46 ఓట్లు వచ్చాయి. ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ సెనేటర్ టిమ్‌కైన్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, డెమొక్రాట్లతోపాటు అధికార రిపబ్లికన్ పార్టీకి చెందిన నలుగురు సెనేటర్లు కూడా దానికి మద్దతుగా ఓటు వేయడం గమనార్హం. గతంలోనూ ఇదే తరహాలో ట్రంప్‌కు అడ్డగోలుగా టారిఫ్‌లు వేసే అధికారం లేదంటూ సెనేట్ తీర్మానం చేసింది. కానీ రిపబ్లికన్లకు ఎక్కువ పట్టున్న ప్రతినిధుల సభ ఆ తీర్మానాన్ని చేపట్టేందుకు తిరస్కరించింది. తీర్మానం అమల్లోకి రావాలంటే.. ఇరు సభలు ఆమోదించాల్సిందే.

వర్క్ పర్మిట్ల ఆటో-రెన్యువల్‌కు అమెరికా స్వస్తి

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తమవుతోంది. ఈఏడీ పునరుద్ధరణ కోసం అక్టోబరు 30, ఆ తర్వాత దరఖాస్తు చేసే వలసదారులకు ఇకపై ఆటోమేటిక్ రెన్యువల్ వర్తించదని డీహెచ్ఎస్ స్పష్టం చేసింది. ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ (ఈఏడీ)ను పొడిగించే ముందు వలస కార్మికుల నేపథ్యాన్ని సమగ్రంగా పరిశీలించడంతో పాటు వారి సోషల్ మీడియా ఖాతాలను జల్లెడ పట్టేందుకు ఈ నూతన నిబంధనను అమలులోకి తెచ్చినట్లు తెలిపింది. ఇమిగ్రేషన్ మోసాలను అరికట్టడానికి, జాతి ప్రయోజనాలకు భంగం కలిగించేవారిని గుర్తించి, దేశం నుంచి బహిష్కరించడానికి తాజా నిబంధన వీలు కల్పిస్తుందని పేర్కొంది. బైడెన్ ప్రభుత్వంలో వలస కార్మికుల వర్క్ పర్మిట్ గడువు ముగిసినప్పటికీ, దాని పునరుద్ధరణ కోసం సకాలంలో రెన్యువల్ కోసం దరఖాస్తు చేసి ఉంటే వారు 540 రోజుల పాటు ఉద్యోగంలో కొనసాగడానికి అనుమతించేవారు. ఇప్పుడు దీని స్థానంలో తాజా నిబంధన అమలు కానుంది. ఈ నేపథ్యంలో వలసదారులు తమ ఈఏడీ గడువు ముగియడానికి 180 రోజుల ముందే రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



అణు పరీక్షలు వెంటనే మొదలుపెట్టండి

- పెంటగాన్‌కు ట్రంప్ ఆదేశం
- దూకుడుగా వ్యవహరిస్తున్న రష్యా, చైనాలకు దీటుగా నిలిచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడి

బుసాన్, అక్టోబరు 30: ప్రచ్ఛన్న యుద్ధకాలంలో దూకుడుగా సాగిన 'అణ్వస్త్ర' పోటీ మళ్లీ మొదలవుతోంది. అణ్వస్త్రాల విషయంలో రష్యా, చైనా దూకుడు మీద ఉన్నాయని, ఈ నేపథ్యంలో అమెరికా కూడా అణు పరీక్షలు నిర్వహిస్తుందని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దక్షిణకొరియాలోని బుసాన్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీకి ముందు ట్రూత్ సోషల్‌లో దీనికి సంబంధించి పోస్టు పెట్టడం గమనార్హం. అంతేకాదు అమెరికాకు తిరిగి వెళుతుండగా ఎయిర్‌ఫోర్స్‌వన్ విమానంలోనూ ఆయన మీడియాతో మాట్లాడారు. "ఇతర దేశాలు అణు పరీక్షలు చేస్తున్నాయి. ఆ దూకుడుకు దీటుగా నిలిచేందుకు అమెరికా కూడా అణు పరీక్షలు నిర్వహించడం సమంజసమని భావిస్తున్నాను. వెంటనే మన అణు పరీక్షలు మొదలుపెట్టాలని యుద్ధ శాఖను (రక్షణ శాఖకు ట్రంప్ పెట్టిన పేరు) ఆదేశించాను. అణుశక్తిలో ఇప్పుడైతే రష్యా రెండో స్థానంలో ఉంది. చాలా దూరంలోనే అయినా చైనా మూడో స్థానంలో ఉంది. కానీ ఐదేళ్లలో దగ్గరికి చేరుకోవచ్చు" అని ట్రంప్ పేర్కొన్నారు. అణు పరీక్షలు నిర్వహించే ప్రాంతాలను త్వరలో ఎంపిక చేస్తామని చెప్పారు. నిజానికి తాను అణు నిరాయుధీకరణను కోరుకుంటానని, దీనిపై రష్యాతో ఇప్పటికే మాట్లాడుతున్నానని పేర్కొన్నారు.

అణ్వస్త్ర పోటీకి దారితీస్తుందా?

అణు పరీక్షలు నిర్వహించాలన్న ట్రంప్ నిర్ణయంతో మళ్లీ అణ్వస్త్ర పోటీ మొదలవుతుందేమోనన్న చర్చలు మొదలయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా అణ్వస్త్ర సామర్థ్యమున్న దేశాలు 1996లో 'సమగ్ర అణు పరీక్షల నిషేధ ఒప్పందం' కుదుర్చుకున్నాయి. అయితే రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆ ఒప్పందం నుంచి బయటికి వస్తున్నట్టు 2023లో ప్రకటించారు. అమెరికాకు చెందిన ఆర్మ్స్ కంట్రోల్ అసోసియేషన్ లెక్కల ప్రకారం ప్రస్తుతం అమెరికా వద్ద 5,225 అణ్వస్త్రాలు, రష్యా వద్ద 5,580 అణ్వస్త్రాలు ఉన్నాయి. ఇక సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ నివేదిక ప్రకారం.. 2020లో చైనా వద్ద 300 అణ్వస్త్రాలు ఉండగా, ప్రస్తుతం 600కు చేరాయి. 'ఇంటర్నేషనల్ క్యాంపెయిన్ టు అబొలిష్ న్యూక్లియర్ వెపన్స్ (ఐసీఏఎన్‌డబ్ల్యూ) గణాంకాల ప్రకారం.. ఫ్రాన్స్ వద్ద 290 అణ్వస్త్రాలు, యూకే 225, భారత్ 180, పాకిస్థాన్ 170, ఇజ్రాయెల్ 90, ఉత్తరకొరియా వద్ద 50 అణ్వస్త్రాలు ఉన్నాయి.



ఎండ తగలని జీవితాలు..!

- దేశంలోని 46.5 శాతం మందిలో విటమిన్-డి లోపం
- పట్టణ ప్రజల్లోనే అత్యధిక బాధితులు
- మెట్రోపోలిస్ హెల్త్‌కేర్ అధ్యయనం

న్యూఢిల్లీ, అక్టోబరు 30: పట్టణాల్లో ప్రజల జీవితాలు ఎండ కన్నే సోకనివి అయిపోయాయి. ఉదయం ఆఫీసుకు వెళ్లడం మొదలు.. రాత్రి ఇంటికి చేరుకోవడం వరకు ఎక్కడా సూర్యకిరణాలు శరీరానికి తగలడంలేదు. దీంతో మన శరీరంలో స్వతహాగా విటమిన్-డి ఉత్పత్తి జరగడంలేదు. మన దేశంలో కౌమార వయసు వారు మొదలు.. ఉద్యోగాలు చేసే వారి వరకు వివిధ వయసుల ప్రజల్లో విటమిన్-డి లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మెట్రోపోలిస్ హెల్త్‌కేర్ లిమిటెడ్ సంస్థ జాతీయ స్థాయిలో చేసిన అధ్యయనం ద్వారా అది వెల్లడైంది. దేశంలో 46.5 శాతం మంది ప్రజల్లో విటమిన్-డి లోపం ఉందని 2019-25 మధ్య చేసిన 22 లక్షల ల్యాబ్ పరీక్షలను విశ్లేషించి ఆ సంస్థ చెప్పింది. అలాగే 26 శాతం మందిలో ఆ విటమిన్ చాలినంత స్థాయిలో కూడా లేదని పేర్కొంది. పట్టణాల్లో నివసించే ప్రజల్లో ఈ లోపం ఎక్కువగా కనిపిస్తోందని వెల్లడించింది.

నా భార్య ఉష క్రైస్తవంలోకి మారొచ్చు

- అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్య

వాషింగ్టన్, అక్టోబరు 30: హిందువుగా ఉన్న తన భార్య ఉషా వాన్స్ ఏదో ఒక రోజున క్రైస్తవ మతంలోకి మారే అవకాశం ఉందని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ అభిప్రాయపడ్డారు. ఒకవేళ మారకపోయినా తనకేమీ ఇబ్బంది లేదని చెప్పారు. బుధవారం మిస్సిసిపీలో జరిగిన టర్నింగ్ పాయింట్ యూఎస్ఏ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "ప్రస్తుతం ఉష నా వెంట ప్రతి ఆదివారం చర్చికి వస్తోంది. ఆమెకు చెప్పాను.. ఇప్పుడు బహిరంగంగా చెబుతున్నాను.. నాకు అత్యంత సన్నిహితులైన పది వేల మంది స్నేహితుల ముందు చెబుతున్నా... చర్చి కారణంగా నేను ప్రభావితమైనట్టే ఆమె కూడా ప్రభావితమవుతుందని ఆశిస్తున్నా. అలా జరగాలని నేను నిజాయితీగా కోరుకుంటున్నా. ఎందుకంటే క్రైస్తవ సువార్తపై నాకు విశ్వాసం ఉంది. నా భార్య కూడా అలాగే నడుస్తుందని భావిస్తున్నా" అని చెప్పారు. ఉష క్రైస్తవ మతాన్ని పుచ్చుకుంటారా అని ప్రేక్షకులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ చిట్టచివరకు ఆమె క్రీస్తు వద్దకు రావాల్సి ఉంది కదా! అని ఆయన వ్యాఖ్యానించారు.

ఆడిషన్స్ పేరుతో పిలిచి.. బందీలుగా..!

- 17 మంది పిల్లలు.. మరో ఇద్దర్ని కూడా
- ముంబైలోని పొవైలో ఘటన
- పోలీసుల భారీ రెస్క్యూ ఆపరేషన్
- ఎదురుకాల్పుల్లో నిందితుడి మృతి

ముంబై, అక్టోబరు 30: ఆడిషన్స్ పేరుతో స్టూడియోకు రప్పించి 17 మంది పిల్లలు (13 నుంచి 17 ఏళ్ల వయసు), మరో ఇద్దరు వ్యక్తులను పట్టపగలే బంధించి బెదిరింపులకు పాల్పడటం ముంబైలో సంచలనంగా మారింది. వారిని కాపాడేందుకు పోలీసులు భారీ రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలోనే నిందితుడు కాల్పులకు తెగబడగా.. పోలీసులు కూడా ఎదురు కాల్పులు జరిపి బందీలను క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. బుధవారం ముంబై పొవై ప్రాంతంలోని ఆర్ఏ యాక్టింగ్ స్కూల్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. రోహిత్ ఆర్య.. పిల్లలను బంధించి సామాజిక మాధ్యమాల్లో లైవ్ స్ట్రీమింగ్ పెట్టి మరీ బెదిరింపులకు పాల్పడటం వైరల్‌గా మారింది. 'నేను రోహిత్ ఆర్య. ఆత్మహత్య చేసుకోవడానికి బదులుగా ఒక ప్లాన్‌తో పిల్లలను ఇక్కడ బందీలుగా ఉంచాను. నేను ఉగ్రవాదిని కాదు.. డబ్బు అవసరం లేదు. నావి సాధారణ డిమాండ్లే.. నేను కొందరితో మాట్లాడాలనుకుంటున్నాను. ఆ డిమాండ్ నెరవేర్చకపోతే స్టూడియోను తగలబెడతా..' అంటూ నిందితుడు ముందు వీడియోలో హెచ్చరించాడు. దీనిపై సమాచారమందుకున్న ముంబై పోలీసులు.. అగ్నిమాపక దళంతో కలిసి సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. నిందితుడితో మాట్లాడేందుకు ప్రయత్నించగా అతడు నిరాకరించాడు. దీంతో బాత్రూం గది ద్వారా స్టూడియోలోనికి ప్రవేశించిన పోలీసులు.. 2గంటల పాటు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలోనే నిందితుడు కాల్పులకు తెగబడగా.. పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. దీంతో అతడు తీవ్రంగా గాయపడటంతో అదుపులోకి తీసుకొని.. 19 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఘటనా స్థలంలో ఓ ఎయిర్‌గన్, పలు రసాయనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొద్దిరోజులుగా అతడు మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని.. తన పనికి సంబంధించిన బకాయి డబ్బుల కోసమే ఇదంతా చేశాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటన వెనక ఇంకా ఎవరైనా ఉన్నారా అన్నది గుర్తించే పనిలో పడ్డారు.

అమెరికన్ స్టెంట్‌పై భారతీయ స్టెంట్ పైచేయి!

- టక్సెడో-2 పేరిట దేశవ్యాప్తంగా 66 కేంద్రాల్లో ట్రయల్
- తక్కువ వైఫల్య రేటుతో ప్రపంచ ప్రశంసలు పొందిన సుప్రాఫ్లెక్స్ క్రజ్
- హృద్రోగ నిపుణుల సమావేశంలో ట్రయల్ ఫలితాల వెల్లడి

శాన్‌ఫ్రాన్సిస్కో, అక్టోబరు 30: ఒకటేమో అంతర్జాతీయంగా పేరున్న, అమెరికాలో అగ్రస్థానంలో ఉన్న స్టెంట్! మరొకటి భారత దేశంలో తయారైన స్టెంట్!! ఈ రెండింటిలో ఏదో ఒకదాన్ని ఎంచుకోమంటే.. మెజారిటీ హృద్రోగులు అమెరికన్ స్టెంట్‌నే ఎంచుకుంటారు! కారణం.. విదేశీ వైద్య ఉపకరణాలపై ఉన్న నమ్మకం. కానీ.. ఒక ట్రయల్‌లో భాగంగా ఈ రెండు స్టెంట్ల పనితీరునూ పరీక్షించగా అమెరికన్ స్టెంట్‌తో పోలిస్తే భారతీయ స్టెంట్ వైఫల్య రేటే తక్కువగా ఉన్నట్టు తేలింది!! అమెరికన్ మార్కెట్ లీడర్‌ను సైతం తోసిరాజని అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఆ మేడిన్ ఇండియా హార్ట్ స్టెంట్ పేరు.. సుప్రాఫ్లెక్స్ క్రజ్. గుజరాత్‌లోని సూరత్ కేంద్రంగా పనిచేసే మెరిల్ లైఫ్ సైన్సెస్ ఈ స్టెంట్‌ను అభివృద్ధి చేసింది. దీని సామర్థ్యాన్ని పరీక్షించేందుకు.. ఢిల్లీలోని బాత్రా హాస్పిటల్ ఛైర్మన్, డీన్ అయిన డాక్టర్ ఉపేంద్ర కౌల్ దేశవ్యాప్తంగా 66 కార్డియాలజీ కేంద్రాల్లో 'టక్సెడో-2' పేరిట ట్రయల్స్ నిర్వహించారు. అవి కూడా మామూలు ట్రయల్స్ కావు.. అత్యంత క్లిష్టమైన 'మల్టీ వెసెల్ డిసీజ్'తో బాధపడుతున్న హృద్రోగులను ఇందుకు ఎంచుకున్నారాయన. సాధారణంగా గుండెకు రక్తసరఫరా చేసే ప్రధాన ధమనులు మూడు ఉంటాయి. వాటిలో ఒకటికి మించి ధమనుల్లో కొవ్వు పేరుకుపోయి బ్లాక్‌లు ఏర్పడితే.. దాన్ని మల్టిపుల్ వెసెల్ డిసీజ్ అంటారు. మూడు ధమనుల్లోనూ బ్లాక్స్ ఉంటే దాన్ని ట్రిపుల్ వెసెల్ డిసీజ్ అంటారు. దానికితోడు మధుమేహం వంటి ఇతర సమస్యలు కూడా ఉంటే వారికి చికిత్స చేయడం కష్టం. అలాంటిది.. డాక్టర్ ఉపేంద్ర కౌల్ మధుమేహంతో పాటు, అడ్వాన్స్‌డ్ దశలో ఉన్న ట్రిపుల్ వెసెల్ డిసీజ్ పేషెంట్లను 80% మందిని ఈ ట్రయల్‌లో భాగం చేశారు. ట్రయల్స్‌లో భాగంగా కొందరికి అమెరికాకు చెందిన జియెన్స్ స్టెంట్ వేశారు. మరికొందరికి సుప్రాఫ్లెక్స్ క్రజ్ స్టెంట్ వేశారు. అమెరికా స్టెంట్ వేయించుకున్నవారితో పోలిస్తే.. మన స్టెంట్ వేయించుకున్న పేషెంట్లలో టీఎల్ఎఫ్ (టార్గెట్ లీజన్ ఫెయిల్) తక్కువగా ఉన్నట్టు ఫలితాల్లో వెల్లడైంది. స్టెంట్ వేసిన తర్వాత రోగుల్లో కలిగే ప్రతికూల ఫలితాలను కొలిచే విధానమే టార్గెట్ లీజన్ ఫెయిల్. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అమెరికన్ స్టెంట్‌తో పోలిస్తే మన స్టెంట్ ఏమీ తక్కువ కాదని ఈ ట్రయల్ నిరూపించిందని డాక్టర్ కౌల్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఇక్కడ ముగిసిన ప్రపంచ కార్డియాలజిస్టుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు.

అనిల్ అంబానీ గ్రూప్‌లో 42,000 కోట్ల ఆర్థిక మోసాలు

- బయటపెట్టిన కోబ్రా పోస్ట్.. తోసిపుచ్చిన రిలయన్స్ గ్రూప్

న్యూఢిల్లీ, అక్టోబరు 30: అంబానీ సోదరుల్లో ఒకరైన అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూప్‌లో భారీ ఆర్థిక మోసం జరిగిందని ఇన్వెస్టిగేటివ్ పోర్టల్ కోబ్రా పోస్ట్ బయటపెట్టింది. 2006 సంవత్సరం నుంచి గ్రూప్ కంపెనీలు రూ.41,921 కోట్లకు పైబడిన నిధులు దారి మళ్లించాయని పేర్కొంది. అనిల్ అంబానీ గ్రూప్ మాత్రం ఈ ఆరోపణలను ఖండిస్తూ కంపెనీల షేరు ధరలు పడిపోయేలా చేసేందుకు చేస్తున్న దుష్ప్రచారంగా దాన్ని వివరించింది. రిలయన్స్ గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీలు రిలయన్స్ కమ్యూనికేషన్స్, రిలయన్స్ క్యాపిటల్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్, రిలయన్స్ కార్పొరేట్ అడ్వైజరీ సర్వీసెస్ బ్యాంక్ రుణాలు, ఐపీఓలు/బాండ్ల జారీ ద్వారా సేకరించిన నిధులు అన్నీ కలిపి రూ.28,874 కోట్లు ప్రమోటర్లతో అనుబంధం ఉన్న కంపెనీల్లోకి దారి మళ్లించినట్టు కోబ్రా పోస్ట్ ఆ కథనంలో తెలిపింది. ఇది కాకుండా మరో రూ.13,047 కోట్లు.. సింగపూర్, మారిషస్, సైప్రస్, బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్, అమెరికా, యూకేల్లోని విదేశీ సంస్థల నుంచి డొల్ల కంపెనీల ద్వారా మోసపూరితమైన విధానంలో దేశానికి తరలించారని కూడా ఆరోపించింది.

నిబంధనల ఉల్లంఘన

ఈ క్రమంలో కంపెనీల చట్టం, ఫెమా, పీఎంఎల్ఏ, సెబీ, ఆదాయపు పన్ను చట్టం వంటి విభిన్న చట్టాల్లోని నిబంధనలు ఉల్లంఘించినట్టు కూడా తెలిపింది. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, సెబీ, ఎన్‌సీఎల్‌టీ, ఆర్‌బీఐ, విదేశీ నియంత్రణ సంస్థల ఉత్తర్వులు, ఫైలింగ్‌ల ఆధారంగా తాను ఈ వివరాలు సేకరించినట్టు కోబ్రా పోస్ట్ తెలిపింది. ఈ నిధులను వ్యక్తిగత విలాసాల కోసం వినియోగించిన క్రమంలో ఒక ఉదాహరణ చూపుతూ 2008 సంవత్సరంలో అనిల్ అంబానీ తన గ్రూప్‌లోని ఒక లిస్టెడ్ కంపెనీ నిధులతో 2 కోట్ల డాలర్ల విలువ గల ఒక యాచ్ కొనుగోలు చేసినట్టు తెలిపింది. ఇలా నిధులు దారి మళ్లించేందుకు అనిల్ ధీరూభాయ్ గ్రూప్ (అడాగ్).. ప్రత్యేక కంపెనీలు లేదా ఎస్‌పీవీలు ఏర్పాటు చేసినట్టు పేర్కొంది. తొలుత ఈ కంపెనీలకు నిధులు బదిలీ చేసి ఆ తర్వాత వాటన్నింటినీ కొట్టి వేయడం వంటి చర్యల ప్రభావం వల్ల గ్రూప్‌లోని మొత్తం ఆరు లిస్టెడ్ కంపెనీలు ఆర్థిక కష్టాల్లో పడ్డాయని కోబ్రా పోస్ట్ వెల్లడించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.